V3 NEWS

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

బుధవారం
02-10-2024

సంపుటి : 01 | సంచిక : 150 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్






# నోరు మూసీకోండి

## కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల పరస్పర విమర్శలు

మూసీ పరీవాహక ప్రాంతంలో ఆక్రమణలను తొలగించే పేరుతో ప్రభుత్వం ఇళ్లు కూలగొడుతున్న వ్యవహారం ప్రభుత్వం, బీఆర్ఎస్ పార్టీ మధ్య ఉద్రిక్తతకు దారి తీస్తోంది. ఇళ్ల కూల్చివేతలను రాజకీయంగా ఉపయోగించుకోవాలని అపోజిషన్ ప్రయత్నిస్తుండటంతో అధికార కాంగ్రెస్ గతాన్ని తవ్వుతోంది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మూసీ ప్రక్షాళన చేస్తామని చెప్పిన విషయాన్ని, అక్రమ నిర్మాణాలను కూలుస్తామని కేసీఆర్ చెప్పిన విషయాన్ని గుర్తు చేస్తోంది. అప్పుడు అలా చెప్పిన బీఆర్ఎస్ యాగీ చేస్తోందని మండిపడుతోంది. రెండు పార్టీల వివాదంతో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కుతున్నాయి.

- వేడెక్కుతున్న ఆరోపణలు
- అక్కడక్కడా ఉద్రిక్త పరిస్థితులు
- అక్రమ కట్టడాల లెక్క తేల్చిన గత ప్రభుత్వం: మంత్రి శ్రీధర్ బాబు
- మూసీ ప్రక్షాళనను ఎందుకు అడ్డుకుంటున్నా: కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్:**

మూసీ ప్రక్షాళన...ఆక్రమణల తొలగింపు వ్యవహారం అధికార ప్రతిపక్ష నేతల మధ్య మాటల యుద్ధానికి దారితీస్తోంది. బీఆర్ ఎస్ నేతలు మూసీ పరీవాహక ప్రాంతాల్లో పర్యటించి అండగా ఉంటామని ప్రకటించడంతో పాటు ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఈ దశలో మంత్రులు, కాంగ్రెస్ నేతలు బీఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం, అక్రమ నిర్మాణాల లెక్క తేల్చడం వంటి విషయాలను ప్రస్తావిస్తూ ఇప్పుడు అడ్డుకోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. నేతల పర్యటనల సమయాల్లో మిగతా2లో...

ఇజ్రాయెల్‌పై ప్రత్యక్ష దాడికి దిగిన

# ఇరాన్

## 100 క్షిపణులతో దాడులు

- దేశవ్యాప్తంగా సైరన్ల మోత
- ఇజ్రాయెల్ కు అండగా నిలుస్తాం: జో బైడెన్



2

## తప్పుడు వాగ్దానాల కాంగ్రెస్

- దేశం కోసం తీసుకున్న నిర్ణయాలపై వ్యతిరేకత
- దేశభక్తిని నాశనం చేసేందుకు ప్రయత్నాలు
- ప్రజలు అధికారం అప్పగిస్తారని భావిస్తోంది
- హరియాణా ఎన్నికల ప్రచారంలో ప్రధాని విమర్శలు



2

## రాయలసీమను గ్రీన్ హబ్‌గా మారుస్తాం

- ఈప్రాంతంలో ప్రతి ఎకరాకు నీళ్లివ్వాలన్నదే నా లక్ష్యం
- సోలార్, విండ్ పవర్ ఉత్పత్తి ద్వారా 7.5 లక్షల మందికి ఉద్యోగాలు
- పుచ్చకాయలమడ గ్రామసభలో సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు



10


## వికసిత్ భారత్ లక్ష్యం @2047

### గ్రామాలు అభివృద్ధి చెందకుండా అసాధ్యం

- అధికార వికేంద్రీకరణ పూర్తిస్థాయిలో జరగలేదు
- ప్రజల భాగస్వామ్యం చాలా కీలకం
- స్థానిక సంస్థలు సరైన అకౌంటింగ్, ఆడిట్ విధానాలు పాటించేలా చూడాలి
- రాష్ట్ర ప్రభుత్వాలకు సూచన
- కాగ్ గిరీశ్ చంద్ర ముర్ము



**ఢిల్లీ:** దేశంలోని గ్రామాలు అభివృద్ధి కాకుండా వికసిత్ భారత్ లక్ష్యంచేరుకోవడం సాధ్యం కాదని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ గిరీశ్ చంద్ర ముర్ము పేర్కొన్నారు. 2047 నాటికి దేశం అభివృద్ధి చెందిన దేశంగా అవతరించడంలో గ్రామీణ భారతం కీలకమని వ్యాఖ్యానించారు. సమాఖ్య వ్యవస్థలో అధికార వికేంద్రీకరణ ఇంకా పూర్తి స్థాయిలో జరగలేదని, గ్రామ సభలు, స్థానిక సంస్థలకు ఇంకా తగిన గుర్తింపు లభించడం లేదని చెప్పారు. "క్షేత్రస్థాయిలో అభివృద్ధి జరగకుండా.. వికసిత్ బారత్ లక్ష్యాన్ని చేరుకోవడం సులువు కాదు. దేశంలోని 50 శాతం జనాభా ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లోనే నివసిస్తోంది. ప్రభుత్వ పాలన, వారి అభివృద్ధి, వారి పాలనాధికారాలు, వారికి తగిన వనరులు అందించకుండా.. అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలన్న లక్ష్యం అందుకోవడం సాధ్యం కాదు. మన ప్రధాని చెప్పినట్లు ఒక్కొక్కరూ ఒక్కో అడుగు వేస్తే 140 కోట్ల అడుగులు అవుతాయి. అందుకే ప్రజల భాగస్వామ్యం చాలా కీలకం" అని కాగ్ అన్నారు. దేశంలో 2.60 లక్షల పంచాయతీలు, 7 వేల స్థానిక సంస్థలు ఉన్నాయని గిరీశ్ చంద్ర ముర్ము అన్నారు. స్థానిక సంస్థలను సమర్థంగా తీర్చిదిద్ది ప్రభుత్వ పథకాలు అందేలా చూడడం అనేది దేశానికి చాలా మంచిదని చెప్పారు. స్థానిక సంస్థలను బలోపేతం చేయకుండా మిగతా2లో...



## నేటి నుంచి పూల పండుగ

ఆశ్వయుజ మాసం వచ్చేస్తుందంటే.. బతుకమ్మ పండుగ కూడా వచ్చేసినట్లే. భాద్రపద అమావాస్య నుంచి తొమ్మిదిరోజుల పాటు జరిగే ఈ పండగ తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా జరుపుకుంటారు. అయితే ఆంధ్రప్రదేశ్ కంటే తెలంగాణలో ఈ పండుగకి ఎంతో ప్రాముఖ్యత వుంది. ఎంత ప్రాముఖ్యత అంటే, రాష్ట్ర పండుగగా అధికారికంగా జరిపేంత. దసరాకు రెండు రోజుల ముందు వచ్చే ఈ పండుగను బతుకమ్మ పండుగ, బతకమ్మ పండుగ, గౌరి పండుగ, సద్దుల పండుగ అనే పేర్లతో వ్యవహరిస్తారు.

12

## హైదరాబాద్ ఊరేగింపుల్లో డీజేలు, బాణసంచా నిషేధం



- శబ్ద కాలుష్యంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు
- బాణసంచాతో అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం
- సీపీ సీవీ ఆనంద్ వెల్లడి

2

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫామ్ ధర ₹ 110 | రిటైల్ ₹ 132 |
| స్కిన్ ₹ 191 | స్కిన్ లెస్ ₹ 218 |



2

## లక్షల మందికి రేవంత్ నిద్రలేకుండాచేస్తున్నారు

### ఓట్లు వేసిన వారిపై ఆయన పగబట్టారు

- పేదలు ఇబ్బంది పడొద్దనే మూసీ ప్రాజెక్టులను నిలిపివేశాం
- బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- గోల్నాకలో ప్రజలకు పరామర్శ
- అంబర్‌పేటలో కేటీఆర్ కాన్వాయ్ అడ్డగింత
- ఖండించిన కేటీఆర్ , హరీశ్‌రావు, బీఆర్ ఎస్ నేతలు

## తెలుగు రాష్ట్రాలకు కేంద్రం ఆపన్న హస్తం

- వరద సాయంగా తెలంగాణకు రూ.416.80 కోట్లు, ఏపీకి రూ.1,036 కోట్లు
- మరో 12 రాష్ట్రాలకూ నిధుల విడుదల
- ఇది తక్షణ సాయం
- పూర్తి నివేదిక వచ్చాక మరిన్ని నిధులు

2



## ప్రతి కుటుంబానికి డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డు



- పైలట్ ప్రాజెక్టు పర్యవేక్షణకు ఆర్డీవో స్థాయి ప్రత్యేక అధికారులు
- దసరా లోపు లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు: పొంగులేటి

8



2

## హైడ్రా జీవో అమలును నిలిపివేయలేం

- ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేశాకే విచారణ చేపడతాం
- ఆ తర్వాతే నిర్ణయాన్ని వెలువరిస్తాం
- హైడ్రా జీవో 99 చట్టబద్ధతను సవాల్ చేస్తూ పిటిషన్
- మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమన్న హైకోర్టు

## తప్పుడు వాగ్దానాల కాంగ్రెస్



**చండీగఢ్:** కాంగ్రెస్ పార్టీపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. హస్తం పార్టీ అన్ని తప్పుడు వాగ్దానాలే చేస్తుంటుందని ఆరోపించారు. హరియాణా అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పాల్వాల్‌లో నిర్వహించిన ప్రచారంలో ప్రధాని ప్రతిపక్షంపై నిప్పులు చెరిగారు. "దేశం కోసం ఎన్డీఏ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల న్నింటినీ కాంగ్రెస్ వ్యతిరేకించింది. అయోధ్య నిర్మాణంలోనూ అడ్డు చెప్పింది. జమ్మూకశ్మీర్లో పూర్తి స్థాయిలో రాజ్యాంగాన్ని అమలు చేయడాన్ని వ్యతిరేకించింది. పార్లమెంట్, విధాన సభల్లో మహిళలకు రిజర్వేషన్లను నిరాకరించింది. కాంగ్రెస్.. దేశంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో విఫలమైంది. కానీ, తమ కుటుంబాన్ని మరింత బలోపేతం చేయడానికి శ్రమించింది" అని కాంగ్రెస్ పై తీవ్ర ఆరోపణలు చేశారు. దేశభక్తిని నాశనం చేసేందుకు ప్రయత్నిస్తోందని తీవ్ర విమర్శలు చేశారు.

"ప్రజల్లోని దేశభక్తిని నాశనం చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ప్రజల్లో ఐక్యత ఎంత బలంగా ఉంటే.. కాంగ్రెస్ గెలుపు కూడా అంతే అసాధ్యం అని భావిస్తోంది. అందుకే దేశభక్తుల ఐక్యతను నాశనం చేసేందుకు ఆ పార్టీ తీవ్రంగా యత్నిస్తోంది. రాష్ట్రంలో బీజేపీ పదేళ్లుగా అధికారంలో ఉందని, ఇక ప్రజలు తమకు అధికారం అప్పగిస్తారని కాంగ్రెస్ భావిస్తోంది. గతంలో మధ్యప్రదేశ్ విషయంలోనూ ఇదే విధంగా అపోహపడింది. కాంగ్రెస్ పార్టీ తప్పుడు వాగ్దానాలు చేస్తోంది.సార్వత్రిక ఎన్నికల సమయంలోనూ ఇదే చేసింది. హరియాణాలోనూ తన వ్యూహాన్ని అమలు చేయాలని చూస్తోంది. వారి కుట్రను మనమంతా భగ్నం చేయాలి" అని మోదీ పేర్కొన్నారు.

**పీవోకేను వెనక్కి తీసుకొస్తామని ఎన్నడైనా చెప్పిందా?**

"కేంద్రం రద్దు చేసిన ఆర్టికల్ 370ని తిరిగి తీసుకువస్తామని కాంగ్రెస్ చెబుతోంది. కానీ, పాక్ ఆక్రమిత ప్రాంతాన్ని (పీవోకే) వెనక్కి తీసుకొస్తామని ఎన్నడైనా చెప్పిందా..? పాకిస్థాన్ కు మద్దతుగా ఉండే ఆ పార్టీ.. హరియాణా ప్రజల అభివృద్ధి కోసం ఆలోచించగలదా..?" అని ప్రశ్నించారు. హరియాణాలో ఈ నెల 5న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. 8న ఫలితాలు వెలువడనున్నాయి. ఎన్నికల్లో విజయం సాధించేందుకు ఆయా పార్టీలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ఎన్నికలకు కొద్ది సమయమే ఉండడంతో ప్రచారాన్ని ముమ్మరం చేశాయి.

## హైదరాబాద్ ఊరేగింపుల్లో డీజేలు, బాణసంచా నిషేధం

**విశ్వంభర, హైదరాబాద్:** జంటనగరాల్లో జరిగే మతపరమైన ఊరేగింపుల్లో డీజే సౌండ్ సిస్టమ్, బాణసంచా కాల్చడంపై నిషేధం విధిస్తున్నట్లు నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. డీజే వాడడం వలన తీవ్ర శబ్ద కాలుష్యం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఇటీవల సీపీ మతపెద్దలు, ఇతర సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి డీజే వల్ల ఎదురయ్యే దుష్పరిణామాల గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి బల్దియా కమిషనర్ ఆమ్రపాలి, శాసనసభ్యులు దానం నాగేందర్, రాజాసింగ్, పాషాఖాద్రీ, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రాచకొండ సీపీ సుధీర్‌బాబు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. కమిషనర్ ఆనంద్ డీజేలపై నియంత్రణ అవసరాన్ని వివరిస్తూ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రెండేళ్లుగా డీజేలతో పెద్దఎత్తున నిబంధనల ఉల్లంఘన : ఇటీవలి కాలంలో మతపరమైన ఊరేగింపులు విపరీతంగా పెరిగిపోయాయని, ఆయా వేడుకల్లో ఉపయోగించే డీజే శబ్దాల వల్ల విపరీతమైన శబ్ద కాలుష్యం ఏర్పడుతోందన్నారు. దీని వల్ల రక్తపోటు, వినికిడి సమస్యలు, మానసిక ఆందోళన, నిద్రలేమి వంటి సమస్యలు ఎదురవుతాయని ఆనంద్ తెలిపారు. గత రెండేళ్లుగా డీజేలతో పెద్దఎత్తున నిబంధనల ఉల్లంఘన జరుగుతోందని, ఈసారి శృతిమించి జరిగిందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం దీన్ని గమనించి ఆరా తీశారని సీవీ ఆనంద్ తెలిపారు. మరోవైపు బాణాసంచా కాల్చడం వల్ల ఒక్కోసారి అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆయన చెప్పారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు డీజే సౌండ్ వినియోగించడాన్ని నిషేధించారు. కాగా రాత్రి 10 గంటల నుంచి తిరిగి ఉదయం 6 గంటల వరకు డీజే సౌండ్ సిస్టమ్‌ను వినియోగించడాన్ని పూర్తిగా నిషేధిస్తున్నట్లు ఆయన తెలిపారు. నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని సీపీ సీవీ ఆనంద్ హెచ్చరించారు.

# హైడ్రా జీవో అమలును నిలిపివేయలేం

**విశ్వంభర, హైదరాబాద్:** హైడ్రాను ఏర్పాటు చేస్తూ ఇచ్చిన జీవో 99పై ప్రభుత్వం కౌంటరు దాఖలు చేసేదాకా జీవో అమలును నిలిపిస్తూ ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని హైకోర్టు తేల్చి చెప్పింది. హైడ్రా ఏర్పాటుపై కౌంటరు దాఖలు చేసిన తరువాత ఒకేసారి పిటిషన్‌పై విచారణను చేపట్టి నిర్ణయాన్ని వెలువరిస్తామని పేర్కొంది. ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేస్తూ తీసుకువచ్చి జీవో 99 చట్టబద్ధతను సవాలు చేస్తూ హైదరాబాద్ నానక్‌రాంగూడకు చెందిన లక్ష్మి పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె లక్ష్మణ్ విచారణ చేపట్టారు. ప్రభుత్వం తరఫున కౌంటరు దాఖలు చేస్తామని, దీనికి కొంత గడువు కావాలని అదనపు అడ్వకేట్ జనరల్ రజనీకాంత్‌రెడ్డి కోరారు. పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది వేణుగోపాల్ వాదనలు వినిపిస్తూ జీవో అమలును నిలిపిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం ఐలాపూర్లో 10.24 ఎకరాల్లో జోక్యం చేసుకోకుండా ఆదేశాలివ్వాలన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి జీవో 99కు సంబంధించి ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని, ప్రభుత్వం కౌంట రు దాఖలు చేశాక విచారణ చేపడతామంటూ విచారణను ఈనెల 15కు వాయిదా వేశారు.



**గ్రూప్-1 పరీక్షల నిర్వహణపై హైకోర్టు**

మరోవైపు గ్రూప్-1 పరీక్షలపై హైకోర్ట్‌లో భిన్న వాదనలు జరిగాయి. పరీక్షల నిర్వహణలో టీజీపీఎస్సీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని పిటిషనర్ల తరపు న్యాయవాదులు హైకోర్టు దృష్టికి తీసుకువచ్చారు. గత వైఫల్యాల నుంచి టీజీపీఎస్సీ తప్పులు సరిదిద్దుకోవడంలేదని, పరీక్షల నిర్వహణలో అదే తరహాలో నిరక్ష్యంగా వ్యవహరిస్తూ నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటోందన్నారు. గ్రూప్-1 పోస్టుల భర్తీ నిమిత్తం 2022లో జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయకుండా మరో నోటిఫికేషన్ జారీ చేయడం చెల్లదని, ప్రాథమిక కీలో తప్పులున్నాయని వాటిని సవరించాలన్న అభ్యంతరాలను పట్టించుకోకపోవడాన్ని సవాలు చేస్తూ పలువురు అభ్యర్థులు రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు.

వీటిపై జస్టిస్ పుల్లా కార్తీక్ విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ గతంలో గ్రూప్-1 నియామక పరీక్షల్లో అవకతవకలు జరిగాయంటూ ఇదే హైకోర్టు పరీక్షను రద్దు చేసిందని, చేసిన తప్పును సరిదిద్దుకోవండా సుప్రీం కోర్టుదాకా వెళ్లిందన్నారు. టీజీపీఎస్సీ నిర్వాకం వల్ల ఇప్పటికే చాలా ఇబ్బందులున్నాయని మరిన్ని సృష్టించడం తమకు ఇష్టం లేదంటూ సుప్రీం కోర్టు ఎస్ఎల్పీని కొట్టివేసిందన్నారు. కొన్ని వందల పోస్టుల భర్తీ నిమిత్తం నిర్వహిస్తున్న పరీక్షలకు లక్షల మంది దరఖాస్తులు చేశారని, ఈ దశలో పారదర్శకంగా, నిస్పాక్షికంగా నిర్వహించాల్సి ఉందన్నారు. ప్రస్తుతం వెలువరించిన కీ లో కూడా 7 ప్రశ్నలకు సమాధానాలు తప్పుగా ఉన్నాయని తెలిపారు. కీలో తప్పులున్నాయని నిపుణులు చెప్పినా పరిగణనలోకి తీసుకోలేదన్నారు. ఈ ప్రశ్నలను తొలగించి తాజా కీని రూపొందించి అభ్యర్థుల జాబితాను సిద్ధం చేయాల్సి ఉందన్నారు. 2011 నుంచి గ్రూప్-1 నియామకాల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. త్వరలో మెయిన్స్ పరీక్షలు నిర్వహిస్తున్నందున దీనిపై సత్వరం నిర్ణయం తీసుకోవాలని అభ్యర్ధించారు. టీజీసీఎస్సీ వాదనల నిమిత్తం న్యాయమూర్తి విచారణను ఈనెల 3వ తేదీకి వాయిదా వేశారు.

# లక్షల మందికి రేవంత్ నిద్రలేకుండాచేస్తున్నారు

**విశ్వంభర, హైదరాబాద్:** పేదలకు ఇబ్బందులు రాకూడదనే గతంలో మూసీకి సంబంధించిన ప్రాజెక్టులను నిలిపివేశామని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. ప్రస్తుతం మూసీ సుందరీకరణ ప్రాజెక్టుతో సుమారు 2లక్షల మందిని రోడ్డున పడేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. హైదరాబాద్‌లోని అంబర్‌పేట పరిధిలో మూసీ పరివాహక ప్రాంతాల్లో పార్టీ నేతలతో కలిసి ఆయన పర్యటించారు. పలువురు బాధితులను పరామర్శించి వారితో మాట్లాడారు. హైదరాబాద్‌లో భారాసకు ఓట్లు వేసిన వారిపై సీఎం రేవంత్‌రెడ్డి పగబట్టారని.. లక్షలాది మందికి నిద్రలేకుండా చేస్తున్నారని విమర్శించారు. ఎప్పుడు ఇళ్లు కూల్చుతారోనని ప్రజలు ఆవేదనతో ఉన్నారని చెప్పారు. ఇళ్ల వద్దకు బుల్డోజర్లు వస్తే కంచెలు పెట్టాలన్నారు. రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డి కూడబలుక్కున్నారా?అని ప్రశ్నించారు. పేదల ఇళ్లు కూల్చుతుంటే ఈ ప్రాంత ఎంపీ ఎక్కడికి వెళ్లారని పరోక్షంగా కిషన్‌రెడ్డిని ఉద్దేశించి అన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో సగం డబ్బుతో మూసీ ప్రక్షాళన చేపట్టారన్నారు. బాధితులకు భారాస అండగా ఉంటుందని చెప్పారు.

**బుల్డోజర్ రాజకీయాలపై ప్రజల గళం - రాహుల్ గాంధీకి వినిపించడం లేదా?**

కాగా రాష్ట్రంలో కూల్చివేతలపై రాహుల్ గాంధీని ఉద్దేశించి బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎక్స్ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. బుల్డోజర్ రాజకీయాలకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజల గళం రాహుల్ గాంధీకి వినిపించడం లేదా అంటూ ఆయన ప్రశ్నించారు. సమస్యలు వస్తే యువత, ప్రజలు, చిన్నారి అయినా సరే పిలిస్తే వస్తానని తుక్కుగూడ కాంగ్రెస్ సభలో రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని ఆయన గుర్తుచేశారు. సదరు వీడియోను ఎక్స్‌లో పొందుపర్చారు. రాహుల్ గాంధీ ప్రజలకు ఇచ్చిన మాటపై నిలబడి తెలంగాణకు వచ్చి మూసీ ప్రాజెక్టు ప్రభావిత ప్రజలను కలవాలని కేటీఆర్ సూచించారు.

**ఢిల్లీకి చక్కర్లు కొడుతున్న సీఎం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరిపైనా కేటీఆర్ మండిపడ్డారు. ఒకటి కాదు, రెండు కాదు, మూడు కాదు, 23 సార్లు హైడ్రాబాద్- సికింద్రాబాద్‌కు తిరిగినట్టు ఢిల్లీకి చక్కర్లు కొడుతున్న సీఎంకు తెలంగాణ గల్లీల్లో తిరిగి చూసే ఓపిక లేదా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఐదు లక్షల మంది రైతన్నలు రెండు లక్షల రూపాయల లక్షల రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారని, 67 లక్షల మందికి పైగా రైతన్నలు రైతుబంధు కోసం కండ్లు కాయలు గాసేలా ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ శాఖ నిర్లక్ష్యంతో 43 లక్షల మంది పత్తిరైతులు దళారుల చేతిలో దగా అయ్యి అల్లాడుతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి రైతు వ్యతిరేక పాలన పుణ్యమా అని ఈ దసరా తెలంగాణ ప్రజలకు దసరాలాగా లేకుండా పోయిందని మండిపడ్డారు.

**కేటీఆర్ కాన్వాయ్‌ను అడ్డుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు**

అంబర్‌పేటలో కేటీఆర్ కాన్వాయ్‌ను యూత్ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు అడ్డుకున్నారు. మంత్రి కొండా సురేఖకు వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. నిరసనకారులను పోలీసులు చెదరగొట్టారు. మీ తాటాకు చప్పుళ్లకు భయపడే వాడిని కాదని.. మీ తాట తియ్యడానికే వచ్చానంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి అన్నారు. నా ప్రజలకు అండగా నిలబడడాన్ని నువ్వు ఆపలేవని వ్యాఖ్యానించారు. పేద ప్రజల తరఫున తాను ఉన్నన్ని రోజులు ఏ బుల్డోజర్లు తమ గొంతును ఆపలేవని చెప్పారు. నీ గూండా రాజ్యాన్ని సవాలు చేసే తన స్ఫూర్తిని ఏ గూండాలు అడ్డుకోలేరని స్పష్టం చేశారు. నా వాహనంపై గూండాలు చేసిన దాడి నా సంకల్పాన్ని మరింత పెంచుతాయి.. వెనక్కి తగ్గేదే లేదని తెలిపారు.

**కేటీఆర్ కారుపై కాంగ్రెస్ దాడి.. రాహుల్‌గాంధీని నిలదీసిన హరీశ్‌రావు**

మూసీ బాధితులను పరామర్శించేందుకు వెళ్తుండగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కారుపై కాంగ్రెస్ శ్రేణులు దాడి చేయడంపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. ఈ విషయాన్ని రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్లిన హరీశ్‌రావు.. మీరు చెప్పిన విధ్వంసకర బజార్‌లో ప్రేమ దుకాణం అంటే ఇదేనా అని విమర్శించారు. ప్రజా సమస్యల పట్ల పోరాటం చేస్తున్న ప్రతిపక్షాల మీద దాడులు చేయడమేనా ప్రజా పాలన అంటే అని ప్రశ్నించారు. ప్రజా ప్రతినిధుల ఇళ్ల మీద దాడులు, నాయకుల అరెస్టులు, అక్రమ కేసులు.. ఇదేనా మీరు చెప్పిన ప్రజాస్వామ్య పునరుద్ధరణ అని నిలదీశారు.కేటీఆర్‌పై దాడికి తెగబడిన వారిని గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని తెలంగాణ డీజీపీని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ట్విట్టర్ (ఎక్స్)లో తీవ్రంగా స్పందించారు. తెలంగాణలో కాంగ్రెస్ విఫలమైందని పేర్కొన్నారు.

**తెలంగాణలో రౌడీ రాజకీయాలకు ఇది పరాకాష్ట.. కేటీఆర్ కారుపై దాడిని ఖండించిన దాసోజు శ్రవణ్**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కారుపై కాంగ్రెస్ గూండాలు చేసిన దాడిని ఆ పార్టీ సీనియర్ నాయకులు దాసోజు శ్రవణ్ తీవ్రంగా ఖండించారు. బుల్డోజర్ రాజ్ బాధితులను పరామర్శించేందుకు కేటీఆర్ వెళ్తున్నప్పుడు ఆయన వాహనాన్ని అడ్డుకుని దాడి చేయడం తెలంగాణలో రౌడీ రాజకీయాలకు పరాకాష్ట అని అన్నారు. ఈ మేరకు ట్విట్టర్ (ఎక్స్) వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు.

## తెలుగు రాష్ట్రాలకు కేంద్రం ఆపన్న హస్తం

**ఢిల్లీ:** దేశ వ్యాప్తంగా వరద ప్రభావిత ప్రాంతాలకు కేంద్ర హోం శాఖ రూ.5,858.60 కోట్లు విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వ వాటాలో భాగంగా స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ (ఎస్ఈఆర్ఎఫ్), నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ (ఎన్డీఆర్ఎఫ్) అడ్వాన్స్ నుంచి 14 రాష్ట్రాలకు ఈ మేరకు హోంశాఖ నిధులు మంజూరు చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన కేంద్ర బృందాలు.. నష్టాన్ని అంచనా వేస్తూ ఇచ్చిన నివేదిక మేరకు తక్షణసాయంగా ఈ నిధులు కేటాయించింది. కేంద్ర బృందాల నుంచి పూర్తిస్థాయి నివేదిక వచ్చిన తర్వాత మరిన్ని నిధులు మంజూరు చేయనున్నట్లు హోంశాఖ పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌కు రూ.1,036 కోట్లు, తెలంగాణకు రూ.416.80 కోట్లు మంజూరు చేసింది. అత్యధికంగా మహారాష్ట్రకు 1,492 కోట్ల వరద సాయం ప్రకటించింది.

**కేంద్రం నిధులు కేటాయించిన మరిన్ని రాష్ట్రాలు..**

అస్సాం (రూ.716 కోట్లు), బిహార్ (రూ.655.60 కోట్లు), గుజరాత్ (రూ.600 కోట్లు), హిమాచల్ ప్రదేశ్ (రూ. 189.20 కోట్లు), కేరళ (రూ.145.60 కోట్లు), మణిపూర్ (రూ.50 కోట్లు), మిజోరం (రూ.21.60 కోట్లు), నాగాలాండ్ (రూ.19.20 కోట్లు), సిక్కిం (రూ.23.60 కోట్లు), త్రిపుర (రూ. 25 కోట్లు), పశ్చిమ బెంగాల్ (రూ.468 కోట్లు) కేటాయించారు.

## అహంకారాన్ని ప్రజలు సహించరు

**ఢిల్లీ:** నాయకులు అహంకారంతో ప్రవర్తిస్తే దేశ ప్రజలు సహించరని ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ అన్నారు. కొత్తగా రాజకీయ పార్టీని స్థాపించేందుకు సిద్ధమైన నేపథ్యంలో.. ఓ జాతీయ వార్తా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నాయకత్వం పైనా పీకే ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు."నాయకుల అహంకారాన్ని దేశ ప్రజలు సహించరు. ఎన్నికల సమయంలో కచ్చితంగా తగిన బుద్ధి చెబుతారు. అయితే.. నేను చేసిన ఈ వ్యాఖ్యలు ఏ నేతను లక్ష్యంగా చేసుకొని అంటున్నవి కాదు. ఎన్నికల ముందు వరకు కాంగ్రెస్ తిరిగి పుంజుకోవడం పై అనుమానాలు వ్యక్తమయ్యాయి. కానీ, ప్రతిపక్ష నేతగా రాహుల్ సమర్థంగా వ్యవహరించగలరని ఆ పార్టీ మద్దతుదారులు విశ్వసించారు. అయితే ఈ విషయంలో మరో కోణం కూడా ఉంది. ఆయనను దేశమంతా నాయకుడిగా అంగీకరించిందా? అంటే.. నేనైతే అలా అనుకోవడం లేదు" అని ప్రశాంత్ కిశోర్ అన్నారు.

**రాహుల్ నాయకత్వంపై..**

ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై అడిగిన ప్రశ్నకు పీకే స్పందిస్తూ.. "ప్రధాని మోదీ పేరు కనిపిస్తే ఓట్లు పడతాయని బీజేపీ భావించింది. కానీ, గతంతో పోలిస్తే ఈ సారి ఎన్నికల ఫలితాల్లో కాషాయ పార్టీ మెజారిటీలో తగ్గుదల కనిపించింది. ఎన్నికల ముందు కాంగ్రెస్‌ను బలోపేతం చేయడానికి రాహుల్ గాంధీ తీవ్రంగా శ్రమించారు. ఆయన నాయకత్వంపై సొంత పార్టీలో ఉన్న అనుమానాలను తొలగించారు. దీంతో కాంగ్రెస్‌ను ముందుకు తీసుకెళ్లగలరనే నమ్మకం వారిలో కలిగింది" అని పీకే వ్యాఖ్యానించారు. ప్రశాంత్ కిశోర్ కొత్తగా రాజకీయ పార్టీని స్థాపించేందుకు సిద్ధమైన సంగతి తెలిసిందే. పార్టీ పేరు, నాయకత్వం సహా ఇతర వివరాలను ఈ నెల 2న ప్రకటిస్తామని వెల్లడించారు. అయితే.. పార్టీ నాయకత్వం మాత్రం తన చేతుల్లో ఉండదని తెలిపారు.

## వికసిత్ భారత్ లక్ష్యం @ 2047

**(మొదటి పేజీ తరువాయి)**

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడం సాధ్యం కాదన్నారు. స్థానిక సంస్థలకు వెళ్లే నిధుల విషయంలో అకౌంటింగ్,ఆడిటింగ్ ది కీలక భూమిక అని పేర్కొన్నారు. కాబట్టి సరైన అకౌంటింగ్ విధానాలను పాటించని మున్సిపల్ కార్పొరేషన్లకు నిధులు సమీకరించే అనుతులు ఇవ్వకూడదని చెప్పారు. స్థానిక సంస్థలు సరైన అకౌంటింగ్, ఆడిట్ విధానాలు పాటించేలా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై కూడా ఉందన్నారు.

## ఇజ్రాయెల్‌పై ప్రత్యక్ష దాడికి దిగిన ఇరాన్

**ఇజ్రాయెల్** పశ్చిమాసియాలో పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారాయి. హెజ్బొల్లా స్థావరాలే లక్ష్యంగా లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేస్తున్న సమయంలో ఇరాన్ సైతం రంగప్రవేశం చేసింది. క్షిపణి దాడులతో ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రత్యక్ష దాడికి దిగింది. ఈ విషయాన్ని వెల్లడించిన ఇజ్రాయెల్ అధికారులు.. తమ దేశ ప్రజలను అప్రమత్తం చేశారు. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా సైరన్ల మోత మోగుతోంది.ఇరాన్ దాదాపు 100 క్షిపణులు ప్రయోగించినట్లు తెలుస్తోంది. టెల్ అవీవ్, జెరూసలేం సమీపంలో వరుస పేలుళ్ల శబ్దాలు వినిపించినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే, వెంటనే అప్రమత్తమైన ఐరన్ డోమ్ వంటి సాంకేతిక వ్యవస్థలు.. క్షిపణులను దీటుగా ఎదుర్కొంటున్నట్లు సమాచారం.మరోవైపు, ఈ పరిణామాల నడుమే ఇజ్రాయెల్ రాజధానిలో కాల్పులు కలకలం రేపాయి. ఓ వ్యక్తి తుపాకీతో కాల్పులు జరపగా.. పలువురు మృతి చెందినట్లు సమాచారం.

**ఇజ్రాయెల్ కు అండగా నిలుస్తాం: జో బైడెన్**

ఇజ్రాయెల్పై ఇరాన్ క్షిపణుల దాడి వేళ అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ స్పందించారు. ఇజ్రాయెలు అండగా నిలిచేందుకు, పశ్చిమాసియాలోని అమెరికా బలగాలను రక్షించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. పశ్చిమాసియాలో పరిస్థితులు మరింత దిగజారుతున్న వేళ జాతీయ భద్రత బృందంతో సమావేశమయ్యారు. ఈ భేటీలో అధ్యక్షుడు జో బైడెన్తో పాటు ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ పాల్గొన్నారు.

# నోరు మూసీ కోండి

**(మొదటి పేజీ తరువాయి)**

ఉద్రిక్త పరిస్థతులు సైతం తలెత్తుతున్నాయి. వీటిపైనా మాటల తూటాలు పేలుతున్నాయి. మొత్తానికి మూసీ అంశం ప్రస్తుతం రాజకీయంగా హాట్ టాపిక్‌గా మారింది.

**2017లో మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిందెవరు? : మంత్రి శ్రీధర్ బాబు**

మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వమే మూసీలో 8,480 అక్రమ కట్టడాలు ఉన్నాయని లెక్క తేల్చిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. మూసీ నదికి హద్దుల గుర్తింపుపై గత ప్రభుత్వం సర్వే కూడా పూర్తి చేసిందన్నారు. ఈ మేరకు గత ప్రభుత్వంలో జరిగిన సమావేశాలు, మీటింగ్ మినిట్స్‌ను ఆయన మంగళవారం ప్రదర్శించారు. మూసీపై అక్రమ కట్టడాలను నిర్దాక్షిణ్యంగా కూల్చివేయాలని, 2021లోనే కేటీఆర్ ఆదేశించారని శ్రీధర్ బాబు చెప్పారు. మూసీ నిర్వాసితులను రెండుపడక గదుల ఇళ్లల్లోకి తరలించాలని కేటీఆర్ అప్పట్లో అధికారులను ఆదేశించారని వివరించారు. మధ్యతరగతి ప్రజల అవసరాలు దృష్టిలో పెట్టుకుని, కాంగ్రెస్ సర్కార్ ముందుకెళ్తున్నట్లు మంత్రి చెప్పారు. మూసీ పరిధిలో చాలా మంది స్వచ్ఛందంగా, ఇల్లు ఖాళీ చేస్తున్నారని వివరించారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రక్రియ చాలా క్లిష్టమైందన్న శ్రీధర్‌బాబు, బీఆర్ఎస్ నేతలు సమస్యలను మరింత జటిలం చేస్తున్నారని ఆరోపించారు.

**మూసీపై ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్దామా? కేటీఆర్, హరీశ్‌రాలకు కోమటిరెడ్డి సవాల్**

మూసీ ప్రక్షాళనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంటే ప్రతిపక్షాలు ఎందుకు అడ్డుకుంటున్నాయని



రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రశ్నించారు. మూసీ అభివృద్ధిని అడ్డుకుంటే తాము ప్రత్యక్ష ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. మూసీ వల్ల కలిగే ఇబ్బంది తెలిస్తే జర్నలిస్టులు కూడా సహించరన్న ఆయన, మూసీపై ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్దామా అని సవాల్ విసిరారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ లకు మానవత్వం లేదని విమర్శించారు. నల్గొండ జిల్లా గ్రౌండ్ వాటర్‌లో ఫ్లోరైడ్ ఎక్కువన్న ఆయన, మూసీలో పారేది విషపు నీళ్లని తెలిసి కూడా ప్రతిపక్షాలు అడ్డు తగులుతున్నాయని ఆరోపించారు.

**మూసీని స్వచ్ఛమైన నదిగా మారుస్తాం**

మూడు నాలుగు కోట్లు పెట్టి విల్లా కొనుకున్న వాళ్లు అయినా, గుడిసె వేసుకుని నివాసం ఉంటున్న వాళ్లయినా మూసీ పక్కన ఉండటం వల్ల ఇబ్బంది పడుతున్నారన్నారు. మూసీని స్వచ్ఛమైన నదిగా మార్చాలని ప్రభుత్వం గొప్ప నిర్ణయం తీసుకుందన్నారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చేందుకు ముఖం చెల్లడం లేదని ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ వచ్చి మూసీ ప్రక్షాళనపై మాట్లాడాలని డిమాండ్ చేశారు. కేసీఆర్, కేటీఆర్ తమ ఊరిలో బస చేయాలని, అక్కడ కనీసం టిఫిన్ కూడా చేయలేమని ఆందోళన వ్యక్తం చేశారు. మూసీ డెవలప్‌మెంట్ బోర్డు అన్నారు కదా ఏమైందని ప్రశ్నించారు. మూసీ పరిస్థితి ఎలా ఉందో గత సీఎం కేసీఆర్ దగ్గర ఓఎస్డీగా పని చేసిన ప్రియాంక వర్గీస్‌ను అడిగితే తెలుస్తుందన్నారు.

**మూసీ మురికితో ఇబ్బందులు**

మల్లన్న సాగర్ నిర్వాసితులను పోలీసులతో ఎందుకు కొట్టించారని నిలదీశారు. తాను నల్గొండ వ్యక్తిగా, మూసీ బాధితుడిగా మాట్లాడుతున్నానన్న వెంకటరెడ్డి మమ్మల్ని సావమంటావా? అని ప్రశ్నించారు. సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్ వాళ్లు గోదావరి జలాలతో సంతోషంగా ఉండాలి, తాము మూసీ మురికితో చావాలా అని నిలదీశారు. హరీశ్ రావో, అగ్గిపెట్టె రావో వెళ్లి మూసీ దగ్గర ఉంటే రోగాలు వస్తాయని చెప్పాలని సూచించారు. ఎంత ఖర్చయినా పెట్టి మూసీని ప్రక్షాళన చేయాలని సీఎంకు చెప్పినట్లు తెలిపారు. డీపీఆర్ రెడీ కాకుండా అవినీతి ఎక్కడ అవుతుంది? కేటీఆర్ పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నాడని మండిపడ్డారు.

**కాంగ్రెస్‌కు మంచి పేరు రాకూడదనే బీఆర్ఎస్ నేతల తప్పుడు ప్రచారం: ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి**

మూసీ ప్రక్షాళనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంటే ప్రతిపక్షాలు అడ్డుతగులుతుండడంపై భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. విష ప్రచారంపై చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. మూసీ ప్రక్షాళనతో కాంగ్రెస్‌కు మంచి పేరు రాకూడదనే బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. పేదలకు అన్యాయం జరగకుండా డబుల్ బెడ్ రూం ఇళ్లు, మహిళలకు రుణాలు, పిల్లల చదువులకు బాధ్యత తీసుకుంటున్నామని హామీ ఇచ్చారు. మూసీని ప్రక్షాళించకపోతే హైదరాబాద్‌కు భారీ నష్టం తప్పదన్న చామల ఏటా వర్షా కాలంలో పడవల్లో తిరగాల్సి వస్తుందని వివరించారు. నల్గొండ జిల్లాను సర్వనాశనం చేసిన బీఆర్ఎస్ నాయకులను జిల్లాలో తిరిగినివ్వరని హెచ్చరించారు. మాజీ మంత్రి హరీశ్ రావు చిల్లర మాటలు నమ్మ వద్దని సూచించారు. బావా బామ్మర్దులు ఇద్దరు సినిమా యాక్టర్ల కంటే మించిపోయారని ఆరోపించారు. సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వాన్ని తప్పు పట్టడం బీఆర్ ఎస్ నాయకులకు పరిపాటి అయిందని ధ్వజమెత్తారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా 28 వేల కట్టడాలు అక్రమంగా ఉన్నాయని, వాటిని కూల్చివేసేందుకు సహకరించాలని కోరిన మాట నిజం కాదా అని ప్రశ్నించారు. వర్షాకాలం హైదరాబాద్‌లో ప్రజలు ప్రతిసారి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సోషల్ మీడియాలో కార్యకర్తలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. సోషల్ మీడియాలో ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విషం చిమ్ముతున్నాయని విమర్శించారు. మానవ తప్పిదాలు, స్వార్థ ప్రయోజనాలు, తాత్కాలిక అవసరాల కోసం సహజ వనరులను ధ్వంసం చేస్తుండడంతో నేడు కాలుష్య కారకమై దేశంలోనే అత్యంత ప్రమాదకర నదుల సరసన చేరిందని ఆందోళన వ్యక్తం చేశారు.

# మూసీ నది ప్రక్షాళనలో మరో అడుగు

- కూల్చివేతలు షురూ చేసిన అధికారులు
- డబుల్ బెడ్రూం ఇండ్లకు తరలి వెళ్లిన పలు కుటుంబాలు
- అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుల బందోబస్తు



**విశ్వంభర, హైదరాబాద్:** మూసీ నది ప్రక్షాళనలో భాగంగా మరో అడుగు ముందుకు పడింది. నదీ గర్భంలో అక్రమంగా నిర్మించిన ఇళ్లను ప్రభుత్వం కూల్చివేస్తోంది. హైదరాబాద్ జిల్లా పరిధిలోని చాదర్ ఘాట్, శంకర్ నగర్, వినాయక వీధి, రసూల్ పురా, మూసానగర్ ప్రాంతాల్లో నిర్వాసితుల ఇళ్లను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. సుమారు 100 మంది అడ్డా కూలీల సహకారంతో సమ్మెట, గుణపాలతో అక్రమ నిర్మాణాలపై విరుచుకుపడ్డారు. ఒక్కొక్క ఇంటిని పెకిలిస్తూ పోయారు. ఓవైపు కూల్చివేతలు కొనసాగుతుండగా మరోవైపు మార్కింగ్ చేసిన ఇళ్లలోని పలు కుటుంబాలు హుటాహుటిన సామగ్రిని సర్దుకొని వారికి కేటాయించిన రెండు పడకల గదుల ఇళ్లకు వెళ్లిపోయారు. కూల్చివేత ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు, జీహెచ్ఎంసీ సిబ్బంది పర్యవేక్షించారు.

మూసీ నది ప్రక్షాళనకు శ్రీకారం : హైదరాబాద్ మహా నగరంలో మూసీ నది ప్రక్షాళనకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో అడుగు ముందుకు వేస్తోంది. అందులో భాగంగా తొలి దశలో మూసీ నది గర్భంలోని అక్రమ నిర్మాణాలను తొలగించాలని నిర్ణయించిన ప్రభుత్వం వారం రోజుల నుంచి సర్వే నిర్వహించింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో ప్రవహించే మూసీ నది గర్భంలో సుమారు 2 వేలకు పైగా నిర్మాణాలున్నట్లు గుర్తించి అందులో నివసిస్తున్న కుటుంబాలను ఖాళీ చేయించాలని రెవెన్యూ అధికారులకు సూచించింది.

పునరావాసం కల్పిస్తామని భరోసా : ఈ మేరకు రంగంలోకి దిగిన అధికారులు నదీ గర్భంలో ఉన్న నిర్మాణాలకు మార్కింగ్ చేసి బాధిత కుటుంబాలకు జీహెచ్ఎంసీ పరిధిలోనే పునరావాసం కల్పిస్తామని భరోసా కల్పించారు. నగరంలోని 14 చోట్ల రెండు పడకల గదుల గృహ సముదాయాల్లో ఖాళీగా ఉన్న వాటిని కేటాయించి నిర్వాసితులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. అధికారుల సూచనలతో నదీ గర్భంలో ఇబ్బందికరమైన పరిస్థితుల్లో జీవిస్తున్న పలు కుటుంబాలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఇళ్లను ఖాళీ చేశాయి. తమకు కేటాయించిన రెండు పడకల గదుల ఇళ్లకు తరలివెళ్లిపోయారు. దీంతో తర్వాత ప్రక్రియగా ఆ నిర్మాణాలను కూల్చివేయాలని నిర్ణయించిన ప్రభుత్వం నేటి నుంచి మూసీ నది గర్భంలో ఉన్న నివాసాల కూల్చివేతలు మొదలు పెట్టింది.

హైదరాబాద్ జిల్లా పరిధిలోని చాదర్ ఘాట్, శంకర్ నగర్, వినాయకవీధి, రసుల్ పురా, మూసానగర్ ప్రాంతాల్లోని నివాసాలను కూల్చివేశారు. సుమారు 200కుపైగా కుటుంబాలు నదీ గర్భంలో ఇక్కడ ఏళ్ల తరబడి జీవిస్తున్నాయి. అందులో కొంత మంది ఖాళీ చేసి వెళ్లిపోవడంతో మలక్ పేట ఎమ్మెల్యే బలాల సహకారంతో సుమారు 100 మంది కూలీలతో అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఇటీవల హైకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో కూల్చివేతల విషయంలో జేసీబీలను దూరంగా పెట్టిన రెవెన్యూ అధికారులు కూలీల సహాయంతో మూసీ నది గర్భంలోని నిర్మాణాలను ధ్వంసం చేశారు. సమ్మెట, గుణపాలతో ఇళ్లపై కూలీలు విరుచుకుపడి ఒక్కో ఇంటికి పెకిలించారు. ఒక్క శంకర్ నగర్ లోనే 100కుపైగా నివాసాలను కూల్చివేశారు. కొన్నింటిని పూర్తిగా ధ్వంసం చేయగా మరికొన్ని నివాసాలను పాక్షికంగా కూల్చివేశారు.ఓవైపు కూలీల కూల్చివేతలు జరుగుతుండగా మరోవైపు పలు బాధిత కుటుంబాలు పోలీసులు, రెవెన్యూ అధికారులతో వాగ్వాదానికి దిగాయి. తమ సామాగ్రిని తీసుకెళ్లడానికి సమయం ఇవ్వాలంటూ మండిపడ్డారు. దీంతో శంకర్ నగర్ లో కాసేపు స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. అక్కడే ఉన్న పోలీసులు జోక్యం చేసుకొని బాధిత కుటుంబాలకు సర్ది చెప్పారు. ఒక్కొక్కటిగా ఇళ్లను కూల్చివేస్తుండటంతో తమ నివాసాల్లో ఉన్న సామాగ్రిని సర్దుకొని బయట పెట్టారు. రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన డీసీఎంలు, మినీ వ్యాన్లలో సామాగ్రిని తరలించారు.

ఇంటి యజమానులు ప్రభుత్వం కేటాయించిన డబుల్ బెడ్ రూం ఇళ్లలోకి వెళ్లిపోగా అద్దెకున్న వారు సమీప బంధువుల ఇళ్లకు, కొత్తగా అద్దెకు తీసుకున్న చోటుకు వెళ్లిపోయారు. అయితే కొంతమంది పాత ఇనుమ సామాను వ్యాపారులు అక్కడికి చేరుకొని ఇదే అదనపుగా భావించి ఖాళీ చేసిన నివాసాల్లోని ఇనుప దర్వాజలు, తలుపులు, కిటికీలు, విద్యుత్ సామాగ్రిని తమ వ్యక్తిగత వాహనాల్లో తరలించడం గమనార్హం. కూల్చివేతల ప్రాంతాల్లో ఎలాంటి ఆటంకం లేకుండా పోలీసులు, జీహెచ్ఎంసీ సిబ్బంది పర్యవేక్షించారు. రేపు మిగతా ప్రాంతాల్లోనూ అక్రమ నిర్మాణాలను కూల్చివేయనున్నారు. ఈ వారంలో మార్కింగ్ చేసిన నిర్మాణాలన్నీ కూల్చివేసి ఆ శిథిలాలను తొలగించి ఆ భూములను చదును చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.



తీవ్ర అస్వస్థతకు గురైన ప్రముఖ న్యాయవాది మల్లు వెంకటరామిరెడ్డి సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ గ్లోబల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, సూర్యపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను ఎల్బీనగర్‌లోని వారి నివాసంలో కలిసి పరామర్శించి వెంకటరామిరెడ్డి మృతికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

- విశ్వంభర, ఎల్బీనగర్



నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తండ్రి పురుషోత్తం రెడ్డి మరణంతో విషాదంలో ఉన్న వారి కుటుంబాన్ని వారి నివాసానికి వెళ్లి పరామర్శించిన టీజేఏస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాం. పురుషోత్తం రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఆయనకు గౌరవ నివాళులర్పించారు.

- విశ్వంభర, హుజూర్‌నగర్

# ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

## ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాంకు వినతి

**విశ్వంభర, హైదరాబాద్ :** నాంపల్లిలోని తెలంగాణ జన సమితి పార్టీ కార్యాలయంలో మంగళవారం తెలంగాణ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో సుమారు 1000 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు రాష్ట్రంలో ఉన్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల గూర్చి ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాంకు వివరిస్తూ, వినతి పత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకి ఏజెన్సీ విధానం రద్దు చేసి నేరుగా ప్రభుత్వం జీతాలు చెల్లించడం, పెండింగ్‌లో ఉన్న జీతాలు, పి.ఆర్.సి పాత బకాయిలు విడుదల చేయాలని వారు ఎమ్మెల్సీని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔట్సోర్సింగ్ కార్మికులకు ఎల్లపుడు అండగా ఉంటానని, ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి నేరుగా జీతాలు ఇప్పించటానికి నేను ముందు ఉంటానని హామీ ఇచ్చారు. ఈ



కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు పులి లక్ష్మయ్య, జనరల్ సెక్రటరీ గోవర్ధన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు దోయిపడి శ్రీధర్, వినోద్, విజయలక్ష్మి, కోశాధికారి సంతోష్,మందాల బాలకృష్ణ రెడ్డి, రాజమహమ్మద్, ఉపేందర్, జహీర్, రమేష్, రాజు, రాజకుమర్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ

## ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్

**విశ్వంభర, నల్గొండ :** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా నలగొండ జిల్లా ఎస్పీ నిత్యం ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజల విలువైన ప్రాణాలు కాపాడుటకు చర్యలు చేపడుతామన్నారు. ప్రమాదాలకు గల కారణాలను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులతో సమీక్షిస్తూ నివారణ చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలోని నేషనల్ హైవే ,స్టేట్ హైవే, ఆర్ అండ్ బి, పంచాయతి రాజ్ రోడ్లపై ఉన్న బ్లాక్ స్పాట్ లను గుర్తించి జిల్లా స్థాయి అధికారి ఎస్పీ నల్లగొండ మండలం, అడిషనల్ ఎస్పీ, వేములపల్లి మండలం, నల్లగొండ డీఎస్పీ కేతపల్లి మండలం, మిర్యాలగూడ డిఎస్పి మిర్యాలగూడ మండలం, దేవరకొండ డిఎస్పి చింతపల్లి మండలాలను దత్తత తీసుకొని వారం వారం సందర్శిస్తూ సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రమాదాలు చర్యల పై రాష్ట్ర రహదారుల సంబంధిత అధికారులకు నివేదిక పంపుతూ అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా జిల్లా ఎస్పీ గారు నల్లగొండ మండలం అద్దంకి రోడ్డు చర్లపల్లి బైపాస్, బ్లాక్ స్పాట్ సందర్శించి పరిశీలించి ప్రమాదాల కారణాలను గుర్తించి అక్కడ అవసరమైన వేగ



నియంత్రణ సూచికలు, బొల్లార్ను రేడియం స్టడ్స్, బ్లింకింగ్ లైట్స్, రేడియం స్టిక్కర్స్, సర్వీస్ రోడ్లు, పాదచారులు రక్షణపై సంబంధిత అధికారులతో మాట్లాడి పనులు ప్రారంభించారు. దీనిలో భాగంగా ఈ మంగళవారం అదే రహదారి వెంట ఉన్న తరుచూ చెర్వు గట్టు వద్ద భక్తులు రోడ్డు దాటి క్రమంలో అధిక ప్రమాదాలు జరుగుతు ఎల్లారెడ్డి గూడెం చెర్వుగట్టు వద్ద, అనపర్తి 12వ బ్యాటలియన్ వద్ద పరిసిలించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపడతామన్నారు. అంతే కాకుండా జిల్లా రహదారుల వెంట ఉన్న గ్రామాల్లో పోలీసు కళాజాత బృందం ద్వారా ఎప్పటికప్పుడు రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. రహదారి వెంట ఉన్న ఉన్న గ్రామాల్లో విలేజి రోడ్ సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేసి వారి ద్వారా కూడా ప్రమాదాలు జరగకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ వెంట నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి, రూరల్ ఎస్ఐ సైదా బాబు, ఎస్ఐ నార్కట్ పల్లి క్రాంతి డిటీఆర్బి రిటైర్ సిఐ అంజయ్య, రోడ్డు సేఫ్టీ ఇంజనీర్లు పాల్గొన్నారు.









# మహాత్మా గాంధీ కలలుగన్న లౌకిక భారతదేశం



> మంచి మీద చెడు తాత్కాలికంగా విజయం సాధించినా అడుగడుగున కష్టాలు ఎదురైనా, ఎంత సహనంగా ఉండాలో, ప్రజల కోసం ఎన్ని త్యాగాలు చేయాలో, ఐకమత్యం, అహింస, ఆయుధంగా అంతిమంగా విజయం ఎలా సాధించాలో... గాంధీజీని చూసి నేర్చుకోవచ్చు. వ్యక్తిగతంగా నా ఆలోచనల మీద విముక్తి కోసం మేము చేసిన పోరాటం మీద మహాత్మా గాంధీ ప్రభావం అపారం అని నల్లజాతి సూర్యుడు నెల్సన్ మండేలా చెప్పిన స్ఫూర్తివంతమైన మాటల విత్తనాలను ఈ దేశమంతటా చల్లాల్సిన అవసరం ఏర్పడింది.

## ఫ్రీ పాలస్తీనా సాధన కోసం పోరాడుదాం

మహోజ్వల స్వాతంత్ర ఉద్యమాన్ని ముందుండి నడిపించిన భారత జాతిపిత మహాత్మా గాంధీ. (మోహన్ దాస్ కరంచంద్ గాంధీ) అక్టోబర్ 2, 1869 వ సంవత్సరంలో గుజరాత్ లోని పోరు బందర్ లో జన్మించారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదులను ఈ దేశం నుండి పారదోలి భారతదేశానికి స్వాతంత్రం సాధించడానికి ఎంతోమంది పోరాట యోధులు స్వాతంత్ర సమరయోధులు ,భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ దేవ్, అల్లూరి సీతారామరాజు, సుభాష్ చంద్రబోస్ , ఝాన్సీ లక్ష్మీబాయి ,చిట్టగాంగు వీరులు, కమ్యూనిస్టు యోధులు తమ ప్రాణాలను లెక్కచేయకుండా పోరాడారు. ప్రాణత్యాగం చేశారు. లాఠీ దెబ్బలు తిన్నారు . ఈ పోరాటంలో మహాత్మా గాంధీ ముందుండి అహింస ,సత్యాగ్రహం, ఆయుధాలుగా నడిపించారు. ఫలితంగా భారతదేశానికి స్వతంత్రం సిద్ధించింది. భారతదేశం స్వతంత్రప్రకటనతో 1947 ఆగస్టు 15న ఢిల్లీలోని ఎర్రకోటపై త్రివర్ణ పత్రాకాన్ని ఎగురవేసింది.

'విభజించు పాలించు' అనే ఆంగ్లేయుల దుష్ట విధానం మూలాన భారత్ నుండి పాకిస్తాన్ విడిపోయి ప్రత్యేక దేశంగా ఆవిర్భవించింది. ఆనాడే కాశ్మీర్ విషయంలో భారత్, పాకిస్తాన్ యుద్ధం జరిగింది. తర్వాత పరిస్థితి మరింత క్షీణించింది. పాకిస్తాన్ కు 55 కోట్ల రూపాయలు ఇవ్వాలని గాంధీజీ స్పష్టంగా చెప్పారు. ఈ నిరాహార దీక్షను ఆపాలని ఎంతోమంది నాయకులు చెప్పినప్పటికీ ఆ రెండు ప్రదాన అంశాలు అమలు చేస్తానని చెప్పేవరకు దీక్ష విరమించనని చెప్పటం, ఆయన అకుంఠితమైన దీక్షకు నిదర్శనం. గాంధీ నిరాహార దీక్ష వలన చివరకు ప్రభుత్వం దిగివచ్చి పాకిస్తాన్ కు డబ్బు ఇవ్వడానికి అంగీకరించింది. రెండవది హిందూ, ముస్లిం ,సిక్కు, వర్గాల నాయకులు సమైక్యంగా అక్కడికి వచ్చి అందరూ సఖ్యంగా ఉండటానికి కట్టుబడి ఉన్నామని గాంధీ వద్ద ప్రమాణం చేశారు. అప్పుడు మాత్రమే గాంధీజీ తాను చేస్తున్న నిరాహార దీక్షను విరమించారు.

భారతదేశంలో వివిధ తెగలు, జాతులు, కులాలు, మతాలు, భాషలు సంస్కృతులకు సంబంధించిన ప్రజలు అనాదిగా జీవిస్తున్నారు. గాంధీజీ అనేక మతపరమైన సంప్రదాయాల నుంచి స్ఫూర్తి పొంది, వాటి మూలాలైన సమానత్వం, విశ్వ సోదర భావం, సహనంలాంటి విలువైన సూత్రాలను అమలు చేస్తూ ఈ దేశాన్ని మత ఘర్షణలు లేని, సహనం, ప్రజాస్వామ్య, లౌకికవాదంతో కూడిన ఘనమైన దేశంగా ఉంచాలని కోరుకున్నారు.

దక్షిణాఫ్రికాలో గాంధీజీకి జరిగిన అవమానం, ఆయనను జాతి వివక్షకు వ్యతిరేకంగా, మానవ హక్కుల సాధనకు ఉద్యమించే లక్ష్యం వైపు నడిపించాయి. ఒక లక్ష్యం, పట్టుదల, అంకితభావం, చిత్తశుద్ధితో కూడిన ఒక వ్యక్తిలోని కార్యాచరణ, దేశానికి స్వాతంత్రం సాధించే శక్తిగా రూపొందింది. అలాంటప్పుడు అధికారం, ప్రభుత్వం, ఈ దేశాన్ని ఎందుకు ఈ లక్ష్యాల వైపు నడిపించలేకపోతున్నాయి?. భారతదేశాన్ని లౌకిక దేశంగా తీర్చి దిద్దటానికి, పరిమళాలను ప్రజలందరికీ పంచడానికి పాలకులు ఎందుకు కృషి చేయటం లేదని నిలదీయవలసినటువంటి సందర్భం ఇది.

స్వార్థం, పరమత ద్వేషం, అసహనం, అణచివేతలు, ఆలోచనలకు పట్టం కట్టినప్పుడు, మతాల మధ్యన, మనుషుల మధ్యన, దేశాల మధ్యన, దాడులు జరుగుతుంటాయి. హింస ఆకాశాన్నంటుంది. ఆస్తులు ధ్వంసం అవుతాయి. ప్రజా హృదయాలు గాయపడతాయి. అంతేకాదు వందల, వేలాది ప్రజల మృత్యువాత పడతారు. సత్యం, అహింస పునాదులు కలిగిన వాతావరణంలోనే, దేశంలో సుస్థిరమైన శాంతిని సాధించగలుగుతామని గాంధీజీ చెప్పారు. సత్యాన్ని నమ్మిన వ్యక్తులు ఎవరు కూడా హింసను మూక దాడులను, భౌతిక దాడులను, అసాంఘిక, అనైతిక కార్యక్రమాలను చేపట్టరు. అమానుషమైన చర్యలకు పూనుకోరు. వ్యక్తుల మధ్య, కుటుంబాల మధ్య, సంస్థలు, సమాజాలు, దేశాల మధ్య, ఇలాంటి కాన్ఫ్లిక్ట్ వచ్చినా కూడా, వాటిని జటిలం చేయకుండా, అసలు సత్యమేంటో తెలుసుకొని సమస్య నివారణకు, వారి మధ్యన, అర్థం చేసుకునే అనువైన వాతావరణం కల్పించాలని, అలాంటి పరిస్థితుల్లోనే ప్రజల, దేశ సమస్యలు, వివాదాలు పరిష్కారం అవుతాయన్నది మహాత్మా గాంధీ నమ్మిన సిద్ధాంతం. ఆచరణలో చూపించిన సత్యం. కానీ ఇప్పుడు ప్రభుత్వాలు గాంధీ పట్ల, ఆయన చేసిన పోరాటం, త్యాగం పట్ల చూపిస్తున్న వైఖరి బాధాకరంగా ఉంది. చరిత్రను ఎవరూ చెరిపి వేయలేరు. ఎవరికి ఇష్టం ఉన్నా లేకున్నా చరిత్రను చరిత్రగానే చెప్పగలిగే, భావించగలిగే, సంస్కారం ఉండాలి .సంస్కారవంతమైన పాలనను ప్రజలు కోరుకుంటారు. ప్రభుత్వాలు మతవిశ్వాసాలతో జోక్యం చేసుకోవడం, రాజకీయాలతో మతాన్ని జోడించడం, రాజ్యాంగ లక్ష్యమైన 'లౌకికవాదానికి' బదులుగా, మతాలకు పెద్దపీట వేయటాన్ని గాంధీ ఎప్పుడు కోరుకోలేదు. ఆయన లౌకిక భారతదేశ నిర్మాణాన్ని కలలుగన్నాడు. మనమంతా గాంధీ కలలుగన్న లౌకిక భారత దేశ లక్ష్యాన్ని సాధించడానికి, గాంధీ ఆశయాల పరిమళాన్ని విస్తృత ప్రజా బహుళ్యంలోకి తీసుకెళ్లాల్సి ఉంది.

అంతేకాదు గాంధీజీ ఈ ప్రపంచంలోని అనేక దేశాల, సామాజిక, ఆర్థిక, రాజకీయ జీవితాలను, వారి స్వాతంత్ర్యకాంక్షను, దోపిడీ శక్తుల సామ్రాజ్యవాదుల, వికృతయుద్ధ దమన కాండను, ఆక్రమిత చర్యలను, ధైర్యంగా ఖండించారు. ఆ క్రమంలోనే పాలస్తీనా ప్రజల పోరాటాన్ని సునిశితంగా పరిశీలించారు. అర్థం చేసుకున్నారు. పాలస్తీనా భూభాగాన్ని ఆక్రమిస్తున్న ఇజ్రాయిల్ చర్యలను తప్పు అని ఖండించడమే కాదు, తాను ఒక ఆర్టికల్ రాస్తూ పాలస్తీనియుల పోరాటం న్యాయ సమ్మతమైనదని వారికి మద్దతు ప్రకటించారు.

'ఇంగ్లాండు ఇంగ్లీషు వారిదైనట్లుగా', ఫ్రాన్స్ ఫ్రెంచ్ వారిదైనట్లుగా, పాలస్తీనా అరబ్బులకే చెందుతుంది. అరబ్బుల మీద యూదులను రుద్దడం తప్పు మాత్రమే కాదు, అమానుషం కూడా అవుతుందని మహాత్మా గాంధీ స్పష్టమైన వైఖరిని ఈ ప్రపంచానికి తెలియజేశారు. పాలస్తీనా వైపు మద్దతుగా నిలబడ్డ ఆనాటి నుండి ఇప్పటివరకు పాలస్తీనా తన మాతృభూమిని రక్షించుకోవడానికి పోరాడుతూనే ఉంది. ఇజ్రాయిల్ ఏకపక్ష యుద్ధం కొనసాగుతూనే ఉంది. అనేక సార్లు పాలస్తీనా ,ఇజ్రాయిల్ దేశాల మధ్య జరిగిన చర్చలు ఫలితంగా, ఐక్యరాజ్యసమితి సమక్షంలోనే కుదిరిన ఒప్పందాన్ని కూడా ఇజ్రాయిల్ లెక్క చేయకపోవడం, అంతర్జాతీయ న్యాయసూత్రాలను ఐక్యరాజ్యసమితి అవమానపరిచి నట్లేనని ప్రజలంతా భావిస్తున్నారు.


ఇటీవల అక్టోబర్ 7న గాజా మీద ఇజ్రాయిల్ దాడి ప్రారంభమై, ఈ నెల 7వ తారీఖు నాటికి సంవత్సరం పూర్తవుతుంది. పాలస్తీనా గాజా ఇప్పుడు ప్రతిక్షణం చస్తూ బతుకుతోంది. చిన్నారులు, బడిపిల్లలు, యువకులు, వృద్ధులు, పాఠశాలలు, వైద్యశాలలు ఏవీ యుద్ధ మారణకాండ నుండి మినహాయించడం లేదు. వేలు, లక్షలాదిమంది క్షతగాత్రులు అవుతున్నారు. గాయాల పాలై వైద్యం అందక మరణిస్తున్నారు. పాఠశాలల్లోనే బడి పిల్లలు ప్రాణాలు వదులుతున్నారు. తినటానికి తిండి లేదు, తాగటానికి నీళ్లు లేవు, పాలస్తీనా గాజా ఇప్పుడు సామ్రాజ్యవాదుల చక్రబంధంలో చిక్కుకున్నప్పటికీ, ధైర్య సాహసాలతో, గాయపడ్డ హృదయాలతో, రేపటి విజయం కోసం పోరాడుతున్న ప్రజలకు, అలీన విధానాన్ని పాటిస్తున్న భారతదేశం మద్దతుగా నిలవాలి. పాలస్తీనా దేశానికి న్యాయం జరగాలి. ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధం ఆగాలి- పాలస్తీనాను ఫ్రీ పాలస్తీనిగా ప్రకటించాలన్న గాంధీజీ కలలు సహకారం అయ్యేంతవరకు పాలస్తీనాకు మద్దతుగా నిలబడదాం. పోరాడుదాం.



- కే.వి.ఎల్.
రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి
అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం
తెలంగాణ రాష్ట్ర కమిటీ: 9490952649

# తనదైన ముద్ర వేసిన స్థితప్రజ్ఞుడు గాంధీజీ

> ఈ అక్టోబర్ రెండు గాంధీజీ 155వ జయంతి. ప్రపంచంలో అరుదైన వ్యక్తులలో గాంధీజీ ఒకరు. ఎంతగా ప్రజల మన్నన పొందారో అంతగా విమర్శలకు గురయ్యారు. భారతదేశం అతన్ని జాతిపితగా గౌరవించింది. ఈ దేశంలోనే ఒక భావజాలం అతన్ని హత్య చేసేదాకా వెళ్ళింది. గాంధీజీ స్వామి వివేకానందచే స్ఫూర్తి పొందారు. గాంధీ హత్యను సమర్థించే వారు కూడా స్వామి వివేకానంద తమకు స్ఫూర్తి అంటారు. ఇదొక బేతాళ ప్రశ్న. కాలం గర్భంలో రాడికలిజం జీవం పోసుకుంటున్న సందర్భంలో గాంధీజీ జీవించారు. దీని ప్రభావం వారిలో స్పష్టంగా కనిపిస్తుంది. సామాజిక పరివర్తనను మితవాద దృష్టితో చూశారు. వ్యక్తిగతంగా "జిద్ది" స్వభావి. అతని సామాజిక దృక్పథం , వ్యక్తిగత స్వభావం మధ్య ఉన్న వైరుధ్యమే అతనికున్న విశిష్టత. అదే అతన్ని జాతి ఆరాధ్యునిగా మార్చింది. అదే అతన్ని ద్వేషించడానికి కారణమయ్యింది.




గాంధీ కంటే 50 సంవత్సరాల ముందు పుట్టిన మార్క్స్ సైద్ధాంతిక కుదుపునకు ప్రపంచం శాశ్వత ప్రకంపనలకు గురైంది. సోషలిజం ప్రపంచ రాజకీయాలలో చర్చనీయాంశ ఎజెండాగా మారింది. సకల దేశాల శ్రామికులను విప్లవీకరించింది. బల ప్రయోగ తిరుగుబాట్లకు బలం చేకూర్చింది. వేర్లు పాతుకుపోయిన భావవాదంపై గతి తార్కిక భౌతిక వాదం పిడుగుల వర్షమై కురిపిస్తున్న కాలమది. రష్యా అక్టోబర్ విప్లవ విజయం అశ్వమేధ యాగం చేస్తున్న కాలం . జాతులు విముక్తిని, దేశాలు స్వతంత్రాన్ని కోరుతున్న కాలం. భారతదేశం దీనికి మినహాయింపుగా లేదు

చైనాలో రైతాంగం సాయుధ లాంగ్ మార్చ్ చేస్తుంటే,భారత దేశంలో మాత్రం శాంతి, అహింస మార్గమే ఉద్యమం అయ్యింది. ప్రపంచం "దాస్ క్యాపిటల్" వైపు చూస్తుంటే గాంధీజీ భగవద్గీతను చేతపట్టారు. కార్మికవర్గం ప్రతిపాదించిన సోషలిజానికి ప్రత్యామ్నయంగా గాంధేయ సోషలిజం ఆవిష్కారమైంది. ఈ రకంగా భారత లిబరల్ బూర్జువా వర్గాన్ని గాంధీజీ ఆకర్షించారు. ఫ్యూడల్ శక్తులకు, క్యాపిటలిస్ట్ శక్తులకు సంధి కుదర్చటంలో సఫలీకృతమయ్యారు. ఒకవైపు నెహ్రూను మరోవైపు పటేల్ ను తనతో పాటు కలిపి నడిపించగలిగారు. అదే సందర్భంలో జాతీయ విప్లవకారులను, కమ్యూనిస్టులను జాతియోద్యమానికి నాయకత్వం వహించకుండా నిలువరించగలిగారు. అనేక సందర్భాలలో అంబేద్కర్ అడుగులకు అడ్డంకిగా ఉంటూనే జాషువాలాంటి వారు కీర్తించేలా చేసుకున్నారు.


భారత స్వాతంత్రోద్యమానికి నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్... అతివాదులు, మితవాదులుగా విడిపోయి సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. జాతి యోద్యమంలో హిందూ ,ముస్లిం మత విద్వేషపు కుంపటి అంతర్లీనంగా మండుతూనే ఉంది. మార్క్సిస్ట్ ప్రేరేపితులు కార్మిక ఉద్యమాలను నిర్మించడానికి కృషి చేస్తున్నారు . జాతీయోద్యమం సోషలిజం వైపు అడుగులు వేయాలని ఆకాంక్షిస్తున్నారు. మరోవైపు హిందూ రాజ్యాంగం ఏర్పడాలని ఇంకొందరి స్వప్నం. దేశానికి స్వతంత్రం సిద్ధిస్తే మెజార్టీ హిందువులే పాలకులుగా ఉంటారు. తాము రెండవ తరగతి పౌరులుగా జీవించాల్సి ఉంటుందనే భయాలు ముస్లిం నాయకుల్లో, ముస్లిం సమాజంలో మొదలయ్యాయి. ద్విజాతి సిద్ధాంతం ముందుకొచ్చింది. విచిత్రమేమంటే మత ప్రభావితులుగా ఉన్న హిందూ, ముస్లిం నాయకులు ఇరువురు కూడా ద్విజాతి సిద్ధాంతాన్ని బలపరిచినవారే. ఇటువంటి సంక్లిష్ట స్థితిలో జాతీయోద్యమాన్ని ఒక తాటిపైకి తీసుకొచ్చి నడిపిన ఘనత గాంధీజీకి దక్కుతుంది. అనేకనేక వైరుధ్యాలను కాలానుగుణంగా పరిష్కరించడంలో , జనామోదం పొందటంలో గాంధీజీ విజయం సాధించారు. ఈ విజయమే అతని ప్రాణాలను మూల్యంగా బలి కోరింది.

గాంధీజీ హత్యానంతరం నిషేధానికి గురైన సంస్థలు ఇప్పుడు ప్రభుత్వాలను నడుపుతున్నాయి. వారు గాడ్సేను ముందుకు తేవడానికి ప్రయత్నిస్తున్నారు. అయినా గాంధీజీని అధిగమించి ముందుకు పోలేకపోతున్నారు . అస్తిత్వ ఉద్యమాలనేకం గాంధీ అంటే మాకు గిట్టదంటున్నాయి. వామపక్ష విప్లవకారులు గాంధీని ఈసడించుకుంటున్నారు. అయినప్పటికీ గాంధీజీ హత్య జరిగి 76 ఏళ్లు గడిచినా జాతి నుదిటిపై ఆయన చెదరని తిలకం. జాతి పెదవులపై వడవని చర్చ.



- మహమ్మద్ ఖలీల్
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
తెలంగాణ కార్మిక సంఘాల సమాఖ్య TFTU
సెల్: 99129 15982

# ఆదర్శ మహానేత, అసమాన దేశ భక్తుడు లాల్ బహదూర్ శాస్త్రి



భారత దేశనికి ఆ భగవంతుడు ప్రసాదించిన మహానేతలలో ప్రధాన నేత, మన దేశానికి ద్వితీయ ప్రధాని, 1965 లో పాకిస్తాన్ తో మనకు జరిగిన యుద్ధంలో ఘనవిజయం సాధించి యావత్ దేశ ప్రజల విశేష మన్ననలను అందుకున్న భారత ప్రజల హృదయ నేత, "జై జవాన్, జై కిసాన్" పిలుపునిచ్చిన అసమాన దేశ భక్తుడు లాల్ బహదూర్ శాస్త్రి అక్టోబర్ 2 న జన్మించారు.

1964 మే 27న మన దేశ ప్రథమ ప్రధాని నెహ్రూ కన్నుమూయడంతో అంతటి మహత్తరమైన పదవీ బాధ్యతలను నిర్వహించగల సమర్థుని కోసం అన్వేషించగా ఆ పదవి లాల్ బహదూర్ శాస్త్రిని వరించింది. 5 అడుగుల 2 అంగుళాల ఎత్తు గల శాస్త్రీజీ తన హయాంలో 1965 లో పాకిస్తాన్ కు ,మనకు మధ్య జరిగిన భీకర యుద్ధంలో ఘనవిజయాన్ని సాధించి, దేశ ప్రజలందరి మన్ననలు పొందారు. అది గడిచి నేటికీ 59 సంవత్సరాలు గడిచినప్పటికీ శాస్త్రీజీ ఇప్పటికీ 140 కోట్ల మంది భారతీయుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోవడం ఆయన సమర్థతను చాటిచెబుతోంది.

**జననం, బాల్యం, వివాహం**

మన దేశ ద్వితీయ ప్రధానిగా అద్వితీయమైన బాధ్యతలు చేపట్టిన లాల్ బహదూర్ ఉత్తర ప్రదేశ్ లోని ముఘల్ సరాయిలో 1904 అక్టోబర్ 2 న శారదా ప్రసాద్ శ్రీవాత్సవ, రామదులారి దేవి దంపతులకు జన్మించారు. లాల్ బహదూర్ ఏడాది వయస్సులోనే తండ్రిని కోల్పోగా, తల్లి రామదులారీ దేవి కొడుకును, ఇద్దరు కూతుళ్లను పెంచి పెద్ద చేసింది. లాల్ బహదూర్ 1926 లో కాశీ విద్యాపీఠం నుండి ప్రథమ శ్రేణిలో పట్టభద్రులయ్యారు. కాశీ విద్యాపీఠం ఇచ్చే పట్టాను ఆ రోజులలో 'శాస్త్రి' అని గౌరవంగా సంబోధించేవారు. అలా శాస్త్రి ఆయన పేరులో భాగమైంది. శాస్త్రి మహాత్మా గాంధీ, బాలగంగాధర తిలక్ ఆశయాలకు ,ఆదర్శాలకు ప్రభావితులై 1921లో భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. అనేక సందర్భాలలో దాదాపు 9 ఏళ్ల పాటు జైలు జీవితం అనుభవించారు. శాస్త్రి వివాహం 1928 మే 16న మీర్జాపూర్ లో లలితాదేవితో జరిగింది.

**నైతికతకు మారు పేరు శాస్త్రీజీ**

స్వాతంత్ర్యం తర్వాత శాస్త్రీజీ ఉత్తరప్రదేశ్ రాష్ట్ర పార్లమెంటరీ సెక్రటరీగా నియమితులయ్యారు. గోవింద వల్లభ పంత్, ముఖ్యమంత్రిత్వంలో పోలీసు , రవాణా శాఖల మంత్రిగా పదవీ స్వీకారం చేశారు. రవాణా వ్యవస్థలో మొదటిసారి 'మహిళా కండక్టర్ల'ను నియమించారు. 1951లో నెహ్రూ ప్రధానమంత్రిత్వంలో ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీకి జనరల్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. 1952లో ఉత్తర ప్రదేశ్ నుండి రాజ్యసభకు ఎన్నికయ్యారు. మే 13 1952 నుండి డిసెంబర్ 7 1956 వరకు కేంద్ర రైల్వే, రవాణా శాఖ మంత్రిగా పనిచేశారు. బాధ్యతల నిర్వహణ పట్ల అత్యంత శ్రద్ధగా ఉండే శాస్త్రీజీ తమిళనాడులోని అరయాళూర్ లో జరిగిన ఘోర రైలు ప్రమాదానికి నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా సమర్పించారు అలా తన హయాంలో జరిగిన ఆ దుర్ఘటనకు నైతికంగా బాధ్యత వహించి నైతికతకు మారుపేరుగా శాస్త్రీజీ రాబోయే తరాలకు ఆదర్శంగా నిలిచారు.

**జై జవాన్, జై కిసాన్ పిలుపునిచ్చిన శాస్త్రీజీ**

1964 మే 27న నెహ్రూ కన్ను మూయడంతో ప్రధాని పదవి చేపట్టారు. తన హయాంలో 1965లో జరిగిన 22 రోజుల భారత్ పాకిస్తాన్ యుద్ధంలో విజయం సాధించి తన ఘనతను చాటారు. యుద్ధానంతరం ఛిన్నాభిన్నమైన దేశ ఆర్థిక రక్షణ వ్యవస్థలను సమర్థవంతంగా ఎదుర్కొనేం దుకు 'జై జవాన్, జై కిసాన్' పిలుపునిచ్చారు. శాంతి స్థాపన దిశలో శాస్త్రీజీ ఆనాటి పాకిస్తాన్ రాష్ట్రపతి మహమ్మద్ ఆయుబ్ ఖాన్ తో కలిసి తాష్కెంట్ శిఖరాగ్ర సమావేశానికి హాజరై, తాష్కెంట్ వాంగ్మూలంపై సంతకాలు చేశారు. ఆ మరుసటి రోజే 1966 జనవరి 11న తాష్కెంట్ లోనే గుండె పోటుతో మరణించారు. ఆయన మరణంపై ఇప్పటికీ ఎన్నో సందేహాలు ఉన్నాయి. ఆయనపై విషప్రయోగం జరిగిందనే వాదన ప్రజల్లో ఇప్పటికీ ఉంది. అలా భారతదేశం ఒక ఆదర్శ మహానేతను, గొప్ప దేశభక్తుడిని శాశ్వతంగా కోల్పోయినా, ఈనాటికీ ప్రజల హృదయాలలో శాస్త్రీజీ అంటే 'జై జవాన్ జై కిసాన్' అనే అద్భుతమైన నినాదం గుర్తుకు వస్తుంది. శాస్త్రీజీ చూపిన బాటలో పయనించి, ఆయన ఆశయాలను నెరవేర్చటమే మనం ఆయనకు సమర్పించే ఘనమైన నివాళి అవుతుంది.



వ్యాసకర్త: "సాహిత్య కళా విభూషణ"
-చౌదూరి నరసింహారావు
ఆధ్యాత్మిక,సామాజిక విశ్లేషకులు

## వ్యాసాలు, కవితలకు ఆహ్వానం

విశ్వంభర ఎడిటోరియల్ పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను, కవితలను ఆహ్వానిస్తున్నాం. ఈ కింది చిరునామాకు పోస్టులో లేదా ఈ-మెయిల్ ద్వారా పంపించగలరు. మీ వ్యాసం 1000 పదాలకు మించకుండా ఉండాలి. తెలుగు యునీకోడ్‌లో టైప్ చేసి పంపిన వాటికి ప్రాధాన్యం ఉంటుంది. రచయితలు విశ్వంభరకు మాత్రమే పంపుతున్నామని హామీపత్రం జత చేయాలి.

**చిరునామా:**
V3 న్యూస్, విశ్వంభర తెలుగు దినప్రతిక కార్యాలయం, ప్లాట్ నంబర్ 204, రెండో అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నంబర్ 1560 ఎదురుగా, చైతన్యపురి ఎక్స్ రోడ్డు, హైదరాబాద్-500060

ఈ-మెయిల్: editpagevishwambhara@gmail.com
ఇతర వివరాలకు సెల్ నం: 9441222429 సంప్రదించగలరు.

# హైడ్రాపై విష ప్రచారంతో అల్లకల్లోలం

## మైనంపల్లి హనుమంతరావు



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** హైడ్రాపై విష ప్రచారంతో చేయ డం ద్వారా తెలంగాణను అల్లక ల్లోలం చేయాలని కేటీఆర్, హరీశ్‌రావులు ప్రయత్ని స్తున్నా రని కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆరోపిం చారు. మంగళవారం అయన మీడియా సమా వేశంలో మాట్లాడుతూ ..'హైదరాబాద్ కూకట్ పల్లిలో కొంతమందికి కాలేజీలు, పెట్రోల్ బంకులు ఉన్నాయి. వాటిని పేదల పేర్లతో నిర్వహిస్తున్నారు. దీనిపై హైడ్రా కమిషనర్ దృష్టి పెట్టాలని సూచించారు. దత్తత గ్రామం కోల్గురులో కొన్ని ఇళ్లను బుల్డోజర్లతో స్వయంగా కూల్చి వేయించిన హరీశ్‌రావు.. ఇప్పుడు బుల్డోజర్లకు అడ్డం పడుకుంటా అని మొసలి కన్నీరు కారుస్తున్నారు. మల్లన్నసాగర్ నిర్వాసితుల గోడు మీకు పట్టదా? హైడ్రా బాధితులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న హరీశ్‌రావు.. మల్లన్నసాగర్ నిర్వాసితులకు ఇచ్చిన హామీ నేరవేర్చాలి" అని మైనంపల్లి డిమాండ్ చేశారు. భాజపాతో కుమ్మక్కు అవుదామని భారాస ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. భారాసను భాజపా నమ్మదని.. ఇక ఆ పార్టీ పని అయిపోయిందని ఎద్దేవా చేశారు. సిద్దిపేట జిల్లా తొగుట మండలం తుక్కపూర్‌లోని మల్లన్న సాగర్‌ను సందర్శించిన మైనంపల్లి.. భారాసపై విమర్శలు గుప్పించారు. 'పోలీసులతో రైతులను కొట్టించిన ఘనత కల్వకుంట్ల కుటుంబానికే దక్కిందని అన్నారు. మంచి ఉద్దేశంతో హైడ్రా ప్రారంభిస్తే కావాలని విష ప్రచారం చేస్తున్నారు. సోషల్ మీడియాను అడ్డం పెట్టుకొని తప్పుడు పోస్టులు పెడుతున్నారు. భారాస హయాంలో చెరువులు, కుంటలు, నాలాలు కబ్జాకు గురయ్యాయని ఆరోపించారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో భారాస ఖర్చు చేసినట్టు కాంగ్రెస్, భాజపాలు చేయలేదు. వెంకట్రామిరెడ్డిని మెదక్ ఎంపీ ఎన్నికల్లో పోటీ చేయించి బలిపశువును చేశారని తెలిపారు వెంకట్రాంరెడ్డితో రూ.250 కోట్లు ఖర్చు పెట్టించారని చెప్పారు . కమీషన్లు లేకుండా ఏ పనైనా చేశామని కేటీఆర్, హరీశ్‌రావు ప్రమాణం చేయగలరా ప్రశ్నించారు. పేదవారి కోసం మేం ప్రాణాలుఇవ్వడానికైనా సిద్ధం" పేర్కొన్నారు.

## చెత్త రిక్షాలు, ట్రాలీలు పంపిణీ



**విశ్వంభర,ఎల్బీనగర్:** చైతన్యపురి డివిజన్ లో కార్పొరేటర్ క్యాంపు ఆఫీస్ లో చెత్త తీయడానికి కొత్త రిక్షాలు, ట్రాలీలు శానిటేషన్‌కు సంబంధించినవి స్థానిక కార్పొరేటర్ రంగా నర్సింహా గుప్తా చేతుల మీదగా ప్రారంభించారు. జిహెచ్‌ఎంసి డిసి సుజాత, డి.ఈ చందన, ఇన్స్పెక్టర్ మహేందర్ రెడ్డి, బీజేపీ ప్రసిడెంట్ వినోద్ యాదవ్, నాయకులు నరేందర్ రెడ్డి, జీ రాంమోహన్, బాలకృష్ణ పాల్గొన్నారు.

## రైతుబంధు, రైతుబీమా చెల్లించాలి



**విశ్వంభర, కడ్తాల్:** దసరా లోపు తెలంగాణ రైతాంగానికి రైతుబంధు, రైతు భీమా, విజయ డైరీ పాల బిల్లులు చెల్లించకపోతే రేవంత్ రెడ్డి సర్కార్ పై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా భారీ ఎత్తున మహాధర్నా చేపడతామని కడ్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి సర్కార్ అధికారం కోసం ఎన్నో హామీలను ఇచ్చి, తెలంగాణ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల నడ్డి విరిసే కార్యక్రమాన్ని చేపడుతుందని ఆయన మండిపడ్డారు. తెలంగాణలో ఖరీఫ్ సీజన్ పూర్తయి రబీ సీజన్ ప్రారంభం అవుతున్నా కూడా ఇంతవరకు రైతుల ఖాతాలో రైతుబంధు పడలేదని అన్నారు. దసరా లోపల రైతులకు రైతుబంధు రైతు భీమా పాల బిల్లులు చెల్లించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మహాధర్నా చేపడతామని హెచ్చరించారు. పిఎసిఎస్ చైర్మన్ వెంకటేష్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీ నరసింహ రెడ్డి, రైతు కోఆర్డినేటర్ వీరయ్య, డైరెక్టర్‌సేవ్య,గ్రామ కమిటీఅధ్యక్షుడు రామకృష్ణ, నరసింహ, అంజి పాల్గొన్నారు.01

## పాత కార్యకర్తలకే పదవులు ఇచ్చే ప్రయత్నం

### తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహా దారు ఆర్కర్ వేణుగోపాల్ రావు



**విశ్వంభర, ఎల్బీనగర్:** పార్టీలో చాలా కాలం నుండి పనిచేస్తూ పార్టీని అంటపెట్టుకొని కష్టకాలంలో పార్టీకి అండగా నిలుస్తున్న సీనియర్ కార్యకర్తలకు వివిధ నామినేట్ పదవుల్లో నియామకం చేసేందుకు ప్రభుత్వం ఆలోచిస్తుందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు అర్కర్ వేణుగోపాలరావు అన్నారు. ఇటీవల నగరంలోని బ్రాహ్మణ సంఘాల నాయకులు తెలంగాణ వైదిక బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు మురుకుంట్ల రాజేశ్వర శర్మ, ప్రధాన కార్యదర్శి రుద్రవీణ బాలసుబ్రమణ్యం, వక్కలంక శ్రీనివాస రావు, పాపయ్యా శర్మ, ఉప్పాల అనిల్ శర్మ, షణ్ముఖ శ్రీనివాస్, బ్రహ్మఋషి, వెంకటేష్, వేణుగోపాలరావును కలిసిన వారిలో ఉన్నారు. ప్రముఖ బ్రాహ్మణ సంఘ నాయకులు బ్రాహ్మణ సంక్షేమ సంఘ సమాఖ్య ప్రాంతీయ కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషిచేసిన వారికి మాత్రమే తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్, తెలంగాణ బ్రాహ్మణ కార్పొరేషన్లలో పదవులు ఇచ్చేందుకు ప్రభుత్వం ఆలోచించాలని అర్కర్ వేణుగోపాల్‌ను కోరినట్లు తెలిపారు. వేణుగోపాలరావు తన స్పందన తెలియజేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకువెళ్లి కేవలం కాంగ్రెస్ పార్టీలో పని చేసిన వారికి మాత్రమే పదవులు వచ్చే విధంగా ముఖ్యమంత్రిని, ఒప్పించే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## ఆర్థిక ఇబ్బందులతో కుటుంబం ఆత్మహత్యాయత్నం ఒకరు మృతి

**విశ్వంభర, ఎల్బీనగర్:** ఆర్థిక ఇబ్బందులతో కుటుంబం ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన సంఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్స్పెక్టర్ సైధి రెడ్డి, ఎస్ఐ మారయ్య గౌడ్‌లు తెలిపిన వివరాల ప్రకారం కర్నూలుకు చెందిన వెంక టేశ్వర ప్రసాద్, లత దంపతులు బతుకుతెరువు కోసం నగరానికి వచ్చి దిల్సుఖ్నగర్లోని కోదండరాం నగర్ లో కుటుంబంతో కలిసి కిరాణా షాపులో నడుపు కుంటూ నివాసం ఉంటున్నారూ. కొంత కాలంగా ఆర్థిక పరిస్థితులు బాగోలేక సుమారు రూ. 25 లక్షల నుండి 30 లక్షల వరకు అప్పులు కాగా, అప్పులు కట్టలేక వారి కుటుంబ సభ్యులు అందరూ కలసి ఆత్మ హత్య చేసుకోవాలి అని గౌలిపురా వద్ద గల ఒక ఫెర్టిలైజర్ షాప్‌లో పురుగుల మందు రెండు బాటిల్లను కొనుక్కొని వారు అందరూ తాగి ఇంట్లో లోపలి నుండి గడియ పెట్టుకొ న్నారు. 05 గురిలో తండ్రి వేంకటేశ్వర ప్రసాద్ ఆ ఇంటి లోనే క్రింద అద్దెకు వుంటు న్నటువంటి రాజశేఖర్ అనే వ్యక్తికి సమాచా రము ఇవ్వగా తాను వెంటనే డైయల్ 100కు కాల్ చేసి సమాచారము ఇవ్వగా వారిని అక్కడి నుంచి ఉస్మానియా హాస్పిటల్‌కి తరలించినట్లు తెలిపారు. ఆ ఇంటి యొక్క తలుపులు తీసి చూడగా 05 కుటుంబ సభ్యులు పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో వుండగా వ్యక్తులను అద్దెకు వున్న వ్యక్తి కలసి వెంటనే వారి అందరినీ 108 అంబులెన్స్ ద్వారా వారిని ఉస్మానియా హాస్పిటల్‌కి తరలించడం జరిగింది. వేంకటేశ్వర ప్రసాద్, లతలు, సందీప్(30), సాయి స్వరూప్( 28), వంశీ కృష్ణ( 26)లలో వంశీకృష్ణ అనే అతను చనిపోయినాడు. నలుగురు వ్యక్తుల ఆరోగ్య ముప్రస్తుత మునిలకడగా వున్నది తెలిపారు.

## భద్రత కల్పించాలి



**విశ్వంభర, హైద్రాబాద్:** గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్, బీజేపీ నాయకులు చీకోటి ప్రవీణ్‌లపై జరిగిన రెక్కీపై తెలంగాణ ప్రభుత్వం విచారణ చేపట్టి నిందితులను కఠినంగా శిక్షించి, వారికి ప్రత్యేక భద్రత కల్పించాలని ఆర్యవైశ్య సంఘం కొత్తపేట కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం కొత్తపేట అధ్యక్షులు మాదూరి వాసుగుప్త, సెక్రటరీ అత్యం సత్తయ్య, రేణిగుంట శ్రీనివాస్, సారాఫ్ తులసి పాల్గొన్నారు.

## రైతు భరోసా అమలు చేయాలి

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** రైతులకు పెట్టుబడి సాయం అందించడానికి, ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు ప్రతి ఎకరానికి 7500 రూపాయల పెట్టుబడి సాయం, రైతు భరోసా పథకం ద్వారా అందిస్తామని ఇచ్చిన హామీకీ కట్టుబడి వెంటనే రైతులకు రైతు భరోసా పథకాన్ని అమలు చేసి పెట్టుబడి సాయం అందించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో చెరుకు మల్లేష్ అధ్యక్షతన సిపిఎం పట్టణ 6వ మహాసభ నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథిగా పార్టీ మండల కార్యదర్శి వేముల భిక్షం హాజరయ్యారు. సిపిఎం డివిజన్ నాయకులు రచ్చ గోవర్ధన్,పార్టీ మండల నాయకులు తుమ్మల సత్యనారాయణ రెడ్డి, సురేష్, తదితరులు పాల్గొన్నారు

## ఉపాధి పనులను గుర్తించాలి



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో మంగళవారం రోజు ఉపాధి హామీ పనుల గుర్తింపు నిమ్మితం పంచాయతీ కార్యదర్శులకి, ఉపాధి హామీ సిబ్బందికి ఎంపీడీఓ రాములు నాయక్ సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాలలో వచ్చే సంవత్సరం 2025-26 ఆర్థిక సంవత్సరం నందు ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించడం కోసం కొత్త పనులని గుర్తించాలని ఎంపీడీఓ ఆదేశించారు. ఎంపీడీఓ రాములు నాయక్, ఏపీఓ బి రమేష్, ఈసీ ఎస్ శ్రీనివాస్, టీఏలు ఏ మల్లేశం, డి శ్రీశైలం, జె యాదిరెడ్డి, డి నిర్మల, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్ లు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలం (ఎం) రహీంఖాన్ పేట గ్రామములో దుంప పూలమ్మ అనారోగ్యంతో చనిపోవడం మృతి చెందింది. వారి కుటుంబానికి బిఆర్ఎస్ రాష్ట్ర పార్టీ నాయకులు కొప్పుల హరిదీప్ రెడ్డి 5000 రూపాయలు ఆర్థికసా యం అందించారు. వారి కుటుం బానికి బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు సుదగాని లింగయ్య, మెరుగు అంజయ్య, కర్రే అయిలయ్య, కొత్త నర్సిరెడ్డి, బండి నరేష్, బూడిద మహేష్, గ్రామ నాయకులు దుంప యాదగిరి, బొంగు రాములు,టి సత్తయ్య, దుంప సతీష్, దుంప బుచ్చయ్య పాల్గొని వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు.

## గుప్పెడంత గుండెకు కామినేని రక్షణ

### డాక్టర్ ఎంఆర్ఎం బాబు



**విశ్వంభర, ఎల్ బినగర్:** గుప్పెడంత గుండెను కాపాడుకోవడం ప్రతి ఒక్కరికీ చాలా ముఖ్యమని, అందుకే ఎప్పటికప్పుడు తగిన వైద్య పరీక్షలు చేయించుకుంటూ దాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని ఎల్బీనగర్ కామనేని ఆస్పత్రి కార్డియాలజీ విభాగాధిపతి, కన్సల్టెంట్ కార్డియాలజిస్టు డాక్టర్ ఎం.ఆర్.ఎం.బాబు అన్నారు. మంగళవారం సెప్టెంబర్ 29న ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా కామినేని ఆస్పత్రిలో సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకు అమల్లో ఉండేలా ఒక ప్రత్యేక గుండె పరీక్షల ప్యాకేజిని ఆయన ఆవిష్కరించారు. ఆరు నిమిషాల సైక్లింగ్ యాక్టివిటీని కూడా ఆయన ప్రారంభించారు. గుండె ఎంత ఆరోగ్యంగా ఉందో తెలుసుకోవడంతో పాటు, దాన్ని కాపాడుకోవడానికి ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. సాధారణంగా రూ. 2,210 విలువ చేసే గుండె పరీక్షలను రూ.999కే అందిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా ఈసీజీ, 2డి ఎకో వైద్యపరీక్షలతో పాటు కార్డియాలజిస్టు కన్సల్టేషన్ కూడా అందిస్తారు. ఒకవేళ అవసరం అనుకుంటే, కేవలం రూ.5000 తోనే కరోనరీ యాంజియోగ్రామ్ పరీక్ష కూడా చేస్తారు. వైద్యుల సలహా మేరకు ఇతర వైద్య పరీక్షలన్నింటిపైనా 20% రాయితీ అందిస్తారు. సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు డాక్టర్ సాగర్ భుయార్, సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు డాక్టర్ ఎ.రవికాంత్, కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు డాక్టర్ జి. శివప్రసాద్, కన్సల్టెంట్ కార్డియాలజిస్టులు డాక్టర్ శశిధర్ మడక పాల్గొన్నారు.

## అనారోగ్యానికి గురైన రిపోర్టర్‌కు పరామర్శ



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్టు కందోజు నర్సింహా చారి ఇటీవల అనారోగ్యంతో కంటి ఆపరేషన్ చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ బాబా మంగళవారం రోజున ఇంటికి వెళ్లి పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించారు. చిమ్మని రాజు, సీనియర్ జర్నలిస్ట్‌లు పుట్ట హనుమంత్, పసుపునుటి ప్రభాకర్, డంగు నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



**విశ్వంభర, భూపాలపల్లి:** పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే మానసిక ఆరోగ్యం బాగుంటుందని, మానసిక ఆరోగ్యం బాగుంటే నేరం చేయాలనే ఆలోచన రాదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి , న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పి. నారాయణ బాబు అన్నారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కోర్టు ప్రాంగణం వద్ద ప్రారంభం అయిన న్యాయ అవగాహన ర్యాలీ అంబెడ్కర్ సెంటర్ నుండి తిరిగి జిల్లా ప్రధాన న్యాయస్థానం వరకు సాగింది. న్యాయవాదులు, కోర్టు సిబ్బంది మరియు విద్యార్థులను ఉద్దేశించి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ హైకోర్ట్ ఆదేశాల మేరకు కోర్టు ప్రాంగణాల్లో స్వచ్ఛ్ హి సేవా కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. పరిశుభ్రత అనే సేవను అందరూ చేయాలనీ అప్పుడు దేశం మొత్తం శుభ్రంగా తయారవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే. జయరాం రెడ్డి, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్. రామచంద్రారావు, కూనూరి సురేష్ కుమార్, బల్ల మహేందర్, ఏదులాపురం శ్రీనివాస్, కోర్టు సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## లింగయ్య మృతికి సంతాపం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** సీపీఎం నాయకులు,కామ్రేడ్ అనుమతుల లింగయ్య మృతి ఈ ప్రాంత సీపీఎం ఉద్యమానికి తీరనిలోటని అన్నారు. మంగళవారం అత్మకురు(ఎం) మండలం కూరెళ్ళ గ్రామానికి చెందిన సీపీఎం నాయకులు అనుమతుల లింగయ్య అకాల మృతికి సిపిఎం గ్రామ మండల కమిటీల ఆధ్వర్యంలో కామ్రేడ్ లింగయ్య పార్థివ దేహానికి ఎర్రజెండా కప్పి, పూలమాలలు వేసి ఘనమైన నివాళులు అర్పించి సంతాపాన్ని ప్రకటించారు. సీపీఎం సీనియర్ నాయకులు రచ్చ గోవర్ధన్, తుమ్మలగూడెం యదయ్యా, బాషబోయిన రాములు, మరిపల్లి మల్లయ్య, బాషబోయిన ఐలయ్య, బండ బిరయ్యా, భాషబోయిన బుగ్గయ్యా, మారుపాక వెంకటేష్, బండ సోమయ్య, బి సత్య నారాయణ, బి పాపయ్యా, వనం అంజయ్య, జింకల భిక్షం, జక్కుల చంద్రయ్య,ఎం యదయ్యా, కురేల్ల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**విశ్వంభర,హన్మకొండ:** స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలోని ఐనవోలు మండలం వెంకటాపూర్, గర్మిళ్లపల్లి గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, సిఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆయన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద ప్రజలకు ఎంతో ఆసరాగా నిలుస్తున్నాయని అన్నారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని పేర్కొన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ చైర్మన్‌కు శుభాకాంక్షలు



**విశ్వంభర, రామన్నపేట:** తెలంగాణ రాష్ట్రంలోనే అతిపెద్ద వ్యవసాయ పండ్ల మార్కెట్‌గా పేరుగాంచిన గడ్డి అన్నారం వ్యవసాయ పండ్ల మార్కెట్ కు నూతన చైర్మన్‌గా నియమితులైన చిలుక మధుసూదన్ రెడ్డిని వారి నివాసంలో రామన్నపేట మండల టిడిపి నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. టి.ఎన్.ఎస్.ఎఫ్ మాజీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి నకిరే కంటి గణేష్, మండల తెలుగు యువత నాయకులు పోచబోయిన మల్లేష్, కుర్మా మహేందర్ పాల్గొన్నారు.

## ఆర్మూర్ వాసికి ఎల్ వోసి అందజేసిన వినయ్ రెడ్డి



**విశ్వంభర, నిజామాబాదు:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని మామిడిపల్లి ఏరియాలో గల మున్సిపల్ 7వ వార్డుకు చెందిన గంగామణి అనారోగ్యంతో బాధపడు తుండటంతో కాంగ్రెస్ నాయకుల సమాచారంతో విషయం తెలిసిన ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి నిమ్స్ ఆస్పత్రిలో వారిని చేర్పించి వారికి చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 2,50,000/- రూపాయల ఎల్ఓసిని వారి కుటుంబ సభ్యులకు మంగళవారం వినయ్ రెడ్డి అందజేశారు. ఆ కుటుంబ సభ్యులు వినయ్ కుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్మూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిబాబాగౌడ్, కాంగ్రెస్ నాయకులు ఎన్ వి రవీందర్ రెడ్డి, రాజుభాయ్,మామిడిచంద్రశేఖర్‌రెడ్డి, మామిడి ఏలియా రెడ్డి,నాగుల శ్రీధర్ గౌడ్ పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజన్స్ జీవన శైలి మార్చుకోవాలి



**విశ్వంభర, మహబూబాబాద్:** మారుతున్న కాలానికి అనుగుణంగా సీనియర్ సిటిజన్స్ (వయోవృద్ధులు) వీలుంటే తమ జీవన శైలిని మార్చుకోవాలన్నారు, అదనపు కలెక్టర్, మంగళవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని, జిల్లా వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు, అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మారుతున్న కాలానికి అనుగుణంగా సీనియర్ సిటిజన్స్ (వయోవృద్ధులు) తమ జీవన శైలిని మార్చుకోవాలన్నారు, వయోవృద్ధులకు ఏదైనా సమస్యలు ఉత్పన్నమైతే వారి సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ 14567 కు కాల్ చెయ్యాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలుకు తెలిపారు, ఈ కార్యక్రమంలో జిల్లా వెల్ఫేర్ అధికారిని వరలక్ష్మి, జడ్పీ సీఈవో నర్మద, అడిషనల్ డిఆర్డిఓ శాంతి కుమారి, సిడిపిఓలు శిరీష, కమల, విజయలక్ష్మి, ఎల్లమ్మ, లక్ష్మి, సంబధిత శాఖల సిబ్బంది చంద్రశేఖర్, సాగంగం, తదితరులు పాల్గొన్నారు

## బతుకమ్మ సంబరాలలో టీఎస్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్



**విశ్వంభర, మహబూబాబాద్:** టిఎస్ మోడల్ స్కూల్ కేసముద్రం మండలం కల్వల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన తెలంగాణ బతుకమ్మ సంబరాలలో పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కనుమరుగవుతున్న బతుకమ్మ తెలంగాణ ప్రభుత్వం దీనికి పూర్వ వైభవం తీసుకొచ్చారు. పకృతి దేవత అన్ని కొనియాడారు. స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, పిల్లలు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి పేదల పాలిట వరం

**విశ్వంభర,సంస్థాన్ నారాయణపూర్:** మండల కేంద్రనికి చెందిన గోసుకొండ యాదగిరి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సిఫార్సు చేయగా వారికి 28,500,రూపాయల చెక్కును కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు మందుగుల బాలకృష్ణ,జిల్లా కార్యదర్శి ఏపూరి సతీష్, మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి నరసింహ, కుక్కల నరసింహ, మాజీ మండల పార్టీ అధ్యక్షులు నయీమ్ షరీఫ్, ఉప్పల రాజయ్య, అందె యాదయ్య,రాచకొండ రమేష్ బాబు, అంతటి ఇస్తారీ,ఉప్పల నాగరాజు, గునిగంటి రాజు, అంద నరేష్, యాదవ్, సింగం కృష్ణ, రేవన పెల్లి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఆస్పత్రిలో చేరిన ఎమ్మెల్సీ కవిత

## పరీక్షలు చేసిన వైద్యులు

**విశ్వంభర , తెలంగాణ బ్యూరో:** బీఆర్ ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మంగళవారం ఉదయం గచ్చిబౌలి ఏఐజీ హాస్పిటల్‌లో చేరారు. సాయంత్రానికి పూర్తి వైద్య పరీక్షలు పూర్తి అవుతాయని ఆమె సన్నిహితులు పేర్కొన్నారు . కవిత వెంట ఆమె భర్త అనిల్ సైతం ఆస్పత్రికి వచ్చారు. కవితకు వైద్యులు పూర్తి స్థాయిలో పరీక్షలు నిర్వహించారు ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో తీహార్ జైలులో ఉన్న సమయంలో ఎమ్మెల్సీ కవిత గైనిక్ సమస్యలతో బాధపడ్డారు. తీవ్ర జ్వరంతో పలుమార్లు అనారోగ్యానికి గురైనట్లు అప్పట్లో వార్తలు వెలువడ్డాయి. ఆ నేపథ్యంలోనే ఢిల్లీ ఎయిమ్స్‌లో ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించి గైనిక్ సమస్యతో బాధపడుతున్నట్లు వైద్యులు ప్రకటించారు. కాగా, లిక్కర్ కుంభకోణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మార్చి 15 కవితను అరెస్ట్ చేసింది. ఏప్రిల్ 15న సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ కూడా అదుపులోకి తీసుకుంది. దాదాపు నాలుగు నెలల తర్వాత కవితకు బెయిల్ వచ్చింది. కవితపై జి ఎం సి టి డి చట్టం 1991, ట్రాన్సాక్షన్ ఆఫ్ బిజినెస్ రూల్స్ ( టి ఓ బీ ఆర్ )-1993, ఢిల్లీ ఎక్సైజ్ చట్టం 2009, ఢిల్లీ ఎక్సైజ్‌ల ప్రాథమిక ఉల్లంఘించిందని కేసు నమోదు చేశారు. తాజాగా ఎక్సైజ్ పాలసీ మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సప్లిమెంటరీ ప్రాసిక్యూషన్ ఫిర్యాదు (ఛార్జిషీట్)ను రౌస్ అవెన్యూ కోర్టులో సబ్మిట్ చేసింది. కవితతో పాటు ఇతర నిందితులు చన్‌ప్రీత్ సింగ్,



దామోదర్, ప్రిన్స్ సింగ్, అరవింద్ కుమార్‌లపై ఛార్జిషీట్ దాఖలు చేశారు.

## పాతబస్తీ పాఠశాలలో బతుకమ్మ వేడుకలు



**విశ్వంభర, హైదరాబాద్:** పాతబస్తీలోని పలు ప్రభుత్వ పాఠశాలలో, ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థినిలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మను తీరొక్క పూలతో అలంకరించి దాండియా నృత్యాలతో, ఆటపాటలతో ముందస్తు బతుకమ్మ వేడుకను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. అనంతరం విద్యార్థిని, విద్యార్థులు ముందస్తు బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రధానంగా జరుపుకునే పండుగ బతుకమ్మ పండుగ అని కొనియాడారు. తెలంగాణ సాంస్కృతి సంప్రదాయాలకు నిదర్శనం బతుకమ్మ సంబరాలు అన్నారు. ఉపాధ్యాయ బృందం. విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కేఎల్ఆర్‌కు కాంగ్రెస్ నేతల ఘన స్వాగతం



**విశ్వంభర, మహేశ్వరం:** అమెరిక టూర్ ముగించుకుని వచ్చిన మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని ఘనంగా సన్మానించారు నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ ఛైర్మన్ సహా సభ్యులు. అనంతరం సమస్యలను కేఎల్ఆర్ దృష్టికి తెచ్చేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు. సమస్యలపై వెంటనే స్పందిన కేఎల్ఆర్ అధికారులు నాయకులతో మాట్లాడి వెంటనే పరిష్కరించారు. సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, బొక్క జంగారెడ్డి సహా అధ్యక్షులు, మైనార్టీ మోర్చా సభ్యులు పాల్గొన్నారు.

## బతుకమ్మ సంబరాలలో మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్



**విశ్వంభర, మహబూబాబాద్:** గాదె రుక్మా రెడ్డి మెమోరియల్ హై స్కూల్ ఆధ్వర్యంలో చేపట్టిన బతుకమ్మ ఉత్సవాల్లో మాజీ మున్సిపల్ ఛైర్ పర్సన్ భూక్యా ఉమా మురళీ నాయక్ పాల్గొన్నారు. తెలంగాణ అస్తిత్వానికి, సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా, ప్రకృతినే దేవతగా పూజించే, స్త్రీలలో ఉన్న ఆధ్యాత్మికమైన శక్తికి ప్రతిరూపకంగా జరుపుకునే బొడ్డెమ్మ, విద్యార్థులతో కలసి ఆమె బతుకమ్మ ఆడారు. స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, పిల్లలు పాల్గొన్నారు

## అందుబాటులో ఇంజనీరింగ్ విద్య



**విశ్వంభర, మహబూబాబాద్:** తెలంగాణ ప్రభుత్వం వచ్చాక మానుకోటలో ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేసి మొదటి సంవత్సరం 99% ఫలితాలు సాధించిన మానుకోట డాక్టర్ బలరాం నాయక్ ప్రిన్సిపాల్ వారి పర్యవేక్షణలో సిఎస్సి, ట్రిబుల్ ఈ, ఈసీఈ అనేక రకాల కోర్సులు ప్రవేశపెట్టి చక్కటి అధ్యాపకులు బోధిస్తూ విద్యార్థులను సన్మార్గంలో నడిపిస్తూ రెండో సంవత్సరం అన్ని గ్రూపులలో విద్యార్థులు అడ్మిషన్ పొంది ఉన్నారు. మంచి విశాలమైన జేఎన్టీయూ కళాశాల జిల్లా వాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉందని ప్రిన్సిపాల్ ప్రసంగించారు. ఈ కళాశాలను మీ పిల్లలకు ఎంతో ఉపయోగకరంగా ఉంది కాబట్టి దీనిని అందరు ఉపయోగించుకొని జేఎన్టీయూకు మంచి పేరు తెస్తారని ఆశిస్తున్నామని అన్నారు.

## మంత్రిపై ట్రోల్ చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

**విశ్వంభర, జయశంకర్ భూపాలపల్లి :** మహాదేవపూర్ మండల కేంద్రంలో బిసి సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పద్మశాలి సంఘం జాతీయ నాయకుడు పంతకానీ శ్రీనివాస్ నేత మంత్రి కొండా సురేఖ పై సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్న వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని మహాదేవపూర్ లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో డిమాండ్ చేశారు. మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రిగా ఉన్న కొండా సురేఖ మెదక్ పర్యటనకు వెళ్లిన సందర్భంలో మెదక్ బిజెపి ఎంపీ రఘునందన్ రావు చేనేత కార్మికుల సమస్యలను తెలియజేస్తూ నూలుతో నేసిన దండను మంత్రి కొండా సురేఖ మెడలో వేసి, చేనేత కార్మికుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా బీ ఆర్ఎస్ కు చెందిన నాయకులు సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేస్తున్నారు. గతంలో కూడా మంత్రి సీతక్క పై అదేవిధంగా హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మిపై అసభ్యంగా ట్రోల్ చేశారు. ఎస్సీ ఎస్టీ వెనుకబడిన తరగతులకు చెందిన మహిళలపై సోషల్ మీడియాలో ఉద్దేశపూర్వకంగా ట్రోలింగ్ చేస్తే సహించేది లేదని మండి పడ్డారు.

## సైబర్ సెక్యూరిటీ బ్యూరో అంతర్రాష్ట్ర ఆపరేషన్

### 27 మంది సైబర్ నేరగాళ్ల అరెస్ట్

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో మొదటిసారి అంతర్ రాష్ట్ర ఆపరే షన్ నిర్వహించిందని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్? వెల్లడించారు. రాజస్థాన్ ముఠా రాష్ట్రంలో భారీగా సైబర్ నేరాలకు పాల్పడిందని తెలిపారు. నిరుద్యోగులు, పేదలు, ప్రభుత్వ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకున్నారని అన్నారు. ఈ ఆపరేషన్‌లో వివిధ రూపా ల్లో ఆర్థిక నేరాలకు పాల్పడిన 27 మంది సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. ఈ సైబర్ కేటుగాళ్ల కోసం 20 రోజుల పాటు నాలుగు బృందాలు గాలించి పట్టుకున్నారని తెలిపారు. **తెలంగాణలో 189 కేసుల్లో రూ.9 కోట్లు కాజేసిన రాజస్థాన్ ముఠా** : నిందితులు తెలంగాణ రాష్ట్రంలో 189, దేశవ్యాప్తంగా 2,223 కేసుల్లో నిందితులుగా ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో నమోదైన 189 కేసుల్లో రూ.9 కోట్లు కాజేశారని తెలిపారు. నిందితులు 29 ఫేక్? అకౌంట్?లు తెరిచి, వాటి ద్వారా రూ.11.01 కోట్ల సైబర్ నేరాలకు పాల్పడ్డారని శిఖా గోయల్ చెప్పారు. అదేవి ధంగా నిందితుల నుంచి 31 సెల్‌ఫోన్లు, 37 సిమ్ కార్డులు, 13 ఏటీఎమ్ కార్డులు, 7 చెక్‌బుక్స్, రెండు హార్డ్?డిస్క్‌లు స్వాధీనం చేసుకున్నామని ఆమె వివరించారు. దక్షిణ ఆసియా దేశాలు సైబర్ నేరాలకు హబ్‌లా మారుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సైబర్ సెక్యూ రిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ హెచ్చరించారు. ఎటువంటి లింక్ క్లిక్ చేయవద్దని, ఏదైనా అను మానం ఉంటే వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. సైబర్ నేరస్తులపై పోలీసుల నిఘా పెరగడంతో సైబర్ నేరగాళ్లు నగరాలు వదిలి గ్రామాల నుంచి ఆపరేట్ చేస్తున్నారని ఆమె తెలిపారు.

## మర్పల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ

**విశ్వంభర, మర్పల్లి:** జిల్లా ఎస్పి కే.నారాయణ రెడ్డి మర్పల్లి పోలీస్ స్టేషన్ ను సందర్శించి స్టేషన్ లోని రికార్డులను క్షుణంగా పరిశీలించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పని తీరును మెరుగుపర్చుకోవాలని తెలియజేసారు. జిల్లా ప్రజలకు సిసి కెమెరాల ఆవస్యకత గురించి అవగాహన కల్పించాలని, సిసి కెమెరాలు నేరస్తులను పట్టుకోవడంలో చాలా ముఖ్యపాత్ర పోషించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు సైబర్ నేరాలపట్ల అవగాహన కల్పించాలని, ప్రజలకు ఆత్మహత్యలు చేసుకోకుండా అవగాహన కార్యక్రమాలు కల్పించాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చిన పిర్యాదుదారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, కమ్యూనిటి పోలిసింగ్, సిసి టీవీల ఉపయోగాలు మొదలగు విషయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఆన్లైన్‌లో ఎలాంటి ఫైల్స్ పెండింగ్ లో పెట్టవద్దనీ,పెండింగ్‌లో ఉన్న ఫైల్స్ వెంటనే పూర్తి చేయాలనీ, డైల్ 100 పైన వచ్చే పిర్యాదుల పట్ల నిర్లక్ష్యం చేయవద్దు అని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ డిఎస్పీ ఎన్ శ్రీనివాస్ రెడ్డి, మోమిన్ పేట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నవీన్ కుమార్, మర్పల్లి ఎస్ హెచ్ ఓ వి సురేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం బాధ్యతగా ఉండాలి



**విశ్వంభర, హైదరాబాద్:** డెవలప్మెంట్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ ది బ్లైండ్ సంస్థ ఆధ్వర్యంలో, కోఠి లోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ IMA కార్యాలయంలో, అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తెలంగాణ జన సమితి TJS అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం గారు హాజరయ్యారు. ప్రొఫెసర్ కోదండరాంని సన్మానించి, ఆత్మీయంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం శుభాకాంక్షలు అని, ప్రస్తుత సమాజంలో ప్రతి వర్గానికి తమదైన హక్కులు ఉంటాయి. ఆ హక్కులను గౌరవించడం మనందరి బాధ్యత. మన రాజ్యాంగం, చట్టాలు ఈ విషయాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయి," అని అన్నారు. అంధుల అభ్యున్నతిని ప్రస్తావిస్తూ, అంధులు అన్ని రంగాల్లో రాణించేందుకు ప్రభుత్వం మరింత సదుపాయాలు కల్పించాలి. వారి సామర్థ్యాలను గుర్తించి, వారికి అవకాశాలు అందించడంలో ప్రభుత్వం బాధ్యతగా ఉండాలి," అని అన్నారు. వయోవృద్ధుల అవసరాలను గుర్తించి, వారి హక్కులను రక్షించడంలో ప్రతీ ఒక్కరు ముందుండాలని పిలుపునిచ్చారు.

## బాలికల పాఠశాలలో బతుకమ్మ వేడుకలు



**విశ్వంభర,ఆమనగల్లు:** ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ముందస్తుగా బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. రంగు రంగుల పూలతో బతుకమ్మలను అందగా పేర్చారు. కౌన్సిలర్ చెక్కల లక్ష్మణ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి బతుకమ్మలను ఆడి పాడారు. అనంతరం ఇటీవలే ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు పొందిన ఉపాధ్యాయులను శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రామలక్ష్మి, మరియు ఉపాధ్యాయుల బృందం, అమ్మ కమిటీ సభ్యులు విజయలక్ష్మి, స్వాతి, పాల్గొన్నారు.

## మున్సిపల్ ఛైర్‌పర్సన్ అత్యవసర సమావేశం



**విశ్వంభర, వికారాబాద్:** రాబోయే దసరా పండుగను పురస్కరించుకొని వికారాబాద్ మున్సిపల్ ఛైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్ ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభంలో వికారాబాద్ పట్టణ అభివృద్ధికి విశేష సేవలు అందించి, వికారాబాద్ పట్టణ ప్రజలందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచి ఇటీవల స్వర్గస్తులైన చీకటి మర్ల విశ్వనాథం ఆత్మకు శాంతి చేకూరాలని కౌన్సిల్ సభ్యులు 2 నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డులలో దసరా ఉత్సవాల ఏర్పాట్లు, అక్కడ చేపట్టే పనులకు సంబంధించిన ఎజెండాను ఛైర్ పర్సన్ గారు కౌన్సిల్ సమావేశంలో ప్రవేశ పెట్టడం జరిగింది. ఇందులో భాగంగా ఆలంపల్లిలో రావణ దహనం ఇతర ఏర్పాట్లు.. గంగారం, కొత్తగడి, అనంతగిరిపల్లి, మద్గుల్ చిట్టెంపల్లి, గుడిపల్లి, దన్నారం, వెంకటాపూర్ తాండ, ఎన్నేపల్లి, రాజీవ్ గృహకల్ప, శివరాం నగర్ మొదలైన కాలనీలలో దసరా ఉత్సవాల ఏర్పాట్లకు కావాల్సిన విధుల ఎజెండాను మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు అందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం వికారాబాద్ మున్సిపల్ లో డిఈగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన డిఈ ప్రశాంత్ గారిని శాలువా, పూలమాలతో సన్మానించారు. అభినందన వీడ్కోలు తెలిపారు. అలాగే కొత్తగా వచ్చిన డిఈ రాకేష్ రెడ్డి గారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జాకీర్ అహ్మద్, వికారాబాద్ మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ చిగుళ్లపల్లి రమేష్ కుమార్, కౌన్సిలర్లు సురేష్, రామస్వామి, కిరణ్ పటేల్, జైదుపల్లి మురళి, కొండేటి కృష్ణ, వేణుగోపాల్ రెడ్డి, రాములు, మహిళా కౌన్సిలర్లు శ్రీదేవి, మొముల స్వాతి, సునీత గౌడ్, ప్రభావతి, దేవి, ఫైమీద బేగం, నస్రీన్, రాజ్యలక్ష్మి, ప్రవళిక, నాయకులు మాలే లక్ష్మణ్ గుప్తా, షరీఫ్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ జయంతికి ఏర్పాట్లు పూర్తి



**విశ్వంభర, కడ్తాల్:** స్వాతంత్ర సమర యోధుడు మోహన్ దాస్ కరంచంద్ గాంధీ 155 వ జయంతి వేడుకలను కడ్తాల మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కడ్తాల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు, డిసిసిబి డైరెక్టర్, ఆమనగల్లు, కడ్తాల సింగల్ విండో ఛైర్మన్ గంప వెంకటేష్ గుప్తా తెలిపారు. మహాత్మా గాంధీ జయంతి వేడుకలను పురస్కరించుకొని పట్టణ నడిబొడ్డులో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి ఉదయం 8:30 నిమిషాలకు పాలాభిషేకం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. భారతదేశానికి స్వాతంత్రం సాధించిన నాయకులలో అగ్రగన్యుడని ప్రజలు అతన్ని మహాత్ముడు అని, జాతిపిత అని ఆయన జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు కడ్తాల ఆర్యవైశ్య సంఘం భారీగా ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి బి. రామకృష్ణ గుప్తా, ఆర్యవైశ్య సంఘం యువజన అధ్యక్షుడు బి. వీరేందర్ గుప్తాలు తెలిపారు.

## రక్తదాతలకు సన్మానం



**విశ్వంభర, ఉయ్యూరు:** అక్టోబర్ 1న జాతీయ స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో యకమూరులో సుధీర్ టింబర్ డిపోలోని కాన్ఫరెన్స్ హాలులో రక్త దాతల అభినందన సత్కార కార్యక్రమం నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ప్రెసిడెంట్ నేరెళ్ల తేజ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లయన్స్ జిల్లా క్యాబినెట్ డిప్యూటీ సెక్రటరి నూకల వెంకట సాంబశివరావు, విశిష్ట అతిథిగా జోన్ ఛైర్ పర్సన్ యం.డి.ఇస్మాయిల్ పాల్గొన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి నెల్లి రాంబాబు, ట్రెజరర్ దినవహి ప్రసాద్, లయన్స్ ప్రతినిధులు నల్లా శ్రీనివాస్, వూర కిశోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛందంగా పలుమార్లు రక్తదానం చేసిన, రక్తదానాన్ని ప్రోత్సహించిన కె.శృతి, పామర్తి వెంకట తరుణ్ కుమార్, శిరిగినీడి నిఖిల్, సంజయ్ లయన్స్ ప్రతినిథులు సత్కరించి తరచు రక్త దానం చేస్తున్నందుకు వారికి అభినందనలు తెలిపారు. ముఖ్య అతిథి నూకల వెంకట సాంబశివరావు మాట్లాడుతు రక్తదాన ప్రచారం పట్ల కొందరి ప్రజలలో ఉన్న భయాన్ని అపోహలను తొలగించడానికి ఈ రోజును స్వచ్ఛంద రక్తదాన దినత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని అన్నారు. స్వచ్ఛంద సంస్థలు అందరి సహకరంతో రక్తదానాన్ని ప్రజా ప్రయోజన ఉద్యమంలా తరచూ నిర్వహించి ఉచిత రక్త పంపిణీ సంస్థలకు సహకారాన్ని అందించాలని సూచించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ప్రెసిడెంట్ నేరెళ్ళ తేజ మాట్లాడుతు స్వచ్ఛంద రక్తదాతల సేవలును ప్రజలకు తెలియచేసి వారిని తమ వంతు ప్రోత్సహించాలని ఈ కార్యక్రమాన్ని ఎర్పాటు చేసినట్టు తెలిపారు. జిల్లా లయన్స్ సంస్థ బ్లడ్ బ్యాంక్ ద్వారా రక్త దాన కార్యక్రమం నిరంతరం కొనసాగుతూనే ఉందని ప్రెసిడెంట్ తేజ తెలిపారు.

## సన్ షైన్‌లో ఘనంగా ఎంగిలిపువ్వు బతుకమ్మ

**విశ్వంభర, చండూర్:** స్థానిక సన్ షైన్ పాఠశాలలో ఎంగిలి పువ్వు బతుకమ్మను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు ఉపాధ్యాయులు అందరూ కలిసి తీరొక్క పువ్వును సేకరించి వాటి గురించి వివరిస్తూ బతుకమ్మను పేర్చి ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, దుర్గాదేవి యొక్క నవ రూపాలను ప్రదర్శిస్తూ అద్భుతమైన నీ నృత్య ప్రదర్శన చేశారు. అదేవిధంగా బతుకమ్మ పాటలతో పాఠశాల డైరెక్టర్ కోడి సుష్మ విద్యార్థినీ విద్యార్థులు ఉపాధ్యాయురాల్లు అందరూ కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కోడి వెంకన్న మాట్లాడుతూ పువ్వుల యొక్క విశిష్టతను తెలియజేస్తూ బతుకమ్మ కార్యక్రమాల ద్వారా పిల్లల్లో తమ తోటి వారితో కలిసిమెలిసి ఉండడం ద్వారా సమాజ స్పృహ పెరుగుతుందని అన్నారు. పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## బతుకమ్మ, దసరా పండుగల ఏర్పాట్లపై మంత్రి సమీక్ష



**విశ్వంభర, హన్మకొండ /వరంగల్:** దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే బతుకమ్మ, దసరా సంబారాలపై వరంగల్ జిల్లా అధికార యంత్రాంగం, బల్దియా నేతృత్వంలో రంగలీల మైదానం, కరీమాబాద్ ప్రాంతంలో చేయాల్సిన ఏర్పాట్ల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి కొండా సురేఖ హాజరై ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారు లకు ఆదేశించారు. ఇట్టి కార్యక్రమం లో నగర మేయర్ గుండు సుధారాణి, నగర పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, జిల్లా కలెక్టర్ డా.సత్య శారద, బల్దియా కమీషనర్ డా. అశ్విని తానాజీ వాకడే, కార్పొరేటర్లు, సంబంధిత శాఖల అధికారులు, దసరా ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా బతుకమ్మ సంబరాలు



**విశ్వంభర, చందూర్:** చండూరు మున్సిపాలిటీ, నాంపల్లి మండల పరిధిలోని గాంధీజీ ఇంగ్లీష్ మీడియం స్కూల్స్ లలో బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ట్రస్మా జిల్లా అధ్యక్షుడు, గాంధీజీ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ ప్రకృతి ఆరాధించే పెద్ద పండుగని, తెలంగాణ రాష్ట్రంలో సంస్కృతి, నాగరికత, సాంప్రదాయాలు ఉట్టిపడేలా జరుపుకునే పూల పండుగే బతుకమ్మని, ప్రపంచ దేశాల్లో ఉండే తెలుగు వారందరూ జరుపుకునే పూల పండుగే బతుకమ్మని, ప్రపంచ దేశాల్లో ఉండే తెలుగు వారందరూ ఈ పండుగను ఘనంగా జరుపుకుంటారని తెలిపారు. పూలు బాగా వికసించే కాలంలో, జలవనురులు సమృద్ధిగా పొంగే వర్షాకాలం చివరలో, శీతాకాలం ప్రారంభంలో ఈ బతుకమ్మ పండుగ వచ్చి భూమితో, జలంతో మానవ అనుబంధాన్ని సంబరంగా జరుపుకోపడుతుందని, రకరకాల పువ్వులు గానుగ పూలు, తంగేడు పూలు, బంతి, చామంతి పూలు, జిల్లేడు పూలు, గడ్డి పూలు కలిపి బ్రతకమ్మను పేర్చి, శిఖరం లేదా సిగ మీద గుమ్మడి పువ్వు ను వుంచి పసుపు, కుంకుమలతో అలంకరిస్తారు. ఈ పూల పండుగ ఎంగిలిపువ్వు బతుకమ్మతో మొదలుపెట్టి సద్దుల బతుకమ్మతో ముగిసిపోతుందని తెలిపారు. తొమ్మిది రోజులపాటు కొనసాగే బతుకమ్మలను బావిలో లేదా నీటి ప్రవాహంలో నిమజ్జనం చేస్తారని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో బతుకమ్మ పాత్ర ఎంతో విశిష్టమైనదని, ఉద్యమ సందర్భాలలో బతుకమ్మతో ఊరేగింపులు చేసిన తెలంగాణ ప్రజలు తమ తమ అస్తిత్వాన్ని సగర్వంగా ప్రకటించుకున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తరుణంలో బతుకమ్మ ఖండాంతరాలు దాటి ప్రాధాన్యత మరింతగా పెరిగిపోయిందని అన్నారు. తదుపరి పాఠశాల ఆవరణలో విద్యార్థులు బతుకమ్మలను పెట్టి, బతుకమ్మ పాటలు పాడి, కోలాటాలు ఆడి, నృత్యాలు చేసి బతుకమ్మ పండుగను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న, కర్నాటి నాగరాజు, ప్రిన్సిపల్స్ సత్యనారాయణ మూర్తి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, పులిపాటి రాధిక, రామేశ్వరి, కందుల కృష్ణయ్య, విజయ కుమారి, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలంగాణ గౌరవ ప్రతీక బతుకమ్మ

**విశ్వంభర, వికారాబాద్:** తెలంగాణ రాష్ట్రం అనగానే మొట్టమొదటిగా అందరికీ గుర్తొచ్చేది బతుకమ్మ, అలాంటి బతుకమ్మ సంబరాలను తెలంగాణ మహిళలు ఎంతో ఘనంగా జరుపు కుంటారని వికారాబాద్ మున్సిపల్ ఛైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్ అన్నారు. వికారాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఆధ్వర్యంలో జరిగిన బతుకమ్మ సంబరాలకు వికారాబాద్ మున్సిపల్ ఛైర్ పర్సన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ఛైర్ పర్సన్ గారు బతుకమ్మ ఆడారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ AAPC ఛైర్మన్ విజయలక్ష్మి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీశైలం, ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్ వీరేశం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా బతుకమ్మ సంబరాలు

**విశ్వంభర, ఎల్బీ నగర్ :** బతుకమ్మ ఉత్సవాలను కొత్తపేట, మోహన్ నగర్ కాకతీయ స్కూల్ లో మంగళవారం విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మలను వివిధ రకాల పూలతో పేర్చి ఉయ్యాల పాటలతో బతుకమ్మ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్కూల్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విదేశీ మోజులో పడి యువత పండగలు, సంప్రదాయాలను మర్చిపోకూడదన్నారు. సంప్రదాయాలను పాటించడం విద్యార్థులు అలవర్చుకోవాలన్నారు. అనంతరం ఉత్త మంగా బతుకమ్మలు పేర్చిన పలువురు విద్యార్థినులు. పిన్సిపల్ బి.సువని రెడ్డి ,స్వప్న,విజయ అధ్యాపకులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ ఛైర్మన్‌లతో కుడా ఛైర్మన్ భేటీ



**విశ్వంభర, హైదరాబాద్:** గాంధీ భవన్‌లో పిసిసి అధ్యక్షు లు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తో కలిసి తెలంగాణ కార్పొరేషన్ ఛైర్మన్‌లతో ఏర్పాటు చేసిన సమావేశంలో కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశంలో వివిధ కార్పొరేషన్ల ద్వారా ప్రజలకు చేయాల్సిన సేవలు, ముఖ్యమైన కార్యక్రమాలు వంటి అంశాలపై మహేష్ కుమార్ గౌడ్ దిశానిర్దేశం చేశారు.

# హైదరాబాద్‌లో కూల్చివేత చర్యలను ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలి

■ సుందరీకరణ పేరుతో పేదల కడుపు కొడతారా

■ బాధితులకు అండగా ఉంటాం: బీజేపీ ఎంపీ లక్ష్మణ్



**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ ప్రజలు కాంగ్రెస్?కు అండగా లేరనే అక్కసుతోనే హైడ్రా పేరుతో కూల్చివేతలు చేస్తున్నారని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలోనే ఇండ్లకు అనుమతులు ఇచ్చి, ఇప్పుడు కూల్చడం సరికాదన్నారు. మూసీ ప్రాంతంలో పట్టాలు ఇచ్చిన వారే ఆక్రమణ అనడం సరికాదన్నారు. సురక్షితంగా ఉన్న ప్రాంతాల్లో కూల్చివేతలు చేయాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. సుందరీకరణ పేరుతో పేదల కడుపు కొడతారా? అని ప్రశ్నించారు. కూల్చివేత చర్యలను ప్రభుత్వం వెంటనే ఆపేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ బాధిత ప్రజల పక్షాన అండగా నిలబడుతుందని హామీ ఇచ్చారు. మూసీ సుందరీకరణకు తాము వ్యతిరేకం కాదని, కానీ దాని పేరుతో ఢిల్లీకి కప్పం కట్టే ప్రయత్నం జరుగుతోందన్నారు. **ఆరు గ్యారెంటీలంటూ మోసం :** ఎన్నికలు అనగానే ప్రజలకు కాంగ్రెస్ అరచేతిలో వైకుంఠం చూపిస్తుందని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ విమర్శించారు. ఆరు గ్యారెంటీలంటూ ప్రజలను కాంగ్రెస్ మోసం చేస్తుందని అన్నారు. అడ్డగోలుగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక మొండిచేయి చూపించడం కాంగ్రెస్‌కు కొత్తకాదని విమర్శించారు. హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణలో ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రజల దృష్టి మరల్చే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. రైతు బంధు సహా అన్నీ బంద్ : తెలంగాణలో 6 గ్యారెంటీలు ప్రకటించి అమలు చేయలేక హైడ్రా పేరుతో ప్రజల దృష్టి మరలుస్తున్నారన్నారు. హరియాణా ప్రజలు కాంగ్రెస్ హామీల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవినీతి, కుటుంబ పాలన, బంధు ప్రీతి, రాష్ట్రాన్ని, దేశాన్ని విచ్ఛిన్నం చేసే శక్తులకు కాంగ్రెస్ గ్యారెంటీ అని విమర్శించారు. తెలంగాణ ప్రజలు పడుతున్న ఇబ్బందులు హరియాణా ప్రజలు పడొద్దని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో రైతు బంధు సహా అన్నీ బంద్ చేశారని తెలిపారు. తెలంగాణను మాజీ సీఎం కేసీఆర్ అప్పుల కుప్పగా మారిస్తే, దాన్ని పట్టుకొని రేవంత్ ఢిల్లీ పర్యటనలు చేస్తున్నారని పేర్కొన్నారు. రుణమాఫీ 50 శాతం కూడా చేయలేకపోయారన్నారు. ఏకకాలంలో రుణమాఫీ చేశామని కాంగ్రెస్ ఎంపీ స్వయంగా పార్లమెంట్?లో చెప్పి తప్పుదోవ పట్టించారన్నారు. తొలి కేబినెట్ సమావేశంలోనే ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని రాహుల్ గాంధీ నమ్మపలికి ఇప్పుడు మోసం చేశారన్నారు. రాహుల్ గాంధీ అబద్దాలు చెప్పారా? లేక రాహుల్ గాంధీ మాటలు రేవంత్ పట్టించుకోవడం లేదో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ఇంకా ప్రతిపక్ష నాయకుడిగా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. హరియాణాలో కాంగ్రెస్ 7 హామీలు ఇచ్చారని, కాంగ్రెస్?కు అక్కడి ప్రజలు బుద్ధి చెప్తారన్నారు. 9 నెలల్లోనే తెలంగాణలో రేవంత్ సర్కారుపై వ్యతిరేకత మొదలైందన్నారు.

## ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలి

**విశ్వంభర, చివ్వేంల:** మండల కేంద్రంలో మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం, ఐటిసి ఎంఎస్ కే -గ్రీన్ కాస్ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన స్వచ్ఛ హి సేవ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి చక్రాల సంతోష్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఇల్లు ప్రతి వాడ, ప్రతి గ్రామం పరిశుభ్రంగా ఉన్నప్పుడే మన అందరి భవిష్యత్తు కూడా ఉజ్వలంగా ఉంటుందని ఎక్కడైతే పరిశుభ్రత ఉంటుందో అక్కడ దైవం కొలవై ఉంటుందని భావించి అందరూ పరిశుభ్రతకు పూనుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐటిసి-గ్రీన్ క్రాస్ సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ తండు నాగరాజు, ఎంపిఓ దయాకర్, ఏపీఓ నాగయ్య హెల్త్ డిపార్ట్మెంట్ నుండి విజయ సారధి, పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది ,ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు ,మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామపంచాయతీ ప్రతినిధులు ,గ్రీన్ క్రాస్ సంస్థ మండల కోఆర్డినేటర్ భూక్య వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## బ్రిలియంట్ స్కూల్ విద్యార్థులకు బహుమతులు

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలోని బ్రిలియంట్ స్కూల్ లోని చిన్న పిల్లలకు సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, మండల గౌరవ అధ్యక్షులు డాక్టర్ బి ఎల్ నారాయణ గౌడ్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బి ఎల్ నారాయణ గౌడ్ మాట్లాడుతూ బ్రిలియంట్ స్కూల్ ఉపాధ్యాయులకి, విద్యార్థులకు బతుకమ్మ , దసరా పండగ శుభాకాంక్షలు తెలిపారు . దేవతామూర్తుల వేషధారణలో ఉన్న పిల్లలందరిని సన్మానించి బహుమతులు అందజేశారు . బ్రిలియంట్ స్కూల్ కరస్పాండెంట్ పావని కొటేశ్వరి మాట్లాడుతూ మా బ్రిలియంట్ స్కూల్ పిల్లలను ఎంతో ఆప్యాయంగా సన్మానించి బహుమతులు అందజేసిన డాక్టర్ బి ఎల్ నారాయణ గౌడ్‌కి కృతజ్ఞతలు తెలిపారుల. ఈ కార్యక్రమంలో బ్రిలియంట్ స్కూల్ ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన



**విశ్వంభర, పెద్ద శంకరంపేట :** తమ విధుల ను సక్రమంగా నిర్వహించినప్పటికీ ఉన్నతాధికారులు విధులు సక్రమంగా నిర్వర్తించడం లేదని పేర్కొనడం బాధాకరమైన రాష్ట్ర వ్యవసాయ విస్తీర్ణ అధికారుల సంఘం పిలుపు మేరకు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. రాష్ట్ర డిజిటల్ క్రాప్ సర్వే యాప్ విధానం లో ఉన్న సమస్యల గురించి గత వారం రోజులుగ ఏఈఓ లు తెలియ చేసిన సమస్యలను రాష్ట్ర ఉన్నత అధికారులు పరిష్కరించక పోవడం వలన జిల్లా లో పని చేస్తున్న 76 మంది వ్యవసాయ విస్తరణ అధికారులను 27,28,30 తేది ల్లో మా విధులు మేము సక్రమంగా నిర్వహించిన కూడా రాష్ట్ర ఉన్నత అధికారులు మమల్ని కేవలం ఈ డీఎస్సీ యాప్. ఇన్స్టాల్ చేయనందుకు మొత్తం మేము విధుల కి హాజరు కానట్టు గా పరిగణించిన సందర్భంగా రాష్ట్ర జేఏసీ (వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం) పిలుపు మేరకు అన్ని జిల్లాల్లో ప్రతి మండల కేంద్రం ఉన్న రైతు వేదికల్లో జరిగే విడియో కాన్ఫరెన్స్ లో ప్రతి ఏఈఓకూడా నల్ల బ్యాడ్జి లతో హాజరు అయ్యి నిరసన తెలియ చేశారు.

## బ్రేక్ ఫెయిల్ అయ్యి గోడను ఢీ కొట్టిన స్కూల్ బస్సు



**విశ్వంభర, నల్గొండ:** మిర్యాలగూడ మండలం అవంతిపురం గ్రామం నందు సిటీ సెంట్రల్ స్కూల్ బస్సు బ్రేక్ ఫెయిల్ అయ్యి అదుపుతప్పి గోడను ఢీకొట్టడం వల్ల బస్సులోని కొందరు విద్యార్థులు గాయపడిన ఘటన చోటుచేసుకుంది. ప్రవేట్ స్కూల్ విద్యార్థులు దేవాలయాన్ని దర్శించుకుని తిరిగి వస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. వెనువెంటనే బస్‌లో గాయపడిన విద్యార్థులను మిర్యాలగూడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటన తెలుసుకున్న మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి- హుటా హుటిన హాస్పిటల్‌కు చేరుకొని విద్యార్థుల ను పరామర్శించి, వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## జిల్లా స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక



**విశ్వంభర,తలకొండపల్లి:** కడ్తాల్ మండల కేంద్రం లోని ఉన్నత పాఠశాలలో 68వ ఎస్జిఎఫ్ఐ క్రికెట్ సెలక్షన్ లో వెల్జాల్ పాఠశాల నుండి 8 మంది క్రీడాకారులు పాల్గొనగా అందులో నుండి అండర్ 14 విభాగంలో బి. కార్తిక్, టి.శివశంకర్‌లు జిల్లా జట్టుకు ఎంపికయ్యారని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ పరమేష్ తెలిపారు. వీరు హైదరాబాద్‌లో రేపటినుండి జరిగే జిల్లా స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొననున్నారు. ఎంపికైన క్రీడాకారులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు నసీమ, ఉపా ధ్యాయులు గ్రామ పెద్దలు యువకులు కలిసి అభినందించారు.



తార్నాక, శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ ప్రశాంతి, ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా విద్యార్థులు బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి, డీన్ మహిపాల్ రెడ్డి, ప్రైమరీ ఇంచార్జ్ రాచల్, ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ సారిక, మరియు స్కూల్ యాజమాన్యం విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విశ్వంభర, సికింద్రాబాద్.

## కబ్జాలవల్లే చిన్నవర్షాలకు డ్రైనేజీలు పొంగుతున్నాయి

**విశ్వంభర, హైదరాబాద్:** ప్రపంచస్థాయిలో అభివృద్ధి చెందుతున్ననగరం మన హైదరాబాద్. ఈ మహానగరాన్ని గతంలో సమైఖ్య పాలకులు, తెలంగాణ రాష్ట్రం ఎర్పడ్డకా బిఆర్ యస్ పాలనలో ఆ పార్టీ నాయకు లు, వారి మద్దతు దారుల ఆక్రమణలకు అంతే లేకుండ పోయిందని తెలంగాణ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. అది చెరువులు, కుంటలు, వాగులు, వంకలు అక్రమంగా బఫర్ జోన్‌లు, ఫుల్ ట్యాంక్ లెవల్‌లు ఆక్రమించి బడాబాబులు కట్టుకున్న ఫామ్ హౌజ్‌లు, గెస్ట్ హౌస్‌లు, పెద్ద పెద్ద మాల్స్, రాజభవనాలను మించిన బిల్డింగ్‌లలు బీఆ ర్.ఎస్ నేతలు, వారి అనుచరులు కబ్జ పెట్టడంవల్ల చిన్న వర్షానికే నగరంలో డ్రైనేజీలు పొంగుతున్నయి.

## స్కూల్ గేమ్స్ ఫెడరేషన్




**విశ్వంభర, షాద్‌నగర్:** జోన్ స్థాయి టోర్నమెంట్లో రంగారెడ్డి జిల్లా తరఫున పరుగు పందెం పోటీలలో అండర్ 17-100 మీటర్స్ లో తొమ్మిదవ తరగతికి చెందిన దేవి ప్రియ మొదటి స్థానంలో గెలుపొందింది. అలాగే అండర్ 17- ఖో,ఖోలో 8వ తరగతికి చెందిన శ్రావ్య మొదటి స్థానంలో గెలుపొందింది. అండర్ 14 ఖో,ఖో బాలుర విభాగంలో లక్ష్మీకాంత్ మొదటి స్థానంలో, అండర్ 14 ఖో,ఖో బాలికల విభాగంలో ఏడవ తరగతికి చెందిన తన్వి మొదటి స్థానంలో గెలుపొందారు. గెలిచినా విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు. ఢిల్లీ వరల్డ్ స్కూల్ విద్యారంగంలో మాత్రమే కాకుండా వివిధ రకముల సాంస్కృతిక కార్యకలాపాలలో కూడా విద్యార్థులను ప్రోత్సహిస్తుందని అన్నారు.

## ముందే ప్రారంభమైన బతుకమ్మ సంబరాలు

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం కొరటికల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకునే విద్యార్థులు, మండల కేంద్రంలోని సరస్వతీ విద్యాలయం విద్యార్థులు మంగళవారం రోజున ఎంగిలి పూలబతుకమ్మ పర్వదినం సందర్భంగా విద్యార్థులు బతుకమ్మను పేర్చుకొని డప్పు చప్పుళ్లతో స్వాగతించి పాటలతో ఆటలు ఆడారు. జడ్పీహెచ్ఛ్ ప్రధానోపాధ్యాయులు డి.వెంకన్న, అనురాధ విద్యార్థులు సరస్వతీ విద్యాలయం ప్రధానోపా ధ్యాయులు నర్సయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడా పోటీలలో పాల్గొనాలి

**విశ్వంభర, హనుమకొండ :** భీమారంలో గల జగతి గార్డెన్‌లో అరుణోదయ జూనియర్ కళాశాల కాలేజీ ఫెస్ట్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్, రుక్మాధర్ రెడ్డి మాట్లాడుతూ, గత సంవత్సర ఇంటర్మీడియట్ ఫలితాలలో స్టేట్( 468/470)ఫస్ట్ ర్యాంకు సాధించిన గుగులోత్ జస్వంత్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ, ఆ విద్యార్థిని ఆదర్శంగా తీసుకొని మొదటి సంవత్సరం విద్యార్థులు అదేవిధంగా ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత పొందాలని, విద్యార్థులకు చదువుతోపాటు మానసిక ఉల్లాసం కలిగించే క్రీడలలో పాల్గొనాలని, శారీరికంగా దృఢ నిశ్చయంతో ఉండాలని వివరించారు.



**విశ్వంభర, సిరిసిల్ల:** సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ, చేనేత పరిశ్రమ, పవర్లూమ్స్ కార్మిక అనుబంధ సంఘాల సన్నాహక సమావేశంలో అఖిలభారత పద్మశాలి అన్నదాన సత్రం యాదగిరిగుట్ట అధ్యక్షులు కత్తుల సుదర్శన్ రావు, ప్రధాన కార్యదర్శి చిక్కా దేవదాసు పాల్గొన్నారు. పద్మశాలి సంఘాల నాయకులు ఇరువురిని సన్మానించారు.

## అంకిత సంస్థ సేవలు అభినందనీయం

### వికారాబాద్ టౌన్ సీఐ నాగరాజు



**విశ్వంభర, వికారాబాద్:** అంకిత స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని, విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని వికారాబాద్ పట్టణ సిఐ నాగరాజు అన్నారు. వికారాబాద్ మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో అంకిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు కిట్స్ ( బ్యాగులు, మ్యాట్లు, చెప్పులు) పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... విద్యార్థి పాఠశాల దశలోనే క్రమశిక్ష నేర్చుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు కష్టపడి మిమల్ని చదివిస్తున్నారని, మీరు ఉన్నతంగా చదివి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, గ్రామానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. విద్యార్థి దశ నుండే లక్ష్యం ఎంచుకుని చదువుకోవాలని సూచించారు. పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అంకిత సంస్థ బ్యాగులు, మ్యాట్ లు, చెప్పులు, పంపిణి చేయడం సంతోషకరమని అన్నారు. ఈ సందర్భంగా అంకిత సంస్థ ను అభినందించారు. సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ ప్రకాష్ కుమార్, కో ఆప్షన్ సభ్యులు జాఫర్, మాజీ సర్పంచ్ సుభాన్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాండు రంగయ్య, సంస్థ ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాస్, కో ఆర్డినేటర్ సంజీవ్ రావు, గ్రామ పెద్దలు పెంటయ్య, రామేశ్వర్, రవీందర్, హైమద్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

## వంతెన కష్టాలు.. ఇంకెన్నాళ్లు?



**విశ్వంభర, మూసాపేట:** ప్రభుత్వము గ్రామీణ ప్రాంతాలలోని రైతులు, విద్యార్థుల రాకపోకల కోసం లక్షలాది రూపాయల నిధులు హెచ్చించి కల్వర్టులపై వంతెన నిర్మాణాల కోసం పనుల సకాలంలో కాలేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూసాపేట మండలం జానంపేట గ్రామపంచాయతీ పరిధిలోని తాళ్లగడ్డ గ్రామానికి వెళ్లడానికి గంగారం గుట్ట సమీపంలో కాల్వ దాటాలంటే వంతెన ఎంతో అవసరం ఇందుకుగాను ప్రభుత్వ నిధులు కేటాయించి వంతెన నిర్మాణం చేపట్టిన నెలల తరబడి పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. ఈ ఏడాది వర్షాకాలము జూలై మాసంలో విపరీతమైన వర్షాలు కురిసే వరదలు రావడంతో పాఠశాల విద్యార్థుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నాలుగైదు రోజులు విద్యార్థులు బడులకు రాకుండా ఉండిపోయారు.. కాల్వ దాటాలంటే వంతెన నిర్మాణం ఉండాల్సిందే గుత్తేదారు సకాలంలో స్పందిస్తేనే అసంపూర్తి వంతెన నిర్మాణ పనులు సకాలంలో చేయాల్సి ఉంది. ఈ విషయంలో సంబంధిత పంచాయతీరాజ్ శాఖ అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## దసరా పండగకు ఊరెళ్తున్నారా.. జరభద్రం

### సంగారెడ్డి జిల్లా పోలీసు శాఖ హెచ్చరిక




**విశ్వంభర, సంగారెడ్డి :** దసరా పండుగ పురస్కరించుకొని స్కూల్స్, కళాశాలలకు సెలవులు రావడంతో చాలా వరకు తమ సొంత గ్రామాలకు కాని, ఇతర ప్రాంతాలకు గాని ప్రయాణాలు చేస్తూంటారు. ఇదే అదనుగా దొంగలు చేతివాటం ప్రదర్శిస్తారని, ఊళ్లకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ రూపేష్ సూచించారు. దసరా పండుగ వేల దొంగతనాల నియంత్రణకు జిల్లా ప్రజలకు ఎస్పీ పలు సూచనలు చేశారు. ఇంట్లో బంగారు నగలు, నగదు ఉంటే వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవడం క్షేమం.ఊరు వెళ్తున్నప్పుడు పక్కింటి వారికి ఇంటి పరిసరాలను గమనించమని చెప్పాలి. ద్విచక్రవాహనాలు, కారులను ఇంటి ఆవరణలోనే పార్కింగ్ చేయాలి, రోడ్లపై నిలుపరాదు. ఊళ్ళకు వెళ్లే వారు ఇంటి లోపల, ఇంటి బయట ఒక లైటు వేసి ఉంచాలి. విలువైన వస్తువుల సమాచారాన్ని, వ్యక్తిగత ఆర్థిక విషయాలను ఇతరులకు చెప్పకూడదు.ఆరుబయట వాహనాలకు హ్యాండిల్ లాక్ తో పాటు వీల్ లాక్ వేయాలి. ఇంటికి సెంట్రల్ లాకింగ్ సిస్టం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం మంచిది.అనుమానాస్పదంగా తమ వీధుల్లో తిరిగే కొత్త వ్యక్తుల కదలికలపై 100 డయల్ కు గాని సంబందిత పోలీస్ అధికారులకు గాని సమాచారం ఇవ్వాలి. ప్రయాణాలలో రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ, జాగ్రతగా వాహనాలను నడుపుతూ క్షేమంగా గమ్య స్థానాలకు చేరుకొని, సంతోషకర వాతావరణంలో పండుగలను జరుపుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు.

## కల్వకుర్తి పోలీస్ స్టేషన్‌లో ప్రేమ వివాహం



**విశ్వంభర, కల్వకుర్తి :** కల్వకుర్తి పట్టణంలోని రమ్య హాస్పిటల్ లో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులు ఇస్లావత్ తిరుపతి, గుమ్మకొండ శిరీష గత మూడు సంవత్సరాలు ప్రేమించుకు న్నారు. అమ్మాయి ప్రేమను అబ్బాయి నిరాకరించడంతో గుమ్మకొండ శిరీష కల్వకుర్తి పోలీస్ స్టేషన్‌లో ఇస్లావత్ తిరుపతి మీద కంప్లైంట్ చేసింది. అమ్మాయికి న్యాయం జరిగే విధంగా కల్వకుర్తి సిఐ నాగార్జున, కల్వకుర్తి ఎస్ ఐ మాధవ రెడ్డి అబ్బాయిని, అమ్మాయి తరపు కుటుంబ సభ్యులను పెద్దలను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి ఏమైనా సమస్యలు ఉంటే పోలీస్ స్టేషన్‌ని ఆశ్రయించవచ్చు అని నచ్చజెప్పి పెద్దల సమక్షంలో ఏక నిర్ణయం తీసుకొచ్చి కుల పెద్దల సమక్షంలో వివాహం జరిపించారు. సీ.ఐ నాగార్జున సాగర్, ఎస్ఐ మాధవ రెడ్డికి ఇరు ఫ్యామిలీలు పెద్దలు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు.

## గుర్రం మల్లేష్‌కి భారతీయ స్ఫూర్తి సేవా రత్న

**విశ్వంభర,ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం పల్లెర్ల గ్రామానికి చెందిన సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం మండల ప్రచార కార్యదర్శి, తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా ఉపాధ్య క్షులు, ఉత్తమ జర్నలిస్ట్ అవార్డ్ గ్రహీత గుర్రం మల్లేష్‌కి హైదరాబాద్ కింగ్ కోటి తిలక్ రోడ్ బొగ్గుల కుంటలోని తెలంగాణ సరస్వత పరిషత్ ఆడిటోరియంలో ఆసియన్ వేదిక్ ఇంటర్నేషనల్ కల్చర్ అండ్ రీసెర్చ్ స్ఫూర్తి అకాడమీ, స్ఫూర్తి ఇంటర్నేషనల్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్, పీస్ ఆఫ్ ఇండియా ఎన్జీవో, స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా ఎన్జీవో, ఆసియా వేదిక్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ లయన్ ఆకుల రమేష్ చేతుల మీదుగా భారతీయ స్ఫూర్తి సేవా రత్న నేషనల్ అవార్డ్‌ని అందుకున్నారు.

## వృద్ధులైన తల్లిదండ్రుల సంరక్షణ భాధ్యత వారి కుమారులదే

### కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

### ఘనంగా అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం



**విశ్వంభర, సూర్యాపేట:** వృద్ధులైన తల్లిదండ్రుల సంరక్షణ భాధ్యత వారి కుమారులదేనని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం సందర్భంగా సూర్యాపేట జిల్లా మహిళ, శిశు వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులైన తల్లి దండ్రుల సంరక్షణ భాధ్యతను వారి కుమారులు చేపట్టాలని అన్నారు. ప్రతి వారం జరిగే ప్రజావాణి కార్యక్రమంలో ఎక్కువగా తమ కుమారులు తమను పట్టించుకోకుండా వదిలి వేసారని తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తున్నారని అన్నారు. చట్టపరమైన చర్యలు తీసుకోవడం ద్వారా తాము వృద్ధులకు న్యాయం చేయగలమని అన్నారు. బ్యాంకులలో వయో వృద్ధులకు ప్రత్యేక సేవలు అందించాలని ఈ సందర్భంగా పలువురు తెలియజేశారు. పోలీసు స్టేషనులో తమకు న్యాయం చేయాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీలత మాట్లాడుతూ వృద్ధులైన తల్లిదండ్రులు తమ ఆస్తిని పిల్లల పేరున వ్రాయ వద్దని తెలిపారు పిల్లలందరిని సమానంగా చూడాలని, కొడుకు, కూతురు మద్య ఎటువంటి వ్యత్యాసం లేకుండా తల్లిదండ్రులు చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వయో వృద్ధులను జిల్లా కలెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిడబ్ల్యూవొ నర్సింహరావు, సూర్యాపేట డిఎస్పి రవి, డిఎంహెచ్ వొ డాక్టర్ కోటచలం, ఆర్డివొ వేణుమాధవ్, జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల నుండి వచ్చిన వయో వృద్ధుల సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ప్రతి కుటుంబానికి డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డు

- పైలట్ ప్రాజెక్టు పర్యవేక్షణకు ఆర్డీవో స్థాయి ప్రత్యేక అధికారులు
- దసరా లోపు లబ్దిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు
- సన్న, దొడ్డు రకాల ధాన్యం కొనుగోలుకు వేరువేరుగా కేంద్రాలు
- యుద్ధ ప్రతిపాదికన వరద ప్రాంతాలలో మరమత్తులు చేపట్టాలి
- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో : పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్:** పేద, మధ్య, ధనిక వర్గాలు, కుటుంబాలు అనే తేడా లేకుండా తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ప్రతి కుటుంబం హెల్త్ ప్రొఫైల్ రూపొందించి, యూనిక్ నెంబర్ తో స్మార్ట్ కార్డు ఇవ్వడమే ఫ్యామిలీ కార్డు ప్రధాన ఉద్దేశ్యమని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వీలైనంత మేరకు వారికి మేలు చేయాలన్న సంకల్పంతోనే ఫ్యామిలీ డిజిటల్ కార్డును తీసుకొస్తున్నామని వెల్లడించారు. అత్యంత ప్రాముఖ్యత కలిగిన ఈ కార్డులో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా, వాస్తవానికి దగ్గరగా జాగ్రత్తగా కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర సచివాలయం లో మంగళవారం చీఫ్ సెక్రెటరీ శాంతి కుమారి తో కలిసి ఫ్యామిలీ డిజిటల్ కార్డు, అర్బన్ డెవలప్మెంట్ అథారిటి (యూడిఏ), ఎల్ఆర్ఎస్, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ధాన్యం కొనుగోళ్ళు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ల తో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ఫ్యామిలి డిజిటల్ కార్డుల జారీకి సంబంధించి 119 నియోజకవర్గాలలోని 238 ప్రాంతాలలో పైలట్ ప్రాజెక్టు నిర్వహిస్తున్నామని ఇప్పటికే ఈ ప్రాంతాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. నియోజక వర్గంలో ఒక పట్టణ, ఒక గ్రామీణ ప్రాంతాన్ని ఎంచుకోవాలని, ఒకవేళ పూర్తిగా పట్టణ / నగర నియోజకవర్గాలైతే రెండు వార్డులు / డివిజన్లు ఎంచుకోవాలని సూచించారు. ఈ నెల మూడవ తేదీ నుంచి ఏడవ తేదీ వరకు ఎంపిక చేసిన ప్రాంతాలలో క్షేత్ర స్థాయిలో (డోర్-టు-డోర్) వివరాలను పకడ్బందీగా సేకరించాలని సూచించారు. ఈ మొత్తం ప్రక్రియను పర్యవేక్షించేందుకు గాను ప్రతి నియోజకవర్గానికి ఆర్డీవో స్థాయి, జోనల్ కమిషనర్ స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమిస్తున్నట్లు ప్రకటించారు. అలాగే మండలానికి ఒక తహశీల్దారును కూడా నియమిస్తున్నట్లు వెల్లడించారు. కుటుంబ సభ్యుల వివరాల నమోదు, మార్పులు చేర్పుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హెల్త్ కార్డుల విధానం, అమలు వాటి ఫలితాలపై తెలంగాణ అధికారుల బృందం మహారాష్ట్ర, రాజస్థాన్, ఉత్తర్ ప్రదేశ్, కర్ణాటక, హర్యానా రాష్ట్రాలలో పర్యటించి ముఖ్యమంత్రితో పాటు క్యాబినెట్ సబ్-కమిటీకి నివేదిక అందజేసిందని తెలిపారు. ముఖ్యమంత్రి దీనిపై సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగిందని దానికి అనుగుణంగానే పైలట్ ప్రాజెక్టు నిర్వహిస్తున్నామని ఈ నెల మూడవ తేదీన ఈ పైలట్ ప్రాజెక్టు ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని వెల్లడించారు. ఈ పైలట్ ప్రాజెక్టులో ఎదురయ్యే మంచి చెడులను, పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర వ్యాప్తంగా అమలు అంశాన్ని పరిశీలిస్తామన్నారు.

**ఎల్ఆర్ఎస్ :** గత నాలుగు సంవత్సరాలనుంచి లక్షలాది మంది ఎల్ఆర్ఎస్ కోసం ఎదురు చూస్తున్నారని, ఏ మాత్రం ఆలస్యం చేయకుండా యుద్ధ ప్రతిపాదికన దరఖాస్తులను పరిష్కరించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియ ప్రభుత్వం ఆశించిన స్థాయిలో జరగడం లేదని, కొన్ని జిల్లాల్లో వేల సంఖ్యలో దరఖాస్తులు ఉంటే పదుల సంఖ్యలో పరిష్కరించడం పట్ల మంత్రిగారు అసంతృప్తి వ్యక్తం చేశారు.

**అర్బన్ డెవలప్మెంట్ అథారిటి (యూడిఏ):** అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (యూడిఏ)ల పరిధి పెంపు, కొత్త యూడిఏల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను తక్షణమే కలెక్టర్లు పంపించాలని ఆదేశించారు.

**డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు:** గత ప్రభుత్వం ఎంతో గొప్పగా ఆర్భాటంగా ప్రకటించి అరకొరగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించిందని, ఇందులో కొన్ని మాత్రమే పూర్తి అయ్యాయని, ఈ పూర్తి అయిన ఇండ్లకు లబ్దిదారులను ఎంపిక చేసి దసరా లోపు వారికి అప్పగించాలని కలెక్టర్లకు ఆదేశించారు. ఇందుకోసం జిల్లా ఇన్-చార్జ్ మంత్రి ఛైర్మన్ గా, జిల్లా కలెక్టర్ కన్వీనర్ గా మరికొంతమంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు.

**వరద సహాయం :** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రాష్ట్ర ప్రభుత్వం 29 జిల్లాలకు, ఒక్కో జిల్లాకు మూడు కోట్ల రూపాయల చొప్పున, ఖమ్మం, సూర్యపేట, కొత్తగూడెం, మహబూబాబాద్ నాలుగు జిల్లాలకు ఒక్కో జిల్లాకు ఐదు కోట్ల రూపాయల చొప్పున, మున్సిపాలిటీలకు కోటి రూపాయలు, కార్పొరేషన్లకు రెండు కోట్ల రూపాయల చొప్పున కేటాయించడం జరిగిందని, వరదలకు దెబ్బతిన్న ప్రాంతాలను గుర్తించి తక్షణమే మరమత్తులు చేపట్టాలని కలెక్టర్లకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రైమరీ హెల్త్ సెంటర్లు, అంగన్ వాడీ కేంద్రాలకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి మరమత్తులు చేపట్టాలన్నారు.

**ధాన్యం కొనుగోలు :** తమ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ 35 సన్న రకాల ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఈ ఖరీఫ్ సీజన్ నుంచే అందిస్తున్నామని మంత్రిగారు వెల్లడించారు. ధాన్యం కొనుగోలు కోసం రాష్ట్ర వ్యాప్తంగా 7144 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, సన్న ధాన్యానికి దొడ్డు ధాన్యానికి వేరువేరుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 50 లక్షల మెట్రిక్ టన్నుల వరకు సన్నరకాలు 30 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యం వస్తుందని అంచనా వేస్తూ దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. రైతాంగానికి ఏ చిన్న సమస్య కూడా రాకుండా కొనుగోళ్లను ప్రక్రియను కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఐటిల పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, పౌర సరఫరాల శాఖ ముఖ్య కార్యదర్శి డీ.ఎస్. చౌహాన్, పంచాయత్ రాజ్ కార్యదర్శి లోకేశ్ కుమార్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, హౌసింగ్ కార్యదర్శి గౌతమ్ పాల్గొన్నారు.

## అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు



**విశ్వంభర, రంగారెడ్డి :** అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు వచ్చే విధంగా టీయుడబ్ల్యూజే(ఐ జెయు) కృషి చేయడం జరుగుతుందని రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి కే భాస్కర్ పేర్కొన్నారు. మంగళవారం షాద్ నగర్‌లో టియుడబ్ల్యూజే రంగారెడ్డి సహాయ కార్యదర్శి భాస్కర్, షాద్ నగర్ డివిజన్ అధ్యక్షుడు ధన్నారం రమేష్ ఆధ్వర్యంలో వర్కింగ్ జర్నలిస్టుల సమావేశం నిర్వహించారు. జర్నలిస్టు ఇంటి స్థలాల దరఖాస్తు పత్రాలను ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం గత కొన్ని సంవత్సరాలుగా యూనియన్ అనేక పోరాటాలు చేసిందని అన్నారు. ప్రస్తుతం ఇండ్ల స్థలాల కోసం చేపడుతున్నటువంటి విలేకరుల వివరాల సేకరణ అనంతరం నియోజకవర్గాల వారీగా లిస్టులను తయారు చేసి మీడియా అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీకి అందజేస్తామని స్పష్టం చేశారు. జర్నలిస్టులు ఫెరోస్, శివకుమార్, శ్రీశైలం, శ్రీనివాస్, విష్ణు, ఇలియాస్, రాకేష్, మల్లికార్జున్, సాయి, శ్రీకృష్ణ, శ్రీహరి, అల్వాల దర్శన్, నరేందర్, సవాళ్ల రాజు బస్వం అప్ప, శ్రావణ్ గౌడ్, సమీ, సాబీర్, పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్‌కు మెట్రో సేవలు విస్తరించాలి



**విశ్వభర, కుత్బుల్లాపూర్:** నియోజకవర్గంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ మహానగరానికి మణిహారంగా మహానగర ప్రజలకు తన సేవలను అందిస్తున్న హైదరాబాద్ మెట్రో రైల్ (హెచ్ఎంఆర్) ఫేజ్ -2 లో కుత్బుల్లాపూర్ కు మెట్రో సేవలను విస్తరించాలని కోరుతూ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ బేగంపేట్ లోని హైదరాబాద్ మెట్రో రైల్ భవన్ లో మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిత్యం ఎంతోమంది ప్రయాణికులను వారి గమ్య స్థానాలకు చేర్చుతూ దేశంలోనే మూడవ అతిపెద్ద మెట్రో రైల్ సంస్థగా నిలిచిన హైదరాబాద్ మెట్రో రైల్‌ను విస్తరించాలని హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణలో భాగంగా కుత్బుల్లాపూర్‌కు మెట్రో రైల్ విస్తరణ ను చేపట్టి ప్రజలు సుదూర ప్రాంతాలకు వేగంగా చేరుకునేలా చూడాలని వినతి పత్రంలో కోరారు.

## కూకట్‌పల్లిలో హైడ్రా దృష్టి సారించాలి

**విశ్వంభర, కూకట్పల్లి :** కూకట్‌పల్లిలో పేదల పేర్లతో కొంతమంది కాలేజీలు, పెట్రోల్ బంకులను నిర్వహిస్తున్నారని, వాటిపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ దృష్టి సారించాలని కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు విజ్ఞప్తి చేశారు. సిద్ధిపేట జిల్లా తొగుట మండలంలో మల్లన్న సాగర్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బీజేపీతో కుమ్మక్కు అవుదామని బీఆర్ఎస్ ప్రయత్నాలు చేస్తోందని, కానీ కారు పార్టీని కమలం పార్టీ నమ్మదన్నారు. హైడ్రా మీద బీఆర్ఎస్ విషప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైడ్రా మీద విషం కక్కడం ద్వారా తెలంగాణను అల్లకల్లోలం చేయాలని కేటీఆర్, హరీశ్ రావులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తాను దత్తత తీసుకున్న గ్రామంలోని ఇళ్లను హరీశ్ రావు బుల్డోజర్లతో కూల్చివేయించారని ఆరోపించారు. ఇప్పుడు మాత్రం చెరువులను ఆక్రమించిన నిర్మాణాల్ని కూలగొడతామంటే బుల్డోజర్‌కు అడ్డుపడతానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. హైడ్రా బాధితులకు పరిహారం డిమాండ్ చేస్తున్న హరీశ్ రావుకు మల్లన్న సాగర్ నిర్వాసితులు పట్టరా? అని నిలదీశారు. హైడ్రాపై సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో కుంటలు, నాలాలు కబ్జా చేశారని ధ్వజమెత్తారు. మొన్నటి అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఖర్చు చేసినట్లుగా కాంగ్రెస్, బీజేపీ పార్టీలు చేయలేదన్నారు. మెదక్ లోక్ సభ ఎన్నికల్లో వెంకట్రామిరెడ్డిని బలిపశువుగా చేశారన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రైతులను కూడా పోలీసులతో కొట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఘనంగా బతుకమ్మ వేడుకలు



**విశ్వంభర, జయశంకర్ భూపాలపల్లి:** మహదేవపూర్ మండల కేంద్రంలోని శిశుమందిర్ ఇంగ్లీష్ మీడియం లో మంగళవారం రోజున ముందస్తు దసరా వేడుకలను నిర్వహించారు. విద్యారినిలు తీరొక్క పూలతో బతుకమ్మలు అందంగా ఆడారు. దసరా ఉత్సవాలలో భాగంగా శమీపూజ, దశకంఠ రావణసంహారం నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ జగన్మోహనా చారి చెడుపై మంచి గెలిచిన రోజు దసరా అని వివరించారు. సనాతన సాంప్రదాయం లోని ప్రతి పండుగ ప్రకృతితో అనుసంధానం చేయడంతో పాటుగా కాలానుగుణమైన ఆహారపు అలవాట్లను గుర్తు చేస్తుందన్నారు. ఉపాధ్యాలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గోన్నారు.

## సుప్రీం కోర్టు ఆదేశాలతో సిట్ దర్యాప్తు

### తాత్కాలికంగా నిలిపివేత : ఏపీ డీజీపీ

**విశ్వంభర, అమరావతి:** తిరుమలలో లడ్డూ కల్తీ వ్యవహారం పై సుప్రీం కోర్టులో జరుగుతున్న విచారణ దరిమిలా సిట్ దర్యాప్తును తాత్కాలికంగా నిలిపివేసినట్లు ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావు వెల్లడించారు. సుప్రీం కోర్టు(లో ప్రభుత్వం తరుపున వాదిస్తున్న రాష్ట్ర లాయర్ల సూచన మేరకు విచారణను నిలిపివేశామని పేర్కొన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాలకు అనుగుణంగా తదుపరి సిట్ దర్యాప్తు కొనసాగుతుందని వివరించారు.

## గనులశాఖ మాజీ డైరెక్టర్ వెంకటరెడ్డికి 3 రోజుల ఏసీబీ కస్టడీ

**విశ్వంభర, విజయవాడ:** గనులశాఖ మాజీ డైరెక్టర్ వెంకటరెడ్డిని 3 రోజుల పాటు ఏసీబీ అధికారుల కస్టడీకి అప్పగిస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. వెంకటరెడ్డిని ఏసీబీ అధికారులు సెప్టెంబరు 26న హైదరాబాద్లో అరెస్టు చేశారు. అనంతరం విజయవాడ ఏసీబీ కోర్టులో హాజరుపరిచి.. వెంకటరెడ్డిని ఏడు రోజుల కస్టడీకి ఇవ్వాని పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ఏసీబీ కోర్టు న్యాయమూర్తి.. బుధవారం నుంచి మూడు రోజుల పాటు ఏసీబీ కస్టడీకీ అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే



**విశ్వంభర, మిర్యాలగూడ:** పట్టణంలోని మంగళవారం రోజున ఎస్ ఆర్ డిజి స్కూల్, డౌహిల్ స్కూల్‌లలో బతుకమ్మ నిర్వహించారు. బతుకమ్మ వేడుకల్లో మిర్యాలగూడ శాసన సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి బతుకమ్మకి పూజించి బతుకమ్మ ఆడటం జరిగింది. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మన తెలంగాణ సంప్రదాయ పండుగ బతుకమ్మ వేడుకలను ముందుగానే ఇలా చిన్నారులతో జరుపుకోవడం చాలా ఆనందంగా ఉంది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మహిళలు, స్కూల్ విద్యార్థిని, విద్యార్థులు, స్కూలు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## యూనిక్ స్కూల్‌లో బతుకమ్మ వేడుకలు



**విశ్వంభర, షాద్ నగర్:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణం లోని పరిగి రోడ్డు లో ఉన్న యూనిక్ ఇంగ్లీష్ మీడియా స్కూల్ ప్రిన్సిపాల్ నరేందర్, అనురాధ అధ్వర్యంలో స్కూల్ లో బతుకమ్మ వేడుకలు జరుపుకున్నారు. చిన్నారి విద్యార్థులు రంగురంగుల పువ్వులతో బతుకమ్మలను తయారు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నరేందర్ మాట్లాడుతూ విద్యార్థులు భారతీయ సంస్కృతి,సాంప్రదాయం అలవర్చుకోవాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. అలాగే విద్యార్థులు కోలాటాలతో, రంగురంగుల దుస్తువులతో పాఠశాల ప్రాంగణం అంతా ఆట పాటలతో మారుమోగింది. చిన్నారులకు తల్లిదండ్రులు అందరూ మన భారతీయ సంస్కృతి, సాంప్రదాయం నేర్పించాలి అన్నారు. స్కూల్ ఉపాధ్యాయ బృందం, మరియు విద్యార్థుల తల్లి దండ్రులు, చిన్నారి విద్యార్థులు పాల్గొన్నారు.

## సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా విజయ్ సాగర్ రెడ్డి



**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** 130 సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని భాగ్యలక్ష్మి కాలనీలో జరిగినటువంటి సంక్షేమ సంఘం ఎన్నికలలో, ఎస్. విజయసాగర్ రెడ్డి వరుసగా మూడవసారి సంక్షేమ సంఘం అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. సంక్షేమ సంఘం వారు శ్రీ సాయిబాబా దేవాలయ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దేవాలయ కమిటీ అధ్యక్షునిగా బి.యాదగిరి యాదవ్, ప్రధాన కార్యదర్శి గా నందమ్ గౌడ్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు, దేవాలయ కమిటీ సభ్యులు కుత్బుల్లాపూర్ గ్రామంలోని, సిపిఆర్ కాలనీలో రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, పెద్దలు, కె.యం.ప్రతాప్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, బోకేతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి రాములు యాదవ్, కార్యవర్గ సభ్యులు వి. హరిబాబు, జి.ఎస్. రాజు,ఎస్ కే వి. రాజు, సుందరయ్య,శంకర్ చారి, వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక సంఘం ఎన్నికల్లో సూర్యప్రకాష్ గెలుపు

**విశ్వంభర,కల్వకుర్తి:** పట్టణంలోని సూర్యలత కాటన్ మిల్లు కార్మికుల సంఘం మంగళవారం జరిగిన ఎన్నికలలో బిఆర్ఎస్కెవి అభ్యర్థి సూర్యప్రకాశ్ బీఆర్ఎస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి తన సమీప ప్రత్యర్థి ఐఎన్టియుసి అభ్యర్థి ఆనంద్ కుమార్ కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థిపై 68 ఓట్ల తేడాతో గెలుపొందారు. ఈ సందర్భంగా గెలుపొందిన సూర్యప్రకాష్ ను మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మున్సిపల్ చైర్మన్ టిఆర్ఎస్ నాయకులు తదితరులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పట్టణంలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో వెల్దండ మండలం కోట్ర మాజీ ఎంపీటీసీ రాములు, గండికోట రాజు, కాటన్ మిల్లు యాజమాన్యం, కార్మికులు శాలువతో ఘనంగా సన్మానించారు.

## బతుకమ్మ పండుగ సంబరాలు

**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు, కళాశాల ప్రధానాచార్యులు రాహత్ ఖానంతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు ఈ సంబరాలలో పాల్గొన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, చాలా చక్కగా ఆడి పాడారు. ఈ సందర్భంగా కళాశాల ప్రధానాచార్యులు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ పండుగని, ఇలాంటి పండుగను స్త్రీలు చాలా ఆనందంగా జరుపుకుంటారని అన్నారు. ఈ వేడుకలో అధ్యాపకులు డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, డాక్టర్ జెసి బాబు, డాక్టర్ లక్ష్మీ నీలిమ, డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, డాక్టర్ రత్న మంజుల, డాక్టర్ ఎం.సునీత, ఎం.అనిత, డి.కిషన్, డాక్టర్ ఎం.బ్రహ్మం, డాక్టర్ ఎం.రవీందర్, డాక్టర్ రాచమళ్ళ శ్రీను, తదితర అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలోని కోర్టు ఆవరణలో స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో పరిసరాలను శుభ్రపరచడం జరిగింది. అనంతరం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ.ప్రదీప్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి చందనలు, మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ చుట్టుపక్కల ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ, దోమలు ఇతర అనారోగ్యం పాలు కాకుండా స్వచ్ఛభారత్‌ను పాటించాలని, స్వచ్ఛభారత్ పాటించడం ద్వారా, దేశం మొత్తం స్వచ్ఛంగా అనారోగ్యాలకు దూరంగా ఉంటుందని అన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏం.ఏ. మజీద్, సీనియర్ అడ్వకేట్ ఉయ్యాల హనుమంతు గౌడ్, లింగయ్య, మామిడి వెంకట్ రెడ్డి, శ్రవణ్ కుమార్, డేవిడ్, యాదసు యాదయ్య, దినేష్, నోముల స్వామి, అజీజ్, రెండు కోర్టుల సూపరింటెన్డెంట్లు,నారగోని గంగాభవాని,బాలగోని శివరాజు,కోర్టుసిబ్బంది, అడ్వకేట్లు పాల్గొన్నారు.

## ఆర్బిట్ ఈ టెక్నో పాఠశాలలో ఘనంగా బతుకమ్మ

**విశ్వంభర, హనుమకొండ:** హసన్ పర్తి మండలం ఎల్లాపూర్‌లోని ఆర్బిట్ ఈటెక్నో పాఠశాలలో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించినట్లు ఆర్బిట్ ఈ టెక్నో పాఠశాల ప్రిన్సిపల్, కరస్పాండెంట్ చిట్టిరెడ్డి భగవాన్ రెడ్డి ,డైరెక్టర్ హారిక రెడ్డి తెలిపారు. అనంతరం మహిళా ఉపాధ్యాయినీలు,విద్యార్థినిలు కలిసి బతుకమ్మలను పేర్చి పాఠశాల ప్రాంగణంలో ఆటపాటలతో, దాండియా నృత్యాలతో సందడిగా జరుపుకున్నారు. అధ్యాపకులు బతుకమ్మ పండుగ విశిష్టతను విద్యార్థిని, విద్యార్థులకు తెలియజేశారు. డైరెక్టర్ హారిక రెడ్డి, అకాడమిక్ ఇంచార్జి వాసుదేవరెడ్డి, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు మధుకర్, కళ్యాణి, సారంగ పాణి, వహీదా బేగం, అన్వేష్, షర్మిల, వెంకటేష్, రంజిత్, వినయ్ కుమార్, ఇంద్రాణి, రాహుల్ రాజ్,రాజ్ కుమార్,రూపా దేవి,శ్రీకాంత్,కృష్ణవేణి, శ్వేతారెడ్డి, ప్రశాంత్, శ్వేత, ప్రవళిక, నవీన్, సాయి కళ్యాణ్,రజిత,శ్రీనివాస్, హర్షవర్ధన్, సంధ్య, సౌమ్య, అఖిల, స్వప్న, విద్యార్థులు పాల్గొన్నారు.

## పీర్జాదిగూడలో అంతర్గత రోడ్ల సమస్యలు



**విశ్వంభర, మేడిపల్లి:** మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో దాదాపు 1.5 లక్షల మంది జనాభా, 26 డివిజన్లు ఉన్నాయి. 2.4 కిలోమీటర్ల వరకు జాతీయ రహదారికి ఆనుకొని ఉప్పల్ డిపో ఉంది. పీర్జాదిగూడ పరిధిలో అంతర్గత రోడ్ల సమస్య సైతం తీవ్రంగా ఉందని, సమస్య పరిష్కరించేందుకు కృషి చేయాలని స్థానిక ప్రజలు అధికారులను, ప్రజా ప్రతినిధులను విజ్ఞప్తి చేస్తున్నారు.

## జగదీష్ హత్య కేసులో నిందితులు అరెస్టు




**విశ్వంభర,డిండి:** మండలంలోని చెరుకుపల్లి శివారులో శనివారం హత్య కావింపబడిన జగదీష్ 35 సం. హంతకులు అరెస్టు కాబడినట్లు దేవరకొండ డిఎస్పి గిరిబాబు తెలిపారు. ఈ హత్య కేసును డిండి ఎస్ఐ రాజు, సిఐ సురేష్‌తో పాటు చందంపేట నేరేడు కొమ్ము ఎస్సైలు, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ తో చేదించి 48 గంటల్లో నిందితులను పట్టుకోవడం జరిగిందని డీఎస్పీ పత్రికాముఖంగా తెలియజేశారు. ఈ సందర్భంలో సీఐ,ఎస్ఐ డిండి పోలీస్ సిబ్బందిని నల్లగొండ ఎస్పీ అభినందించారు. పోలీస్ సిబ్బందిని డిఎస్పి గిరిబాబు స్వయంగా అభినందించారు. ఈ కేసులో ఏ వన్, ఏ టు, ఏ త్రీగా హతుని భార్య రమాదేవిని చేర్చారు. నిందితులును గుర్తించి, కోర్టు రిమాండ్ కు పంపుతున్నట్లు డి.ఎస్.పి తెలిపారు. విలేకరుల సమావేశంలో డిండి సీఐ సురేష్, ఎస్సై రాజు, పోలీస్ సిబ్బంది హుస్సేన్. తిరుపతయ్య,,సైదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతిని ఆరాధించే పండుగ బతుకమ్మ

**విశ్వంభర, సంగారెడ్డి:** పటాన్ చేరు నియోజకవర్గం తెలంగాణలో బతుకమ్మ పండుగ ప్రకృతిని ఆరాధించే పెద్ద పండుగ అని మాదారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం కవిత కుమారి తెలిపారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థినులు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హెచ్ఎం కవిత కుమారి హాజరై, మాట్లాడుతూ... తెలంగాణ సాంస్కృతి, సంప్రదాయానికి బతుకమ్మ పండుగ ప్రతీకాని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మజ, సత్యనారాయణ , కృష్ణ గౌడ్, రాజేశ్వర్, హన్మన్న సుధా రాణి, బ్రహ్మం,స్వరూప రాణి, భానుమతి, లీలావతి, లక్ష్మి, రజిత, స్వామి,సోనీ విద్యార్థులు పాల్గొన్నారు.

# అదొక మాస్టర్ స్ట్రోక్ ప్లానింగ్.. పేజర్ బ్లాస్ట్ ఆపరేషన్స్

## భారత ఆర్మీ చీఫ్ వ్యాఖ్య



**దిల్లీ:** లెబనాన్ లో హెజ్బుల్లా శ్రేణులు లక్ష్యంగా కొద్దిరోజుల క్రితం ఇజ్రాయెల్ జరిపిన 'పేజర్ బ్లాస్ట్ ఆపరేషన్'తో ప్రపంచ అవాక్కయింది. దీనిపై భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది స్పందించారు. ఆ గ్రూప్ను నిర్వీర్యం చేసే లక్ష్యంతో పేలుడు పదార్థాలతో ఉన్న పేజర్లను పంపేందుకు ఇజ్రాయెల్ ఒక షెల్ సంస్థను ఏర్పాటు చేయడంపై మాట్లాడుతూ.. అదొక మాస్టర్ స్ట్రోక్ అన్నారు. "మనం దాడులు మొదలు పెట్టిన రోజు యుద్ధం ప్రారంభమైనట్టు కాదు. ప్రణాళిక సిద్ధం చేసిన రోజే యుద్ధం మొదలైనట్టు" అని ద్వివేది వ్యాఖ్యానించారు.

# మహారాష్ట్ర ఎన్నికల వేళ.. 'లాపతా లేడీస్' పోస్టర్లతో కాంగ్రెస్ వినూత్న ప్రచారం




**ముంబయి:** మహారాష్ట్రలో త్వరలో ఎన్నికలు జరగనున్న తరుణంలో అధికార పక్షం విధానాలు, ప్రజలకు ఎదురవుతోన్న సమస్యలపై విపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. మహిళల అదృశ్యం అంశాన్ని లేవనెత్తుతూ 'లాపతా లేడీస్' పోస్టర్లతో కాంగ్రెస్ వినూత్న ప్రచారాన్ని ప్రారంభించింది. మహారాష్ట్ర సీఎం ఏక్నాథ్ శిందే, డిప్యూటీ సీఎంలు దేవేంద్ర ఫడణవీస్, అజిత్ పవార్ చిత్రాలు ప్రతిబింబించేలా రూపొందించిన ఫ్లెక్సీలను రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటుచేసింది. అలాగే ఏడాదిలో 64వేల మంది మహిళలు కనిపించకుండా పోయారని అందులో పేర్కొంది. ఈమేరకు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి.

# రాజకీయ కుట్రలకు ఆమె బాధితురాలు

## భార్య సంచలన పోస్ట్‌పై సిద్ధరామయ్య వ్యాఖ్యలు



**బెంగళూరు:** 'ముడా ' కుంభకోణం వ్యవహారం కర్ణాటక సీఎంసిద్ధరామయ్యను ముప్పతిప్పలు పెడుతున్న వేళ.. ఆయన సతీమణి పార్వతి సంచలన నిర్ణయం తీసుకున్నారు.తమ భూములను తిరిగి ముడా సంస్థకు ఇచ్చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిర్ణయంపై ముఖ్యమంత్రి స్పందించారు. రాజకీయ విద్వేషాలు, కుట్రలకు తన భార్య బాధితురాలయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. ఏదేమైనా ఆమె నిర్ణయాన్ని గౌరవిస్తున్నట్లు తెలిపారు."ముడా స్థలాల కేటాయింపులో భాగంగా మాకు వచ్చిన భూములను నా భార్య పార్వతి తిరిగిచ్చేసింది. దీనిపై ప్రతిపక్షాలు తప్పుడు ఫిర్యాదులు సృష్టించి నా కుటుంబాన్ని వివాదంలోకి లాగారు. ఈ విషయం రాష్ట్ర ప్రజలకు కూడా తెలుసు. ఈ అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడాలన్నదే నా సిద్ధాంతం. కానీ,నాపై జరుగుతున్న ఈ రాజకీయ కుట్రలు చూసి నా భార్య ఆవేదన చెందింది. అందుకే భూములను తిరిగి ఇవ్వాలని నిర్ణయించుకుంది. ఇది నాకు ఆశ్చర్యం కలిగించినప్పటికీ ఆమె నిర్ణయాన్ని నేను గౌరవిస్తున్నా. నాలుగు దశాబ్దాల నా రాజకీయాల్లో ఎలాంటి జోక్యం చేసుకోకుండా.. కుటుంబ బాధ్యతలకే పరిమితమైన నా భార్య.. ఇప్పుడు ఇలాంటి విద్వేష రాజకీయాలకు గురై మానసిక క్షోభను అనుభవిస్తోంది" అని సిద్ధరామయ్య సుదీర్ఘ పోస్ట్ చేశారు.
ముడా వివాదాని కి సంబంధించి సిద్ధరామయ్యపైఈడీ కేసు నమోదు చేసిన వేళ.. ఆయన భార్య సోమవారం ఓ లేఖ విడుదల చేశారు. అవినీతి మరకలేని తన భర్త రాజకీయ జీవితానికి ముప్పు తెస్తున్న 'ముడా'కు చెందిన 14 ప్లాట్లు తిరిగి అదే సంస్థకు ఇచ్చేస్తున్నట్లు ఆమె ప్రకటించారు. "మా అన్న య్య పసుపు కుంకుమల కింద ఇచ్చిన ఈ ప్లాట్లు ఇంత రాద్ధాంతం చేస్తాయని ఊహించలేదు. నా భర్త గౌరవం, ఘనతకు మించి ఈ ఆస్తులు పెద్దవి కావు. ఇన్నేళ్లు ఆయన అధికారం నుంచి ఏమీ ఆశించని మాకు ఈ ఆస్తులు తృణప్రాయం. అందుకే ఈ స్థలాలను తిరిగి ముడాకు అప్పగిస్తున్నా. ఈ విషయంలో నా భర్త అభిప్రాయం ఏమిటో తెలియదు. నా కుటుంబసభ్యులతోనూ చర్చించకుండా నాకు నేనుగా తీసుకున్న నిర్ణయమిది. ఈ ఆరోపణలు వినిపించిన రోజే ఈ నిర్ణయం తీసుకోవాలనుకున్నా. నా భర్త రాజకీయ కుట్రలో మరింత నష్టపోతున్నాడని తెలిసి ఈ నిర్ణయం తీసుకున్నా. అవసరమైతే దర్యాప్తునకు సహకరిస్తా. రాజకీయ రంగానికి దూరంగా ఉండే నాలాంటి ఆడవాళ్లను వివాదాల్లోకి లాగొద్దు' అని ఆమె ఆ లేఖలో పేర్కొన్నారు.మరోవైపు, ఈ పరిణామాలపై ముడా కమిషనర్ స్పందించారు. 'ముడా ఆస్తులను ఎవరైనా వెనక్కి ఇచ్చేస్తే మేం తీసుకుంటాం. దీనిపై మేం చర్చలు జరుపుతున్నాం" అని వెల్లడించారు.

## టిష్యూ పేపర్లలో చుట్టి.. ఐఫోన్ 16 ప్రో మ్యాక్స్ ఫోన్లు స్మగ్లింగ్

**దిల్లీ:** ఇటీవల కాలంలో నిందితులు కొత్త విధానాల్లో స్మగ్లింగ్లకు పాల్పడుతున్నారు. తాజాగా ఓ మహిళ ఏకంగా 21 ఐ ఫోన్ 16 ప్రో మ్యాక్స్ ఫోన్లను దేశాలు దాటించేందుకు ప్రయత్నించి కస్టమ్స్ అధికారులకు దొరికిపోయింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ మహిళ హాంకాంగ్ నుంచి దిల్లీలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ విమానాశ్రయానికి వచ్చింది. అక్కడి కస్టమ్స్ అధికారులు సాధారణ తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఆ మహిళ హ్యాండ్ బ్యాగ్ నుంచి 21 ఐఫోన్ 16 ప్రో మ్యాక్స్ ఫోన్లను గుర్తించారు. అదికూడా ఒక్కొక్క ఫోనూ టిష్యూ పేపర్లో చుట్టి హ్యాండ్బ్యాగ్ ఉన్నా యి. దీంతో ఆమెను అదుపులోకి తీసుకున్నారు. తదుపరి విచారణను కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు.

# ప్రార్థనా మందిరాలు ప్రజా జీవితాలకు అడ్డంకి కాకూడదు

## ♦ సుప్రీం కోర్టు వ్యాఖ్య



**దిల్లీ:** రోడ్లు, జలాశయాలు, రైలు ట్రాక్ లను ఆక్రమించిన ఏ మత సంబంధ కట్టడాలనైనా తొలగించాల్సిందేనని.. ప్రజల సురక్షితమే అత్యు న్నత అంశమని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. నేరగాళ్ల ఇళ్లపై బుల్డోజర్ చర్యలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ ను మంగళవారం జస్టిస్ బీఆర్ గవయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్ నేతృత్వంలోని బెంచి విచారిం చింది. భారత్ సెక్యూలర్ దేశమని.. ఆక్రమణల తొలగింపు, బుల్డోజర్ చర్యలు మతాలతో సంబంధం లేకుండా అందరికీ ఒక్కటేనని బెంచ్ పేర్కొంది. యూపీ, గుజరాత్, మధ్యప్రదేశ్ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు హాజరయ్యారు. ఏదైనా నేరంలో ఉండటమే వ్యక్తిఇంటిపై బుల్డోజర్ చర్యలు తీసుకోవడానికి ఆధారమా..?అని ఆయన్నుబెంచ్ ప్రశ్నించింది. దీనికి మెహతా స్పందిస్తూ.. "కచ్చితంగా కాదు. అత్యాచారం, ఉగ్రవాదం వంటి నేరాల్లో నిందితులైనా సంబంధం లేదు. ఒక్కరోజు ముందు నోటీసు జారీ చేసి ఇంటి గోడపై అంటించినా పరిగణలోకి తీసుకోం. ఇది ముందే జరిగిఉంటేనే చర్యలు తీసుకొం టాం" అని పేర్కొన్నారు. ఒక వర్గానికి సంబంధించిన కొన్ని ఘటనల ఆధారంగా న్యాయస్థానం మార్గదర్శకాలు జారీచేసిందని తాను ఆందోళన చెందుతున్నట్లు ఆయన వెల్లడించారు.దీనిపై న్యాయస్థానం స్పందిస్తూ.. "మనది సెక్యూలర్ దేశం. మా మార్గదర్శకాలు జాతిమతా లతో సంబంధం లేకుండా అందరికీ వర్తిస్తాయి. ఇక ఆక్రమణల విషయానికి వస్తే మేము ఇప్పటికే చెప్పాం. ఏదైనా మత సంబంధమైన నిర్మాణం రోడ్డు, ఫుట్పాత్, జలాశయం, రైలు పట్టాపై ఉంటే అది ప్రజ లకు అడ్డంకి కాదా. అక్రమ నిర్మాణాల విషయంలో అందరికీ ఒక్కటే చట్టం" అని వ్యాఖ్యానించింది.ఇక యూన్ రిపోర్టర్ సీనియర్ అడ్వొకేట్ బ్రిందా గ్రోవర్ ఇళ్ల లభ్యతపై వాదనలు వినిపించారు. దీనికి సొలిసిటర్ జనరల్ మెహతా అభ్యంతరం చెబుతూ "ఈ విషయాన్ని అంతర్జాతీయ కరించాల్సిన అవసరం లేదని.. దేశ న్యాయస్థానాలకు తగినంత శక్తి ఉందన్నారు. ఈవిషయంలో అంతర్జాతీయ ఏజెన్సీ జోక్యం అవసరం లేదు" అని పేర్కొన్నారు.పిటిషనర్ల తరపున న్యాయవాది సీయూ సింగ్ వాదిస్తూ.. బుల్డోజర్ చర్యలను నేరాలపై పోరాడేందుకు ఉపయోగిం చకూడదని అభ్యర్థించారు.

### డిజిటలైజ్ చేశారా..?

పంచాయతీలకు, పురపాలక కార్పొరేషన్లకు విభిన్నమైన చట్టాలున్నాయని న్యాయస్థానం పేర్కొంది. వీటికి ఆన్లైన్ పోర్టల్స్ ఉండాలని అభిప్రాయపడింది. వాటిల్లో డిజిటలైజ్ చేసిన రికార్డులు అందుబాటులో ఉంచాలని పేర్కొంది.

# మళ్లీ నిరసన బాట పట్టిన బెంగాల్ వైద్యులు

## భద్రత కల్పించాలంటూ ప్రభుత్వానికి డిమాండ్



**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో జూనియర్ డాక్టర్లు మరోసారి నిరసనబాట పట్టారు. విధులను పూర్తిగా పక్కనబెట్టి ఆందోళనకు దిగారు. వైద్యులకు పూర్తిస్థాయిలో భద్రత కల్పించాలంటూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కాగా, దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతా వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటనపై గత రెండు నెలలుగా అక్కడి వైద్యులు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. అయితే, తమ డిమాండ్లను నెరవేర్చుతామని మమతా బెనర్జీ సర్కార్ అంగీకరించిన నేపథ్యంలో 42 రోజుల నిరసన తర్వాత జూనియర్ డాక్టర్లు సెప్టెంబర్ 21న ప్రభుత్వ ఆసుపత్రుల్లో పాక్షికంగా విధుల్లో చేరారు. అయితే అత్యవసర వైద్య సేవలకు మాత్రమే హాజరయ్యారు. ఔట్ పేషెంట్ విభాగం (ఓపీడీ)లో విధులకు మాత్రం దూరంగా ఉన్నారు. తాజాగా మరోసారి వారు పూర్తి స్థాయిలో విధులను బహిష్కరించి ఆందోళనకు దిగారు.భద్రత కోసం తమ డిమాండ్లను నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూల స్పందన కనిపించడం లేదని ఈ సందర్భంగా వారు తెలిపారు. నిరసన చేపట్టి నేటికి 52 రోజులు అవుతున్నా.. ఇప్పటికీ తమపై దాడులు జరుగుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో సమావేశం అనంతరం తమ భద్రత సహా ఇతర హామీలను నిలబెట్టుకునే ప్రయత్నం ప్రభుత్వం చేయలేదని ఆగ్రహించారు. ప్రస్తుతం విధులను బహిష్కరించడం మినహా తమకు వేరే మార్గం లేదని పేర్కొన్నారు.

# వినియోగదారులకు షాక్.. పెరిగిన కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర

**దిల్లీ:** ధరల మోతతో ఇబ్బంది పడుతున్న గ్యాస్ వినియోగదారులకు దేశీయ చమురు సంస్థలు మరోసారి షాక్ ఇచ్చాయి. వాణిజ్య అవసరాలకు వినియోగించే ఎల్పీజీ సిలిండర్ ధరను పెంచాయి. 19 కేజీల సిలిండర్‌పై ఏకంగా రూ.48.50 మేర పెరిగింది. ఈ మేరకు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు మంగళవారం ఉదయం ప్రకటించాయి. పెరిగిన ధరలు నేటి నుంచి అంటే అక్టోబర్ 1 నుంచే అమల్లోకి రానున్నట్లువెల్లడించాయి.ధరల పెంపు తర్వాత దేశ రాజధాని ఢిల్లీలో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.1,691 నుంచి రూ.1740కి పెరిగింది. కోల్‌కతాలో రూ.1,802 నుంచి రూ.1,850.50కి, ముంబైలో రూ.1,644 నుంచి రూ.1,692.50కి, చెన్నైలో రూ.1,855 నుంచి రూ.1,903కి పెరిగాయి. స్థానిక పన్నుల ఆధారంగా రాష్ట్రాలను బట్టి ధరల్లో మార్పులు ఉంటాయి. కాగా అంతకుముందు సెప్టెంబర్ 1, ఆగస్టు 1న కూడా కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలను కంపెనీలు పెంచాయి. ఇక 14.2 కేజీల గృహ వినియోగ సిలిండర్ ధరలో ఎలాంటిమార్పు లేదని, పాత ధరలే యథాతథంగా కొనసాగుతాయని చమురు కంపెనీలు స్పష్టం చేశాయి. ప్రతి నెల 1వ తేదీన ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ధరలను సవరిస్తుంటాయి. అందులో భాగంగా సవరించిన ధరలను ప్రకటించాయి.

# వాంగ్‌చుక్ నిర్బంధం ఆమోదయోగ్యం కాదు


## ♦మండిపడిన రాహుల్



**దిల్లీ:** పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగుక్, ఆయన మద్దతుదారులను సింగు సరిహద్దుల్లో ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈనేపథ్యంలో ఆయన్ను నిర్భందించడం ఆమోదయోగ్యం కాదని కాంగ్రెస్ అగ్రనేత, లోక్సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఈమేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు.'పర్యావరణ, రాజ్యాంగ హక్కుల కోసం శాంతియుతంగా పోరాడుతున్న సోనమ్ వాంగ్చుక్తో పాటు వందల మంది లద్దాఖీలను నిర్భందించడం ఆమోదయోగ్యం కాదు. లద్దాఖ్ భవిష్యత్తు కోసం పోరాడుతున్న వృద్ధ పౌరులను దిల్లీ సరిహద్దుల్లో ఎందుకు నిర్బంధించారు? మోదీ రైతులపై పన్నిన చక్రవ్యూహం మాదిరిగానే ఇది విచ్ఛిన్నమవుతుంది. లద్దాఖ్ వాణిని మీరు వినవలసి ఉంది' అని ఆయన పేర్కొన్నారు.ఇక, సోనమ్ వాంగతుక్, ఆయన మద్దతుదారులను సోమవారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు సైతం స్పష్టంచేశారు. అదేవిధంగా ఆ ప్రాంతంలో సెక్షన్ 163 విధించినట్లు ప్రకటించారు.
ఇదిలాఉండగా.. పోలీసులు తనను నిర్బంధించారని సోమన్ వాంగ్చుక్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. 'నన్ను, 150 మంది పాదయాత్రదారులను వెయ్యి మంది పోలీసు బలగాలు కలిసి నిర్బంధించారు. మాలో చాలా మంది వృద్ధులు, ఆర్మీ నుంచి రిటైర్డ్ అయిన వ్యక్తులు ఉన్నారు. మా భవి ష్యత్తు ఏంటో తెలియదు. మేము బాపు సమాధి వద్ద శాంతియుతంగా పాదయాత్ర చేస్తున్నాం. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంలో.. ప్రజాస్వామ్య మాత.. 'హే రామ్!' అని ఆయన పోస్టో పేర్కొన్నారు.సోనమ్ వాంగుక్, ఇతర మద్దతుదారులు తమ డిమాండ్లను నెరవేర్చాలని గత నెల 1న లేహ్లో పాదయాత్ర ప్రారంభించారు. హిమాచల్ ప్రదేశ్కు వారి పాదయాత్ర చేరుకున్నాక వాంగ్చుకో తమ పాదయాత్ర ఉద్దేశాన్ని వెల్లడించారు. ఐదేళ్ల క్రితం కేంద్రం తమకిచ్చిన వాగ్దానాన్ని గుర్తుచేసేందుకు ఈ పాదయాత్ర చేపటామన్నారు. ఇక, వారి డిమాండ్లలో ప్రధానమైనది లద్దాఖ్ను రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్లో చేర్చడం. ఇది స్థానిక జనాభా, వారి భూమి, సాంస్కృతిక గుర్తింపును రక్షించేందుకు చట్టాన్ని రూపొందించే అధికారాన్ని ఇస్తుంది. ఇదిలాఉండగా.. 2019 ఆగస్టులో ఆర్టికల్ 370 రద్దుతో జమ్మూకశ్మీర్ను రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా కేంద్రం విభజించింది. అందులో లద్దాఖ్ కూడా ఒకటి.

# మహిళల్ని ఎందుకు సన్యాసినులుగా మారేలా ప్రేరేపిస్తున్నారు

## సద్గురు జగ్గీ వాసుదేవ్‌ను ప్రశ్నించిన మద్రాస్ హైకోర్టు



చెన్నై: ఆధ్యాత్మిక గురువు సద్గురు జగ్గీ వాసుదేవ్ ను మద్రాస్ హైకోర్టు ప్రశ్నించింది. మహిళలను ఎందుకు సన్యాసినులుగా మారేలా ప్రేరేపిస్తున్నారని హైకోర్టు అడిగింది. ఓ కేసులో కోర్టు ఆ ప్రశ్న వేసింది. తన స్వంత కూతురి పెళ్లి చేసిన సద్గురు, ఎందుకు ఇతర అమ్మాయిలను సన్యాసం వైపు మళ్లిస్తున్నారని కోర్టు ప్రశ్నించింది. జస్టిస్ ఎస్ఎం సుబ్రమణియం, వీ శివజ్ఞానంతో కూడిన ధర్మాసనం ఈ ప్రశ్నలు వేసింది. తన ఇద్దరు కూతుళ్లను సద్గురు బ్రెయిన్‌వాష్ చేశారని, వాళ్లు పర్మనెంట్‌గా ఈషా యోగా సెంటర్‌లోనే ఉంటున్నారని ఓ రిటైర్డ్ ప్రొఫెసర్ ఈషా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జగ్గీపై కేసు ఫైల్ చేశారు.కోయంబత్తూరులోని తమిళనాడు అగ్రికల్చర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎస్ కామరాజ్ ఆ కేసు ఫైల్ చేశారు. 42, 39 ఏళ్లు ఉన్న ఇద్దరు మహిళలు ఆ కేసులో ఇవాళ కోర్టు ముందు హాజరయ్యారు. అయితే తమ ఇష్ట ప్రకారమే ఈషా ఫౌండేషన్‌లో ఉంటున్నట్లు చెప్పారు. తమను ఎవరూ బంధించలేదని చెప్పారు. కూతుళ్లు వదిలి వెళ్లడం వల్ల తమ జీవితం దుర్భరమైనట్లు ఆ పేరెంట్స్ కోర్టుకు వెల్లడించారు. అయితే ఈ కేసులో మరింత లోతుగా విచారణ చేపట్టాలని జడ్జీ సూచించారు.ఈషా ఫౌండేషన్‌తో లింకున్న అన్ని కేసులను లిస్టు చేయాలని పోలీసులకు ఆదేశాలిచ్చారు. తన కూతురుకు పెళ్లి చేసి, జీవితంలో సెటిలయ్యేలా చేశారని, కానీ ఇతరుల కూతుళ్లను మాత్రం సన్యాసుల్లా జీవించేలా ప్రేరేపిస్తున్న సద్గురు ఎందుకు అలా చేస్తున్నారో తెలుసుకోవాలని ఉందని జస్టిస్ శివజ్ఞానం తెలిపారు. స్వచ్ఛందంగా ఉండేందుకు మహిళలు నిర్ణయించినట్లు ఈషా ఫౌండేషన్ తెలిపింది.

# డేరా బాబాకు మరోసారి పెరోల్



**చండీఘడ్:** హర్యానా ఇద్దరు మహిళలపై లైంగికదాడికి పాల్పడ్డాడన్న కేసులో దోషిగా తేలిన 'డేరా సచ్చా సౌదా' చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ అలియాస్ డేరా బాబా మరోసారి జైలు నుంచి బయటకు రానున్నారు. అక్టోబర్ 5వ తేదీన హర్యానా అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డేరా బాబా పెట్టుకున్న పెరోల్ పిటిషన్‌ను ఎన్నికల సంఘం సోమవారం ఆమోదించింది. ఎన్నికల సంఘం ఆమోదం నేపథ్యంలో హర్యానా ప్రభుత్వం ఆయన విడుదలకు త్వరలో ఉత్తర్వులు జారీ చేయనుంది. దీంతో ఆయన జైలు నుంచి బయటకు రానున్నారు.

### ఎన్నికలపై పెను ప్రభావం..

డేరా బాబాకు హర్యానాలో లక్షలాది మంది అనుచరులున్నారు. ఈ నేపథ్యంలో ఆయన బయటకు వస్తే ఈ ఎన్నికలపై పెను ప్రభావం పడనుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, పెరోల్ సమయంలో ఆయన హర్యానాలోకి ప్రవేశించకుండా నిషేధం విధించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. వ్యక్తిగతంగా లేదా సోషల్ మీడియా ద్వారా ఎలాంటి ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనే వీలుండదని సమాచారం. కాగా, ఎన్నికల సంఘం నిర్ణయంతో డేరా బాబాకు తొమ్మిది నెలల్లో పెరోల్ లభించడం ఇది మూడోసారి కావడం గమనార్హం. ఇక గత నాలుగేళ్లలో 15వ సారి. ఇదీ కేసు.. 2017లో ఇద్దరు శిష్యులపై అత్యాచారానికి పాల్పడిన కేసులో దోషిగా నిర్ధారణ అయిన తరువాత కోర్టు అతనికి 20 సంవత్సరాల జైలు శిక్ష విధించింది. రెండు అత్యాచారాలకు సంబంధించిన కేసులో దోషిగా శిక్ష అనుభవించడంతో పాటు పలు హత్యల్లో జీవిత ఖైదు ఎదుర్కొంటున్నాడు. ప్రస్తుతం అతడు హర్యానాలోని రోహ్‌తక్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. అయితే, ఆయన వివిధ కారణాలతో పలుమార్లు పెరోల్‌పై బయటకు వస్తున్న విషయం తెలిసిందే.

### పెరోల్‌పై పలుమార్లు విడుదల..

గత తొమ్మిది నెలల్లో ఆయనకు మూడుసార్లు పెరోల్ (తాజా పెరోల్‌తో కలిపి) లభించగా.. నాలుగేళ్లలో మొత్తంగా 15 సార్లు పెరోల్‌పై బయటకు వచ్చాడు. గతేడాది జనవరిలో 40 రోజులు, జులైలో 30 రోజులు, నవంబర్‌లో కూడా 21 రోజులపాటు పెరోల్‌పై బయటకు వచ్చాడు. మొత్తంగా గతేడాది 91 రోజులపాటు ఆయన పెరోల్‌పై బయటే ఉన్నాడు. ఇక ఈ ఏడాది (2024) జనవరిలో కూడా ఆయన దాదాపు 50 రోజుల పాటు పెరోల్‌పై బయటే ఉన్న విషయం తెలిసిందే. ఆగస్టులో కూడా 21 రోజుల పెరోల్‌పై బయటకు వచ్చారు. ఇప్పుడు మూడోసారి కూడా ఆయనకు పెరోల్ లభించింది. ఇక 2022లో మూడుసార్లు పెరోల్ లభించింది. ఆ ఏడాది ఫిబ్రవరిలో 21 రోజులు, జూన్‌లో (నెలరోజులు), అక్టోబర్‌లో 40 రోజుల పాటు జైలు నుంచి బయటకు వచ్చారు. ఇక 2020, 2021లో కూడా పలుమార్లు అతడికి పెరోల్ లభించింది.

# ముడా స్కామ్‌లో ఆరుగురు మాజీ ఎమ్మెల్యేలు, 326 మంది అధికారులు

చిక్కమంగుళూరు: కర్నాటక ముడా స్కామ్‌లో కొత్త విషయాలు బయటకు వచ్చాయి. కడూరు, ముడిగేరి తాలూకాల్లో సుమారు పది వేల ఎకరాల స్థలాన్ని అక్రమంగా కేటాయించారు. దాంట్లో ఇప్పటికే సీఎం సిద్దరామయ్య విచారణ ఎదుర్కొంటున్నారు. అయితే దర్యాప్తు రిపోర్టు ప్రకారం అక్కడ స్థలాన్ని ఆరుగురు మాజీ ఎమ్మెల్యేలకు కేటాయించినట్లు తెలిసింది. వారితో పాటు మరో 326 మంది అధికారులు కూడా భూమి తీసుకున్నవారిలోఉన్నారు. అక్రమ కేటాయింపులకు రెగ్యులరైజేషన్ కమిటీ బాధ్యత వహించాల్సి ఉంటుందని రిపోర్టులో తెలిపారు.కడూరు నియోజకవర్గ ఎమ్మెల్యేలు వైఎస్వీ దత్త, బెల్లి ప్రకాశ్, ముడిగేరి నియోజకవర్గ ప్రతినిధులు మోతమ్మ, ఎంపీ కుమారస్వామి, బీబీ నింగయ్య పేర్లు కూడా దర్యాప్తు రిపోర్టులో ఉన్నాయి. ప్రభుత్వం నియమించిన 13 మంది తహిసీల్దార్లు ఇచ్చిన నివేదికలో ఆ పేర్లు ఉన్నాయి. చిక్కమంగుళూరుకు చెందిన సీటీ రవి పేరు కూడా ఉన్నది.అక్రమంగా భూమి పొందిన 326 మంది అధికారుల్లో.. 23 మంది తహిసిల్దారులు, 18 శిరస్తేదార్లు, 48 మంది రెవన్యూ ఇన్‌స్పెక్టర్లు, 104 మంది విలేజ్ ఆఫీసర్లు ఉన్నారు. మొత్తం 10,598 ఎకరాల భూమిని అక్రమంగా కేటాయించినట్లు రిపోర్టులో తెలిపారు. 6248 ఎకరాల స్థలాన్ని అనర్హులకు ఇచ్చినట్లు తెలిసింది.

# రాయలసీమను గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మారుస్తాం: సీఎం చంద్రబాబు



**విశ్వంభర, పుచ్చకాయలమడ(కర్నూలు):** రాయలసీమను గ్రీన్ ఎనర్జీ హబ్ మారుస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సోలార్, విండ్ పవర్ ఉత్పత్తి చేయడం ద్వారా ఈ ప్రాంతంలో 7.5 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. కర్నూలు జిల్లా పుచ్చకాయలమడలో నిర్వహించిన గ్రామసభలో సీఎం ప్రసంగించారు. "వర్క్‌ఫ్రమ్ హోమ్కు శ్రీకారం చుట్టాలనేది నా ఆలోచన. గ్రామాల్లో వర్క్ స్టేషన్లు ఏర్పాటు చేయడం ద్వారా సొంతూరులోనే ఉండి ఉద్యోగం చేసుకోవచ్చు.గత ప్రభుత్వంలో సీఎం మీటింగ్ అంటే పరదాలు కట్టేవారు.. చెట్లు కొట్టేసే వారు. గతంలో సీఎం మీటింగ్ అంటే ప్రజలకు నరకం కనిపించేది. కూటమి ప్రభుత్వం వచ్చాక పింఛను రూ.4వేలకు పెంచాం. ఒకటో తేదీన అధికారులు మీ ఇంటికొచ్చి పింఛను ఇస్తున్నారు. పింఛన్ల పంపిణీ శాశ్వతంగా కొనసాగిస్తాం. ఒకప్పుడు ఉద్యోగులకు జీతాలుసరిగా వచ్చేవి కావు. ఇప్పుడు ఉద్యోగులకు నెలనెలా జీతాలు, పింఛన్లు ఇస్తున్నాం. జీతాలు గురించి ఎవరూ ఆందోళన చెందవద్దు. ఎన్నికల్లో ఎంతో చైతన్యంతో కూటమికి ఓట్లు వేశారు. జగన్ వెళ్తూ వెళ్తూ ఖజానా ఖాళీ చేసి వెళ్లారు. మీరు ఎక్కువ మంది కూటమి ఎంపీలను గెలిపించి మంచి పనిచేశారు. గత ఐదేళ్లలో ఒక్క ఎకరాకు నీరివ్వలేదు. వైకాపా ప్రభుత్వం చేసిన విధ్వంసం అంతాఇంతా కాదు. పైసా ఖర్చు లేకుండా రాజముద్రతో పట్టాదారు పాస్పుస్తకాలు ఇచ్చే బాధ్యత మాది. ఇప్పటికే ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేశాం. రీ సర్వే పేరుతో ప్రజల భూముల సరిహద్దులు చెరిపేశారు.. వాటిని సరిచేస్తున్నాం. ప్రభుత్వానికి వచ్చిన ఫిర్యాదుల్లో సగం భూ సమస్యలే ఉన్నాయి. భూ సమస్యలపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయి.

### రాయలసీమలో ప్రతి ఎకరాకు నీళ్లివ్వాలనేది నా లక్ష్యం

కర్నూలు నుంచి బళ్లారికి జాతీయ రహదారి తెస్తాం. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుచేస్తాం. మెరుగైన మద్యం పాలసీ తీసుకొచ్చాం.రూ.100 కోట్లతో మద్యం మాన్పించే కార్యక్రమం చేపడతాం. ఓర్వకల్లులో పరిశ్రమలు ఏర్పాటు చేస్తాం. దీపావళి నుంచి మహిళలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లు. గ్యాస్ సిలిండర్ పంపిణీని దీపావళి రోజు ప్రారంభిస్తాం. మహిళలకు ఏడాదికి 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తాం. వాలంటీర్లు లేకపోతే ఏం చేయలేరన్నారు.వాళ్లు లేకపోయినాపింఛన్లు పంపిణీ చేస్తున్నాం. వాలంటీర్లను ఏం చేయాలో ఆలోచిస్తున్నాం" అని సీఎం తెలిపారు.

# సుప్రీం కోర్టు ఆదేశాలతో సిట్ దర్యాప్తు తాత్కాలికంగా నిలిపివేత

■ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావు



**విశ్వంభర, తిరుమల :** తిరుమలలో లడ్డూ కల్తీ వ్యవహారం పై సుప్రీం కోర్టులో జరుగుతున్న విచారణ దరిమిలా సిట్ దర్యాప్తును తాత్కాలికంగా నిలిపివేసినట్లు ఏపీ డీజీపీ ద్వారకా తిరుమల రావు వెల్లడించారు. సుప్రీంకోర్టులో ప్రభుత్వం తరుపున వాదిస్తున్న రాష్ట్ర లాయర్ల సూచన మేరకు విచారణను నిలిపివేశామని పేర్కొన్నారు.సుప్రీం కోర్టు ఆదేశాలకు అనుగుణంగా తదుపరి సిట్ దర్యాప్తు కొనసాగుతుందని వివరించారు. మంగళవారం తిరుమలలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు.

### తిరుమల బ్రహ్మోత్సవాలకు పటిష్ట భద్రత

తిరుమలలో ఈనెల 4 నుంచి 12వ తేదీవరకు జరుగనున్న బ్రహ్మోత్సవాలుకు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావు వెల్లడించారు. తిరుమలలో దొంగతనాలు, దోపిడీల నియంత్రణకు అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంటుందని పేర్కొన్నారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. అందుబాగులో 2 వేలకు పైగా సీసీ కెమెరాలను ఉపయోగించుకుంటున్నామని తెలిపారు. బ్రహ్మో త్సవాల సందర్భంగా వచ్చే భక్తులు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా అవగాహన కల్పిస్తామన్నారు.తిరుమాడ వీధుల్లో భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.. ప్రయాణిలకు భద్రత ప్రథమ ప్రాధాన్యం కింద తీసుకుని ఆర్టీసీలో ప్రయాణం భద్రత ఉంటుందని అవగాహన కల్పిస్తున్నామన్నారు . ఆయా ప్రాంతాలకు అదనపు బస్సులను నడుపుతున్నామని ఏపీఎస్ ఆర్టీసీ ఇన్‌చార్జి ఎండీ ద్వారకా తిరుమలరావు స్పష్టం చేశారు.

# ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



**విశ్వంభర, తిరుమల :** ఈనెల 4 నుంచి 12వ తేదీ వరకు తిరుమల ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా అంతకుముందు వచ్చే మంగళవారం రోజున కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అందులో భాగంగా ఆలయ ప్రాంగణంలోని గోడలు, పైకప్పులు, స్తంభాలు అన్నింటిలోనూ పరిమళం అనే ప్రత్యేక సుగంధ మిశ్రమాన్ని పూయగా మొత్తం ఆలయం, దేవతా మూర్తులు, పూజా సామగ్రిని శుభ్రం చేశారు.అనంతరం టీటీడీ ఈవో జె శ్యామలరావు మాట్లాడుతూ అక్టోబరు 4 నుంచి 12 వరకు జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలను దృష్టిలో ఉంచుకుని ఈ విశిష్ట తిరుమంజనం నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు . సాధారణంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం సంవత్సరానికి నాలుగుసార్లు నిర్వహిస్తామని తెలిపారు. తెలుగు ఉగాది, ఆణివార ఆస్థానం, వార్షిక బ్రహ్మోత్సవాలు , వైకుంఠ ఏకాదశి ఉత్సవాల ముందు సంవత్సరం ముందు మంగళవారం వీటిని నిర్వహిస్తమన్నారు.అనంతరం పీఠాధిపతికి ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించారు. మధ్యాహ్నం 12 గంటల తర్వాత భక్తులను దర్శనానికి అనుమతించారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం దృష్ట్యా మంగళవారం అష్టదళ పాద పద్మారాధన, వీఐపీ బ్రేక్‌ను టీటీడీ రద్దు చేసింది. ఈ కార్యక్రమంలో టీటీడీ అడిషనల్ ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, అధికారులు పాల్గొన్నారు.

# చంద్రబాబు బేషరతుగా క్షమాపణ చెప్పాలి

### మాజీ ఎంపీ మార్గాని భరత్ డిమాండ్



**విశ్వంభర, తూర్పుగోదావరి:** దేవుడిని రాజకీయాల్లోకి లాగొద్దని తిరుమల లడ్డూలో కల్తీ అంశంపై ఏపీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు తలంటు అంటిన నేపథ్యంలో ఏపీ సీఎం చంద్రబాబుపై మాజీ ఎంపీ మార్గాని భరత్ కీలక వ్యాఖ్యలు చేశారు. హిందూ సమజానికి చంద్రబాబు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి ఈ రకంగా మాట్లాడితే పారదర్శకత ఏముంటుందని ప్రశ్నించారు.తూర్పు గోదావరి జిల్లా వైసీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మార్గాని భరత్ మాట్లాడారు. తిరుమల లడ్డూ వివాదంపై వైఎస్ జగన్ ఏయే అంశాల గురించి మాట్లాడారో అవే అంశాలను సుప్రీంకోర్టు ప్రస్తావించిందని గుర్తుచేశారు. చివరకు సత్యమే గెలుస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. శ్రీవారి లడ్డూపై చంద్రబాబు చేసిన ఆరోపణలపై హిందూ సమాజానికి భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.పోలవరం డయాఫ్రం వాల్‌పై జగన్ ప్రభుత్వం చేసిన ఆరోపణలపైనా మార్గాని భరత్ స్పందించారు. డయాఫ్రం వాల్ చిన్నాభిన్నం కావడానికి చంద్రబాబు కారణం కాదా? అని ప్రశ్నించారు. ఈసీఆర్ఎఫ్ కింద ఉన్న ఫౌండేషన్ అయిన డయాఫ్రం వాల్‌కు రక్షణ లేకపోవడంతో దెబ్బతిన్నదని అని ఆరోపించారు. ఏరకమైన రక్షణ లేకపోవడం వల్లే కాపర్ డ్యాం నిర్మాణం దెబ్బతిన్నదని పోలవరానికి సంబంధించి ఏర్పాటు చేసిన అంతర్జాతీయ కమిటీ తేల్చిందని చెప్పారు. కాపర్ డ్యామ్‌లు కట్టకుండా డయాఫ్రం వాల్ ఎందుకు కట్టారని ప్రశ్నించారు.చంద్రబాబు పోలవరం ద్రోహి అని పిలవాలని మార్గాని భరత్ అన్నారు. పోలవరం ప్రాజెక్టుకు చేటు చేసిన వ్యక్తిని తెలుగు ప్రజల ద్రోహి అని ఎందుకు అనకూడదని ప్రశ్నించారు. రాష్ట్రానికి ఇంతటి అనర్థం చేసిన వ్యక్తి ముఖ్యమంత్రి అయ్యాడని, పోలవరానికి సంబంధించి చంద్రబాబు చేయని తప్పంటూ లేదని ఘాటుగా విమర్శించారు.

# ఏపీ నూతన మద్యం పాలసీ ఖరారు..

### రాత్రికి రాత్రే నోటిఫికేషన్ జారీ




**విశ్వంభర, అమరావతి:** ఏపీలో నూతన మద్యం పాలసీ ఖరారైంది. రెండేళ్ల కాలపరిమితితో కొత్త పాలసీకి సోమవారం అర్ధరాత్రి తర్వాత నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఈ ఏడాది అక్టోబర్ 12వ తేదీ నుంచి 2026 సెప్టెంబర్ 30 వరకు ఈ పాలసీ అమలులో ఉండనుంది.ఈనేపథ్యంలో రాష్ట్రంలోని మొత్తం 3396 మద్యం షాపుల లైసెన్సుల కోసం దరఖాస్తులను ఆహ్వానించింది.ఏపీ స్టేట్ బేవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ నడుపుతున్న ప్రభుత్వ మద్యం షాపుల గడువు సోమవారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో కొత్త విధానం అమలులోకి వచ్చేంత వరకు ప్రస్తుతం ఉన్న మద్యం షాపులు యథాతథంగా కొనసాగనున్నాయి.కొత్త మద్యం షాపుల కోసం నేటి నుంచి ఈ నెల 9వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చు. ఒకే వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా పెట్టుకోవచ్చు.ఒక్కో దరఖాస్తుకు రూ.2లక్షల చొప్పున నాన్ రిఫండబుల్ రుసుము చెల్లించాలి. డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా బ్యాంకు చలానా ద్వారా దరఖాస్తు రుసుము చెల్లించాల్సి ఉంటుంది. డీడీ తీసుకుని నేరుగా ఎక్సైజ్ స్టేషన్లలో అందించాలి. ఈ నెల 11వ తేదీన జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో లాటరీ తీసి, లైసెన్సులను కేటాయిస్తారు. ఈ నెల 12 నుంచి లైసెన్స్‌దారులు కొత్త మద్యం షాపులను ప్రారంభించుకోవచ్చు.

# ఏపీ విద్యార్థులకు రేపటి నుంచి దసరా సెలవులు



**విశ్వంభర, అమరావతి:** దసరా సెలవులపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెల 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకు దసరా సెలవులను ప్రకటించింది. ముందుగా ఈ నెల 4వ తేదీ నుంచి సెలవులు ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. అయితే విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేయడంతో ఒక్క రోజు ముందు నుంచే సెలవులు ఇచ్చింది.ఇక అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతి ఎలాగూ పబ్లిక్ హాలీడే కావడంతో ఏపీ స్కూళ్లకు రేపటి నుంచే సెలవులు రానున్నాయి. అంటే దాదాపు 12 రోజుల పాటు దసరా సెలవులు ఉండనున్నాయి.దీంతో అక్టోబర్ 14వ తేదీ నుంచి స్కూళ్లు పునఃప్రారంభం కానున్నాయి. ఈ మేరకు అన్ని విద్యాసంస్థలకు ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దసరా సెలవుల్లో ఎలాంటి ప్రత్యేక తరగతులు నిర్వహించకూడదని తెలిపింది. ఒకవేళ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది.బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో తెలంగాణలో అక్టోబర్ 2 నుంచి 14వ తేదీ వరకు విద్యార్థులకు దసరా సెలవులు ప్రకటించారు. అక్టోబర్ 15వ తేదీన పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి.

# అరసవల్లి ఆలయంలో ఆదిత్యుని పాదాలు తాకిన సూర్యకిరణాలు



**విశ్వంభర, శ్రీకాకుళం:** ఆంధ్రప్రదేశ్‌లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి దేవాలయంలో శ్రీ సూర్యనారాయణ స్వామి మూలవిరాట్‌ను సూర్యకిరణాలు తాకాయి. లేలేత కిరణాలు పంచద్వారాలను దాటి గాలిగోపురం మధ్య నుంచి ఆదిత్యుని తాకిన దృశ్యాలను చూసి భక్తులు పులకించిపోయారు. మంగళవారం ఉదయం 6.05 గంటలకు కొన్ని నిమిషాలపాటు ఆవిష్కృతమైన ఈ అద్భుతాన్ని వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారురు. బుధవారం కూడా స్వామివారి మూలవిరాట్‌ను సూర్యకిరణాలు తాకే అవకాశం ఉందని పండితులు తెలిపారు. ఏటా రెండు సార్లు ఇలాంటి అద్భుతం ఆవిష్కృతమవుతుంది. ప్రతిఏటా మార్చి 9, 10 తేదీల్లో.. అలాగే అక్టోబర్ నెల 1, 2 తేదీల్లో భక్తులకు కనువిందు చేస్తుంది.ఆదిత్యుని విగ్రహంపై పడిన లేలేత కిరణాలు దర్శనమివ్వడంతో జన్మధన్యమైందంటూ భక్తులు సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు. సూర్యకిరణాలు తాకే సమయానికి సూర్యనారాయణమూర్తిని దర్శించుకుంటే అంతా మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం. ఎప్పటినుంచో ఈ అద్భుతాన్ని చూడాలనుకున్నామని.. ఇప్పుడు ఆ భాగ్యం తమకు దక్కడం సంతోషంగా ఉన్నదని చెప్తున్నారు పలువురు భక్తులు.

# కాదేదీ రాజకీయానికి అతీతం: అంబటి రాంబాబు

### ఏపీ సీఎం చంద్రబాబుపై సెటైర్లు



**విశ్వంభర, అమరావతి:** తిరుమల శ్రీవారి లడ్డూ వివాదంలో ఏపీ సీఎం చంద్రబాబు వైఖరిని సుప్రీంకోర్టు తప్పుబట్టిన నేపథ్యంలో మాజీ మంత్రి అంబటి సెటైర్లు వేశారు. చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్‌పై వ్యంగ్యంగా స్పందించారు. కాదేదీ రాజకీయానికి అతీతమని ట్విట్టర్ వేదికగా విమర్శించారు. వరదలో పడవ, లడ్డూ ప్రసాదం, ముంబై నటి.. కాదేదీ చంద్రబాబు రాజకీయానికి అతీతమని సెటైర్ వేశారు. లడ్డూ ప్రసాదం విషయంలో రాజకీయ ఆరోపణలు చేసి లడ్డూలా దొరికిపోయాడని ఎద్దేవా చేశారు.

# ఈ సమయంలో పబ్లిక్ మీటింగ్ పెట్టడం తగునా..

### పవన్ కల్యాణ్ తీరును తప్పుబట్టిన తిరుపతి ఎంపీ



**విశ్వంభర, అమరావతి:** ప్రాయశ్చిత్త దీక్షలో భాగంగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తిరుమల పర్యటనకు రావడాన్ని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి విమర్శలు గుప్పించారు. తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ అంశంపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతుండగా.. భక్తులను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారా? అని నిలదీశారు. దేవుడిని రాజకీయాల్లోకి లాగడం పట్ల ఏపీ సీఎం చంద్రబాబును తప్పుబట్టిన విషయాన్ని ప్రస్తావించిన ఆయన.. బహిరంగ సభ నిర్వహించడం న్యాయమేనా అని ప్రశ్నించారు.తిరుపతి శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ అంశంపై సుప్రీంకోర్టు స్పందించిన తీరు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తప్పుడు, నిరాధార ఆరోపణలకు చెంపపెట్టు అని తిరుపతి ఎంపీ మద్దిల్ల గురుమూర్తి విమర్శించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు కలిపిన నెయ్యి వాడారని చంద్రబాబు చేసిన ఆరోపణలపై సుప్రీంకోర్టు ఆగ్రహం చేసిందన్న విషయం ప్రస్తావించారు. రాజకీయాల్లోకి దేవుడిని లాగొద్దని వ్యాఖ్యానించడం చంద్రబాబుకు మరో ఎదురుదెబ్బ అని విమర్శించారు. అత్యంత పవిత్రమైన తిరుమల వేంకటేశ్వర స్వామి వారిని, ఆయన ప్రసాదాలను రాజకీయ లబ్ధి కోసం అనవసరంగా వివాదంలోకి లాగి వైసీపీ, వైఎస్ జగన్‌పై దుష్ప్రచారం చేయాలని చంద్రబాబు చేసిన ప్రయత్నం విఫలమైందని అన్నారు.ఇది కేవలం ఆరంభం మాత్రమేనని తెలిపారు. సుప్రీంకోర్టు జోక్యంతో తిరుపతి బాలాజీ లడ్డూ కల్తీపై చంద్రబాబు చేసిన బూటకపు ఆరోపణలు త్వరలోనే బహిర్గతమవుతాయని పేర్కొన్నారు. సరైన విచారణ లేకుండా తప్పుడు ఆరోపణలు చేసినందుకు చంద్రబాబుకు సుప్రీంకోర్టు చివాట్లు పెట్టిన విషయాన్ని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు తిరుపతి ఎంపీ గురుమూర్తి గుర్తుచేశారు. అత్యంత సున్నితమైన ఈ విషయం సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నప్పుడు ప్రాయశ్చిత్త దీక్ష చేయడం, తిరుపతిలో బహిరంగ సభ నిర్వహించడం న్యాయమేనా అని ప్రశ్నించారు. హిందువుల మనోభావాలను మరోసారి దెబ్బతీయడం సమంజసం అనుకుంటున్నారా? అని నిలదీశారు. మీ ముఖ్యమంత్రిలా మీరు కూడా తిరుపతి లడ్డూ ప్రసాదం విషయంలో ప్రజలు, భక్తులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారా? అని ప్రశ్నించారు.

# ఒప్పంద కార్మికుల ఆందోళన..

### విశాఖ స్టీల్ ప్లాంట్ వద్ద ఉద్రిక్తత



విశ్వంబర, విశాఖపట్నం: విశాఖ స్టీల్ ప్లాంట్ వద్ద ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. 4200 మంది ఒప్పంద కార్మికుల తొలగింపుపై పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. ఈడీ వర్క్స్ భవనాన్ని ఒప్పంద కార్మికులు ముట్టడించారు. కుటుంబాలతో కలిసి ఆందోళనకు దిగారు. దీంతో ఇక్కడ భారీగా పోలీసులు, సీఐఎస్ఎఫ్ బలగాలు మోహరించాయి.

# కేంద్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిపినా అభ్యంతరం లేదు

### మంత్రి డీబీవీ స్వామి



**విశ్వంభర, సూరారెడ్డిపాలెం:** తిరుమల శ్రీవారి లడ్డూ నెయ్యిలో కల్తీ జరిగిన మాట వాస్తవమని ఏపీ మంత్రి డోలా బాల వీరాంజ నేయ స్వామి అన్నారు. ప్రకాశం జిల్లా సూరారెడ్డిపాలెంలో నిర్వ హించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొ న్నారు. పలువురు లబ్దిదారులకు పింఛన్లు అందజే శారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడు తూ కల్తీ నెయ్యి ఘటనపై కేంద్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించినా తమకు అభ్యంతరం లేదన్నా రు. న్యాయవ్యవస్థను గౌరవిస్తున్నట్లు చెప్పారు.

# రోహిత్ సేన ఘన విజయం

## రోహిత్‌ను ప్రశంసించిన బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్..





**కాన్పూర్ :** టీమిండియా కాన్పూర్‌లో బంగ్లాదేశ్‌తో జరిగిన రెండో టెస్ట్ మ్యాచ్‌లో ఘన విజయం సాధించింది. తొలి మూడు రోజులు వర్షం కారణంగా నిరాశలో ఉన్నా క్రికెట్ అభిమానులకు కిక్కు ఇచ్చేలా టీమిండియా ఆటగాళ్లు అదరగొట్టాడు. మొదటి నుంచి సంచలన నిర్ణయాలతో టీమిండియా అందరీ దృష్టిని ఆకర్షించింది. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకొని రోహిత్ సేన సంచలన నిర్ణయం తీసుకుంది. ఆ తర్వాత భారత్ 4వ రోజు 285/9 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. ఈ మ్యాచ్‌లో గెలవడం కోసం భారత్ కఠిన నిర్ణయాలు తీసుకుంది. రిస్క్ తీసుకొని మ్యాచ్‌ను టీమిండియా ఆటగాళ్లు గెలిపించారు. ఇక టీమిండియా ఆటగాళ్లు బ్యాటింగ్ ఊచకోతే అని చెప్పాలి. కేఎల్ రాహుల్, విరాట్, జైశ్వల్ అద్భుతంగా ఆడారు. కాగా రెండో టెస్ట్ మ్యాచ్‌లో బంగ్లాపై భారత్ ఘన విజయం సాధించిన సందర్భంగా కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ రోహిత్ శర్మను బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టెస్ట్ మ్యాచ్‌ను టీ20లా మార్చడం అంతా ఈజీ కాదన్నారు. అలా మర్చాలంటే చాలా రిస్క్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రోహిత్ నాయకుడిగా అద్భుతంగా లీడ్ చేసినట్లు కొనియాడారు. నాయకుడు అనే వాడు ముందు ఉండి నడిపించాలని, దానికి రోహిత్ సెట్ అవుతాడన్నారు. తాము గౌతమ్ గంభీర్ మ్యాచ్‌ను త్వరగా పూర్తి చేయాలని అనుకున్నట్లు చెప్పారు. కానీ దాన్ని నడిపించడానికి సరైన నాయకుడు అవసరమన్నారు. అలా రోహిత్ టీమ్‌ను లీడ్ చేస్తాడని ప్రశంసించారు. తన తొలి బంతినే రోహిత్ సిక్స్ బాదినట్లు చెప్పారు. ఫాస్ట్ బంతికే షాట్ ఆడడం చాలా డేంజర్ అయిన రోహిత్ దూకుడితో ఆడాడని చెప్పారు. ఓపెనర్లు చాలా బాగా ఆడినట్లు చెప్పారు. దూకుడిగా ఆడాలంటే ముందు కెప్టెన్ దూకుడిగా ఉంటేనే సాధ్యమవుతుందన్నారు. రోహిత్ ఆటలో దూకుడిని కొనిసాగించి టీమ్‌ను లీడ్ చేసినట్లు పేర్కొన్నారు. చాలా మంది రోహిత్ ఫిట్‌గా లేడని కామెంట్స్ చేస్తున్నారని, కానీ వాటిని రోహిత్ అస్సలు పట్టించుకోడన్నారు. రోహిత్ ఎప్పుడు జిమ్‌లో శ్రమిస్తాడన్నారు. గంభీర్‌తో పాటు రోహిత్ సఫలమైనట్లు చెప్పారు. రోహిత్‌కు టీమ్‌ను లీడ్ చేసే సత్తా ఉందని ప్రశంసించారు. గంభీర్ ప్లాన్‌ను సమర్థవంతంగా రోహిత్ అమలు చేసినట్లు చెప్పారు.

## బంగ్లా ఆల్‌రౌండర్‌కు విరాట్ బహుమతి




**కాన్పూర్ :** బంగ్లాదేశ్ స్టార్ ఆల్ రౌండర్ షకిబ్ అల్ హసన్ భారత్‌తో తన చివరి టెస్టు మ్యాచ్ ఆడేశాడు. కాన్పూర్ వేదికగా భారత్, బంగ్లా మధ్య జరిగిన రెండో టెస్టు అతడికి భారత్‌తో చివరి మ్యాచ్. రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ తుఫాన్‌లా విరుచుకుపడ్డ విరాట్ కోహ్లీ మ్యాచ్ ముగియగానే ప్రత్యర్థి ఆటగాళ్లను కలిశాడు. ఓటమి బాధలో ఉన్న బంగ్లాదేశ్ మాజీ కెప్టెన్ షకీబుల్ హసన్‌ను ఓదార్చాడు. కోహ్లీ షకిబ్‌కు ఓ ప్రత్యేక బహుమతి అందించాడు. ఇరు జట్ల ఆటగాళ్లు మాట్లాడుకుంటున్న సమయంలో షకిబ్ దగ్గరకు వెళ్లి తాను సైన్ చేసిన బ్యాట్‌ను అతడికి గిఫ్ట్‌గా ఇచ్చాడు. ఆ తర్వాత ఈ ఇద్దరు కాసేపు సరదాగా మాట్లాడుకున్నారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు నెట్టింట తెగ ట్రెండ్ అవుతోంది.

## కోహ్లీని హగ్ చేసుకున్న గంభీర్




**కాన్పూర్ :** బంగ్లాదేశ్‌తో రెండు టెస్ట్‌ల సిరీస్‌ను టీమిండియా 20తో క్లీన్ స్వీప్ చేసింది. కాన్పూర్ వేదికగా జరిగిన రెండో టెస్ట్‌లో అసాధారణ ప్రదర్శన కనబర్చిన భారత్.. ఈ మ్యాచ్‌లో టీమిండియా అటాకింగ్ గేమ్‌తో విజయాన్నందుకుంది. టీమిండియా నయా హెడ్ కోచ్ గౌతం గంభీర్ వ్యూహాత్మక నిర్ణయాలతో ఆశించిన ఫలితాన్ని సాధించింది. ఈ సిరీస్ గెలుపుతో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025 పాయింట్స్ టేబుల్‌లో తమ అగ్రస్థానాన్ని పదిలం చేసుకుంది. ఈ విజయంపై భారత ఆటగాళ్లు సంతోషం వ్యక్తం చేశారు. మ్యాచ్ ముగిసిన క్షణం ఒకరినొకరు హగ్ చేసుకుంటూ విషెస్ చెప్పుకున్నారు. టీమిండియా నయా హెడ్ కోచ్ గౌతం గంభీర్.. కోహ్లీని హగ్ చేసుకొని అతన్ని ప్రత్యేకంగా అభినందించాడు. ఈ దృశ్యం నెటిజన్లు ఆకట్టుకుంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ కాగా.. మూమెంట్ ఆఫ్ ది డే అంటూ ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు. గతంలో విరాట్ కోహ్లీ, గౌతం గంభీర్‌లు మైదానంలోనే చాలా సార్లు గొడవపడ్డారు. అంతేకాకుండా సమయం దొరికినప్పుడల్లా గంభీర్.. కోహ్లీపై విమర్శలు గుప్పించేవాడు. ఐపీఎల్ 2023 సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్ మెంటార్‌గా ఉన్న గంభీర్.. విరాట్ కోహ్లీతో మైదానంలోనే గొడవపడ్డాడు.

ఈ ఇద్దరూ ఒకరిపై ఒకరు దూసుకెళ్లడం.. తిట్టుకోవడం అప్పట్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఏడాది తర్వాత ఈ గొడవకు గంభీరే ముగింపు పలికాడు. ఐపీఎల్ 2024 సీజన్ సందర్భంగా.. విరాట్ కోహ్లీని ప్రత్యేకంగా పలకరించి అతనితో మాటలు కదిపాడు. కోహ్లీ సైతం సానుకూలంగా స్పందించడంతో ఈ ఇద్దరూ పాత గొడవలు మరిచి సన్నిహితులుగా కొనసాగుతున్నారు.

"టెస్ట్ ఫార్మాట్ సీజన్‌ను టీమిండియా ఘనంగా ప్రారంభించింది. 45 రోజుల సుదీర్ఘ విశ్రాంతి తర్వాత.. బంగ్లాదేశ్‌తో సొంతగడ్డపై జరిగిన రెండు టెస్ట్‌ల సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకుంది. ఫలితం తేలడం కష్టమనుకున్న రెండో టెస్ట్‌లో అసాధారణ ప్రదర్శనతో విజయాన్నందుకుంది. ఈ మ్యాచ్‌లో వర్షం కారణంగా రెండున్నర రోజుల ఆట పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. దాంతో ఫలితం తేలడం కష్టమని అంతా అనుకున్నారు. కానీ టీమిండియా అటాకింగ్ గేమ్‌తో ఏకపక్ష విజయాన్ని సాధించింది. బౌలర్ల అసాధారణ ప్రదర్శన, బ్యాటర్ల రిస్క్ అటాకింగ్ గేమ్ టీమిండియాకు కలిసొచ్చింది.




- బంగ్లాతో టెస్టు సిరీస్ క్లీన్‌స్వీప్
- 7 వికెట్ల తేడాతో విక్టరీ సాదించిన టీంఇండియా
- 2-0 తేడాతో సిరీస్ భారత్ కైవసం

**కాన్పూర్ :** బంగ్లాతో రెండు టెస్టుల సిరీస్‌ను భారత్ క్లీన్ స్వీప్ చేసింది. కాన్పూర్ వేదికగా తాజాగా జరిగిన రెండో టెస్టులోనూ టీమ్‌ఇండియా ఘన విజయం సాధించింది. 95 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన రోహిత్ సేన 3 వికెట్లు మాత్రమే కోల్పోయి టార్గెట్‌ను ఛేదించింది.

టెస్టు క్రికెట్‌లో బజ్ బాల్ ఎఫెక్ట్ ఎలా ఉంటుందో అందరికీ తెలిసిందే. ఇంగ్లండ్ కోచ్ బ్రెండమ్ మెక్కల్లమ్ పరిచయం చేసిన ఈ దూకుడును భారత జట్టు కూడా బాగా వంట బట్టించుకుంది. ఇప్పుడు ఆ దూకుడుతోనే డ్రాగా ముగియాల్సిన మ్యాచ్‌లో టీమిండియా అద్భుత విజయం సాధించింది. కాన్పూర్‌లోని గ్రీన్ పార్క్ వేదికగా భారత్‌బంగ్లాదేశ్ మధ్య జరుగుతున్న 2వ టెస్టు డ్రాగా ముగుస్తుందని అందరూ భావించారు. ఎందుకంటే వర్షం కారణంగా ఈ మ్యాచ్‌లో మొదటి రోజు కేవలం 35 ఓవర్లు ఆట మాత్రమే జరిగింది. 2వ, 3వ రోజుల ఆట కూడా పూర్తిగా తుడిచి పెట్టుకుపోయింది. ఇక నాలుగో రోజు ఆటలో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లాదేశ్ జట్టు 233 పరుగులకు ఆలౌటైంది. దీని తర్వాత ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమ్ ఇండియా ధనాధన్ బ్యాటింగ్ తో టెస్టు క్రికెట్ లెక్కలను తలకిందులు చేసింది.

**మ్యాచ్ సాగిందిలా :**

తొలి రోజు కేవలం 35 ఓవర్లే పడగా, వర్షం కారణంగా మ్యాచ్ రెండు రోజుల పాటు రద్దయ్యింది. దీంతో ఫలితం ఎటువైపు వస్తుందో అన్న తరుణంలో బంగ్లాను రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ ఆలౌట్ చేసి రోహిత్ సేన చెలరేగిపోయింది. దీంతో కేవలం 95 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమ్‌ఇండియా మూడు వికెట్లను మాత్రమే కోల్పోయి సిరీస్‌ను కైవసం చేసుకుంది.

ఓపెనర్ కమ్ కెప్టెన్ అయిన రోహిత్ శర్మ (8), ఇక రెండో ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (6) విఫలమైనప్పటికీ, ఆ తర్వాత బరిలోకి దిగిన యశస్వి జైస్వాల్ (51), విరాట్ కోహ్లీ (29*) అద్భుతంగా రాణించారు. అయితే మరో మూడు పరుగులు అవసరం అన్న సమయంలో, యశస్వి జైస్వాల్ భారీ షాట్‌కు యత్నించి ఔటయ్యాడు. ఆ తర్వాత రిషభ్ పంత్‌తో (4*) కలిసి కోహ్లీ మరో వికెట్ కూడా పడనీయకుండానే జట్టును గెలిపించారు. అంతకుముందు జరిగిన రెండో ఇన్నింగ్స్‌లో బంగ్లా 146 పరుగులకే ఆలౌటైంది. మొదటి ఇన్నింగ్స్‌లో బంగ్లా 233 పరుగులు చేయగా, అందులో భారత్ 285/9 స్కోరు వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. దీంతో రెండు టెస్టుల సిరీస్‌ను భారత్ 20 తేడాతో క్లీన్ స్వీప్ చేసింది.

ఇక ఈ విజయంతో స్వదేశంలో వరుసగా 18వ సిరీస్‌ను భారత్ గెలిచినట్లు అయింది. యశస్వి జైస్వాల్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలవగా, రవిచంద్రన్ అశ్విన్ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డును కైవసం చేసుకున్నారు. ఈ సిరీస్ విజయంతో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో టాప్‌లో ఉన్న టీమ్‌ఇండియా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. రాబోయే ఎనిమిది టెస్టుల్లో మరో మూడు గెలిచినా భారత్ టాప్2లో ఉండి ఫైనల్‌కు చేరడం ఖాయం.

### చరిత్ర సృష్టించిన టీమిండియా..

టెస్ట్ క్రికెట్‌లో టీమిండియా చరిత్ర సృష్టించింది. 147 ఏళ్ల టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి అత్యధిక రన్‌రేట్ నమోదు చేసిన తొలి జట్టుగా చరిత్రకెక్కింది. బంగ్లాదేశ్‌తో కాన్పూర్ వేదికగా జరిగిన రెండో టెస్ట్‌తో రోహిత్ శర్మ సారథ్యంలోని టీమిండియా ఈ ఫీట్ సాధించింది. ఫలితం అసాధ్యమనుకున్న ఈ మ్యాచ్‌లో అటాకింగ్ అప్రోచ్‌తో టీమిండియా సంచలన విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లో టీమిండియా 7.36 రన్ రేట్ నమోదు చేసింది. ఈ క్రమంలో సౌతాఫ్రికా రికార్డ్‌ను బద్దలు కొట్టింది.




**సఫారీ రికార్డ్ బ్రేక్..**

2005లో జింబాబ్వేతో కేప్‌టౌన్ వేదికగా జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో సౌతాఫ్రికా రెండు ఇన్నింగ్స్‌ల్లో 6.80 రన్ రేట్ నమోదు చేసింది. ఇప్పటి వరకు ఇదే హయ్యెస్ట్ కాగా.. తాజాగా భారత్ 7.36 రన్‌రేట్‌తో అధిగమించింది. ఈ జాబితాలో ఇంగ్లండ్(6.73), (6.43), (5.73) రన్ రేట్స్‌తో తర్వాతి స్థానాల్లో కొనసాగుతోంది.

2022లో రావల్పిండి వేదికగా పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ 6.73 రన్ రేట్ నమోదు చేసింది. 2023లో లార్డ్స్ వేదికగా ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ రెండు ఇన్నింగ్స్‌ల్లో 6.43 రన్ రేట్, 2005లో బంగ్లాదేశ్‌తో 5.73 రన్ రేట్‌తో పరుగులు చేసింది.

**నాలుగో జట్టుగా భారత్..**

టెస్ట్‌ల్లో అత్యధిక విజయాలు సాధించిన నాలుగో జట్టుగా టీమిండియా నిలిచింది. 180 విజయాలతో ఈ జాబితాలోని సౌతాఫ్రికాను వెనక్కినెట్టింది. 414 విజయాలతో ఆస్ట్రేలియా అగ్రస్థానంలో ఉండగా.. 397 విజయాలతో ఇంగ్లండ్, 183 విజయాలతో వెస్టిండీస్ భారత్ కంటే ముందున్నాయి.

**అత్యధిక సిరీస్ విజయాలు..**

సొంతగడ్డపై వరుసగా అత్యధిక టెస్ట్ సిరీస్‌లు గెలిచిన జట్టుగానూ టీమిండియా రికార్డ్ సాధించింది. 2013 నుంచి 2024 మధ్య టీమిండియా వరుసగా 18 టెస్ట్ సిరీస్‌లను కైవసం చేసుకుంది. ఈ జాబితాలో భారత్ తర్వాత ఆస్ట్రేలియా(19942000 మధ్య 10 టెస్ట్ సిరీస్ విజయాలు), (20042008 మధ్య 10 టెస్ట్ సిరీస్ విజయాలు) ఉండగా.. వెస్టిండీస్(19761986 మధ్య 8 సిరీస్ విజయాలు), న్యూజిలాండ్(20172020 మధ్య 8 సిరీస్ విజయాలు) నాలుగు, ఐదో స్థానాల్లో కొనసాగుతున్నాయి.

## భారత్ ఫాస్టెస్ట్ 50 రికార్డు

కాన్పూర్ వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన రెండో టెస్టులో టీమ్‌ఇండియా మరో రికార్డు సృష్టించింది. టెస్టు ఫార్మాట్‌లో వేగంగా 50, 100 పరుగులు చేసిన జట్టు గా భారత్ అవతరించింది. కేవలం 18 బంతుల్లోనే టీమ్‌ఇండియా 50 పరుగులు చేసేసింది. అలాగే 10.1 ఓవర్లలోనే 100 రన్స్ చేసి అరుదైన రికార్డును ఖాతాలో వేసుకుంది. అలాగే టెస్టు క్రికెట్‌లో అత్యంత వేగంగా 50, 100, 150, 200, 250 పరుగులను నమోదు చేసిన జట్టుగా టీమ్‌ఇండియా నిలిచింది. కాగా, 2023లో వెస్టిండీస్‌తో పోర్ట్ ఆఫ్ స్పెయిన్ వేదికగా జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 12.2 ఓవర్లలో 100 పరుగులు తీసింది. తాజాగా బంగ్లాతో జరిగిన మ్యాచ్‌లో ఆ రికార్డును బద్దలుగొట్టింది. ఈ క్రమంలో టెస్టుల్లో ఫాస్ట్‌గా 50, 100 పరుగులు చేసిన మరికొన్ని జట్ల గురించి తెలుసుకుందాం పదండి.

**ఫాస్టెస్ట్ 100 పరుగులు చేసిన జట్లు..**

**శ్రీలంక**

2001లో కొలంబో వేదికగా బంగ్లాదేశ్ తో జరిగిన టెస్టు మ్యాచ్ లో శ్రీలంక జట్టు అదరగొట్టింది. కేవలం 13.2 ఓవర్లలోనే శతకం బాదింది.

**ఇంగ్లాండ్**

అయితే 1994లో ఓవల్ వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లాండ్ జట్టు దూకుడు ప్రదర్శించింది. 13.2 ఓవర్లలోనే 100 పరుగుల చేసి రికార్డు సృష్టించింది.

**బంగ్లా..**

2012లో మిర్పూర్ వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో బంగ్లా జట్టు విధ్వంసం సృష్టించింది. దీంతో 13.4 ఓవర్లలోనే జట్టు స్కోరు 100కు చేరుకుంది.

**2022లో ఇంగ్లాండ్**

2022లో రావల్పండిలో ఇంగ్లాండ్, పాకిస్థాన్ జట్లు ఓ టెస్టు మ్యాచ్‌లో తలపడ్డాయి. అందులో ఇంగ్లాండ్ జట్టు 13.4 ఓవర్లలో 100 పరుగులు చేసింది.

**అతిథ్య జట్టుకు షాక్**

2002లో కరాచీ వేదికగా పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లాండ్ జట్టు దూకుడు ప్రదర్శించింది. దీంతో కేవలం 13.4 ఓవర్లలోనే ఇంగ్లీష్ జట్టు స్కోరు 100కు చేరింది.

**ఫాస్టెస్ట్ 50 చేసిన జట్లు**

2024లో కాన్పూర్ వేదికగా బంగ్లాతో జరిగిన మ్యాచ్‌లో టీమ్‌ఇండియా కేవలం 18 బంతుల్లోనే 50 పరుగులు చేసేసింది. దీంతో టెస్టుల్లో అత్యంత వేగంగా 50 పరుగులు చేసిన జట్టుగా రోహిత్ సేన అవతరించింది.

2024లో విండీస్ జట్టుపై ఇంగ్లాండ్ 26 బంతుల్లో 50 పరుగులు చేసింది. ఆ రికార్డును టీమ్‌ఇండియా తాజాగా బద్దలుకొట్టింది.

ఇక 1994లో సౌతాఫ్రికాపై ఇంగ్లాండ్ టీమ్ 27 బంతుల్లో ఫిఫ్టీ చేసింది.

ఇ లాగే 2002లో శ్రీలంకపై ఇంగ్లాండ్ 30 బంతుల్లో 50 రన్స్ చేసింది.

అయితే 2004లో పాకిస్థాన్‌పై శ్రీలంక 32 బంతుల్లోనే 50 పరుగులు బాదింది.

ఇవి కాకుండా 2008లో ఇంగ్లాండ్‌పై టీమ్ ఇండియా 33 బంతుల్లోనే 50 రన్స్ చేసింది.

అలాగే 2023లో విండీస్ జట్టుపై భారత్ 33 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేసింది.

## రేపటి నుంచే మహిళల టీ20 వరల్డ్ కప్




**విశ్వంభర, క్రీడావిభాగం :** టీ 20 వరల్డ్ కప్‌లో టీమ్ ఇండియా విజయం సాధించడం తో అభిమానుల సంబరా లు మిన్నంటాయి అన్న సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడు అమ్మాయిల వంతు వచ్చింది. వారు ధనా ధన్ ఇన్నింగ్స్ ఆడేందుకు రంగం సిద్ధమై పోయింది.

మహిళల టీ 20 వరల్డ్ కప్ గురువారం(అక్టోబర్ 3) గ్రాండ్‌గా ప్రారంభం కానుంది. అసలే గత కొంత కాలంగా మహిళల క్రికెట్ పం జుకుని, ఆక ర్షణీయంగా మారింది. క్రికెట్ అభిమానుల దృష్టిని కూడా బాగానే ఆకర్షిస్తోంది. టీ 20ల్లో వారు ఆడే స్టేడియాలు కూడా నిండిపోతున్నాయి. టీవీ సెట్ల ముందు కూడా పర్వాలేదనిపించే సందడి కనిపిస్తోంది.

దీంతో యూఈఏ వేదికగా గురువారం ప్రారంభం కానున్న టీ20 పొట్టి కప్పుపై కూడా అభిమానులు ఆసక్తి చూపిస్తున్నారు. ఇప్పటి వరకు ఏ ఫార్మాట్‌లోనూ భారత మహిళల జట్టు ప్రపంచ కప్ సాధించలేకపోయింది. కానీ ఈ సారి ఎలాగైనా కప్ సాధించాలనే పట్టుదలతో ఉంది.

2020లో మొదటి సారి టీ 20 వరల్డ్ కప్ ఫైనల్ చేరింది భారత్. కానీ అనూహ్యంగా ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోయింది. తమ దేశ పురుషుల జట్టును కన్నా క్రికెట్లో ఆధిపత్యం చలాయిస్తున్న ఆసీస్ మహిళల జట్టు ఇప్పటి వరకు ఆరు సార్లు విశ్వ విజేతగా నిలిచింది. అందుకే ఈ సారి కూడా ఆ జట్టు ఫేవరెట్‌గానే బరిలోకి దిగనుంది. అయితే భారత జట్టు కూడా మునుపెన్నడూ లేనంత బలంగా, ఆల్‌రౌండ్ నైపుణ్యంతో బరిలోకి దిగుతోంది. కాబట్టి ఈ సారి మన అమ్మాయిలు కూడా కప్ గెలిచే అవకాశముందని విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఇంకా ఇంగ్లాండ్, సౌతాఫ్రికా జట్లు కూడా టైటిల్ ఫేవరెట్‌గానే బరిలోకి దిగుతున్నాయి.

ఇప్పటిదాకా జరిగిన మహిళల టీ20 ప్రపంచకప్‌లు 8. ఆస్ట్రేలియా ఆరుసార్లు (2010, 2012, 2014, 2018, 2020, 2023) విజేతగా నిలిచింది. ఇంగ్లాండ్ (2009), వెస్టిండీస్ (2016) ఒక్కో టైటిల్ సాధించాయి.

టోర్నీలో 10 జట్లు పోటీ పడుతున్నాయి. అయిదేసి జట్లు రెండు గ్రూప్‌లుగా విడిపోయి మిగతా జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడతాయి. రెండు గ్రూప్‌ల నుంచి లీగ్ దశలో టాప్2 జట్లు సెమీస్‌కు వెళ్తాయి.

టోర్నీకి దుబాయ్, షార్జా మైదానాలు ఆతిథ్యమిస్తున్నాయి. ఈ నెల 20న దుబాయ్‌లో ఫైనల్ జరుగుతుంది. గ్రూప్‌ఏలో ఉన్న భారత్, పాకిస్థాన్ ఈ నెల 6న తలపడనున్నాయి.

## అక్టోబర్ 3న థార్ రాక్స్ బుకింగ్స్ ప్రారంభం




**విశ్వంభర, బిజినెస్ :** మహీంద్రా అండ్ మహీంద్రా ఇటీవల మార్కెట్లో ఆవిష్కరించిన ఆఫ్ రోడ్ ఎస్‌యూవీ 5డోర్ థార్ రాక్స్ కోరులో కొత్త ఫీచర్ జత చేసింది. 4×4 వేరియంట్లకు డార్కర్ మోకా ఇంటీరియర్ ఆప్షన్ జత చేశారు. ఎంఎక్స్ 5 ట్రిమ్ వేరియంట్ లోనూ ఈ ఆప్షన్ లభిస్తుంది. అయితే బుకింగ్ సమయంలోనే కస్టమర్లు రెండు ఇంటీరియర్ ఆప్షన్లను ఎంచుకోవాల్సి ఉంటుంది. అయితే, మోకా ఇంటీరియర్ ఆప్షన్ ఎంచుకున్న కస్టమర్లు అదనంగా ఏమీ చెల్లించాల్సిన అవసరం లేదు. ఆన్‌లైన్ బుకింగ్‌లు ప్రారంభం కాకముందే ఈ కారుకు ఫుల్ క్రేజ్ ఏర్పడింది. ప్రస్తుతం ఆన్‌లైన్ బుకింగ్‌ల కోసం చాలామంది వెలయికళ్లతో ఎదురుచూస్తున్నారు. అలాంటి వారికి ఓ శుభవార్త. అక్టోబర్ 3న ఉదయం 11 గంటలకు థార్ రాక్స్ ఆన్‌లైన్ బుకింగ్‌లు ప్రారంభం కానున్నాయి. ఈ విషయాన్ని కంపెనీ తన ఎక్స్ ఖాతా ద్వారా ప్రకటించింది. దసరా నుంచి డెలివరీలు మొదలవుతాయని పేర్కొంది.

థార్ రోక్స్ ఎమ్ఎక్స్5 ఎంటీ 4డబ్ల్యూడీ - రూ. 18.79 లక్షలు

థార్ రోక్స్ ఎఎక్స్7ఎల్ ఎంటీ 4డబ్ల్యూడీ - రూ. 20.99 లక్షలు

థార్ రోక్స్ ఎఎక్స్5ఎల్ ఏటీ 4డబ్ల్యూడీ - రూ. 20.99 లక్షలు

థార్ రోక్స్ ఎఎక్స్7ఎల్ ఏటీ 4డబ్ల్యూడీ - రూ. 22.49 లక్షలు

## పది రోజుల తరువాత మొదటిసారి తగ్గిన బంగారం ధర

**విశ్వంభర, బిజినెస్ :** పది రోజులుగా పెరుగుతున్న బంగారం ధరలకు బ్రేక్ పడింది. మంగళవారం దేశ రాజధాని ఢిల్లీలో తులం బంగారం (24 క్యారట్స్) ధర రూ.200 తగ్గి రూ.78,100లకు చేరుకున్నది. సోమవారం 24 క్యారట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.78,300 వద్ద ముగిసింది. 99.5 స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.200 తగ్గి రూ.77,700 పలికింది. సోమవారం ఇది రూ.77,900 వద్ద స్థిరపడింది.

కానీ, కిలో వెండి ధర రూ.441 వృద్ధితో రూ.91,160 పలికింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో తులం బంగారం డిసెంబర్ డెలివరీ ధర రూ.347 వృద్ధితో రూ.75,958 పలికింది. శుక్రవారం వెలువడనున్న అమెరికా నాన్ ఫామ్ పే రోల్స్, నిరుద్యోగ డేటాపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. ఇక గ్లోబల్ మార్కెట్లలో ఔన్స్ బంగారం 0.34 శాతం వృద్ధితో 2668.50 వద్ద నిలిచింది. ఔన్స్ వెండి ధర 0.48 శాతం పుంజుకుని 31.61 డాలర్లకు చేరుకున్నది.

# బతుకమ్మ పండుగ తెలంగాణ సాంస్కృతిక చిహ్నం



బతుకమ్మ ఆశ్వయుజ అమావాస్యనాడు ఎంగిలిపూల బతుకమ్మగా ప్రారంభమయ్యే సంబరాలు తొమ్మిదిరోజులపాటు సాగి సద్దుల బతుకమ్మ రోజు గౌరమ్మను సాగనంపడంతో ముగుస్తాయి. ఈ తొమ్మిది రోజుల పాటు మహిళలు చేసే హడావిడి అంతా ఇంతా కాదు. ప్రకృతిలో లభించే ప్రతి పువ్వు ఏరికోరి తెచ్చి, రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, నిత్యం గౌరీదేవిని తమ ఆటపాటలతో పూజిస్తారు. అందరూ కలిసి సంతోషంగా పాటలు పాడుతూ, బతుకమ్మ ఆటలు ఆడతారు. ఒకరు పాడుతుంటే మిగతా వారంతా వారికి వంత పాడతారు. ఎంగిలి పూల బతుకమ్మతో ప్రారంభమయ్యే ఈ వేడుకలు సద్దుల బతుకమ్మతో ముగుస్తాయి. పిత్రు అమావాస్య రోజు పెద్దలను పూజించుకుంటూ, అదే సమయంలో బతుకమ్మలను పేర్చి మహిళలు సంబరాలు జరుపుకుంటారు.

**బతుకమ్మ పూలకు ప్రత్యేకతలెన్నో**

బతుకమ్మ పండుగ జరుపుకోవడానికి ఉపయోగించే పూలకు కూడా ఒక విశేషం ఉంది. ఔషధ గుణాలు ఉన్న పువ్వులను బతుకమ్మలుగా పేర్చడం కోసం ఉపయోగిస్తారు. తంగేడు, గునుగు, బంతి, చేమంతి, కట్ల, సంపెంగ, మొల్ల, సీత జడలు, రుద్రాక్ష, పోక బంతి, మల్లె, మందార, మరువం, పారిజాతం, కమలం, తామర, గన్నేరు గుమ్మడి, గులాబీ, పట్టుకుచ్చులు పూలతో చక్కగా బతుకమ్మలను పేర్చి బతుకమ్మ సంబరాలను జరుపుకుంటారు. బతుకమ్మ సంబరాలలో భాగంగా మహిళలు చక్కగా ముస్తాబై అత్యంత భక్తి శ్రద్ధలతో తయారుచేసిన బతుకమ్మలను తీసుకొని ఆలయాలలో, వీధులలో అందరూ గుంపుగా కూడి సంబరాలు జరుపుకుంటారు. చిన్న, పెద్ద, ముసలి, ముతక తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఈ సంబరాలలో పాలుపంచుకుంటారు. తెలంగాణ సంస్కృతిని, తెలంగాణ గ్రామీణ జీవనాన్ని ప్రతిబింబించేలా జానపదాలను పాడుతూ ఈ పండుగ జరుపుకుంటారు.

**ఆచారాలు, సాంప్రదాయాలు ప్రతిబింబించేలా బతుకమ్మ పాటలు**

ఆచారాలు, సాంప్రదాయాలు ప్రతిబింబించేలా బతుకమ్మ పాటలు ఆచారాలు, సాంప్రదాయాలు, పద్ధతులు తెలిపేలా బతుకమ్మ పాటలను పాడతారు. బతుకమ్మ పాటలలో పురాణ, ఇతిహాస కథలు మొదలుకొని తెలంగాణ వీరుల కథలు, జానపద ఇతివృత్తాలు కూడా ఉంటాయి. ముఖ్యంగా బతుకమ్మ పాటల్లో తెలంగాణ సంస్కృతి ప్రతిబింబిస్తుంది. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ పాడే పాటలు మొదలుకొని ఒక్కేసి పువ్వేసి చందమామ ఒక్క జాములాయె చందమామ, కోసలాదేశుండు నుండి ఉయ్యాలో దశరథ రాముండు ఉయ్యాలో, చిత్తూ చిత్తూల బొమ్మ శివుడీ ముద్దుల గుమ్మ అంటూ పాటలు మహిళల నోటి నుండి జాలువారుతాయి. ఇంత చక్కని, అందరూ సమిష్టిగా జరుపుకునే అందమైన, అద్భుతమైన పండుగ ప్రపంచంలోనే బతుకమ్మ ఒక్కటే అని చెప్పటం తెలంగాణాకే గర్వకారణం.

**పురాణ కథలు**

ఈ పండుగ గురించి అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. చోళరాజు ధర్మాంగదుడు, సత్యవతి దంపతులకు వంద మంది కొడుకులు. వారంతా యుద్ధంలో చనిపోతే దుఃఖంలో ఉండి సంతానం కావాలని లక్ష్మీదేవిని వేడుకుంటారు. ఆమెను తమ బిడ్డగా పుట్టమని కోరుకుంటారు. లక్ష్మీదేవి వారి బిడ్డగా పుడుతుంది. అత్రి, వశిష్ట, కశ్యప, అంగీరస మహామునులు ఆ బిడ్డను 'బతుకమ్మ' అని ఆశీర్వదిస్తారు. ఆమె పెరిగి పెద్దదై చక్రాంగుడనే పేరుతో మారువేషంలో వచ్చిన విష్ణుమూర్తిని పెళ్లాడుతుంది. కోరిన వారందరికీ సంతానం,



సిరిసంపదలను ప్రసాదిస్తూ బతుకమ్మగా పూజలు అందుకుంటోందని ఒక కథ ప్రచారంలో ఉంది. మరో కథనం ప్రకారం, మహిషాసురుడిని యుద్ధంలో వధించిన పార్వతి అలసిపోయి స్పృహ తప్పి పడిపోతుంది. దీంతో మహిళలంతా ఆమె చుట్టూ చేరి 'బతుకమ్మ బతుకమ్మ' అని ప్రార్థిస్తారు. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నాడు దేవి స్పృహలోకి వస్తుంది. అప్పటి నుంచి పార్వతీ దేవిని బతుకమ్మగా తొమ్మిది రోజులు పూజించి పండుగ జరుపుకుంటారని కూడా చెబుతారు.

ఇంకో కథ ఏమిటంటే, ఒక రైతుకు ఆరుగురు బిడ్డలు పుట్టి చనిపోతారు. ఏడో బిడ్డను 'నీవైనా 'బతుకమ్మా బతుకు' అని పెద్దలందరూ ఆశీర్వదిస్తారు. ఆమె పెరిగి పెద్దదై ఒకరోజు తన వదిన, ఆడపడుచులతో చెరువులో స్నానానికి వెళ్తుంది. అక్కడి వారి బట్టలు తారుమారవుతాయి. దీంతో గొడవ జరిగి వదిన బతుకమ్మను చంపి చెరువు గట్టున పాతి పెడుతుంది. బతుకమ్మ తండ్రికి కలలో కనిపించి, విషయమంతా వివరించి, తాను చెరువు గట్టున తంగేడు చెట్టుగా వెలిసానని చెబుతుంది. తండ్రి దుఃఖాన్ని తీర్చడానికి తన పూలతో ఆడపడుచులు బతుకమ్మను పేర్చుకుని ఆడుకోవాలని చెబుతుంది. ఆమె కోరిక ప్రకారమే బతుకమ్మ వెలిసిందని కూడా అంటారు. యోధులు అయిన ఏడుగురు అన్నదమ్ములు ఒక్కగానొక్క చెల్లెలిని ప్రాణానికి ప్రాణంగా పెంచుకుంటారు. వదినలకు ఆమె అంటే కోపం. అన్నలు వేటకు వెళ్లాక ఆమెను చిత్రహింసలు పెడతారు. అవి తాళలేక ఆమె బావిలో పడి చనిపోయి తామర పువ్వుగా ఉద్భవిస్తుంది. అన్నలు చెల్లి కోసం వెతుకుతూ బావిలోకి చూడగా తామర పువ్వు కనిపిస్తుంది. అదే సమయంలో అటుగా వచ్చిన రాజు దాహం తీర్చుకోవడానికి బావిలోకి దిగుతాడు. తామరను తెచ్చి తన కొలనులో వేస్తాడు. కొంతకాలానికి విష్ణుమూర్తి ఆ పువ్వును మనిషిగా మార్చి వివాహమాడతాడు. ఆమె గౌరమ్మ. జానపదులు ఈ కథను యాది చేసుకుంటూ బతుకమ్మను జరుపుకుంటారు.

**పూలనే వాడటానికి కారణం...**

మహిళలంతా బతుకమ్మలతో చెరువు గట్టు మీద చేరి జీవితానుభవాలను, అనుభూతులను, పౌరాణిక గాథలను, సంఘటనలను లయబద్ధంగా పాడుతారు. బతుకమ్మలో ప్రతి పువ్వుకు విశిష్టత ఉంది. తంగేడు పువ్వుకు ఎక్కువ విశిష్టత ఉంది. దానికి కారణం అది గుత్తులు గుత్తులుగా విరబూస్తుంది. తమ సంసారం కూడా అట్లా పచ్చగా, పుష్టిగా ఉండాలని మహిళలు కోరుకుంటారు. వాసనలేని పూలను దేవుని పూజకు వాడరు. బతుకమ్మకు ప్రకృతిలో దొరికే ప్రతి పువ్వును వాడతారు. గునుగు, టేకు, తంగేడు, గుమ్మడి, కట్ల, కాకర, గన్నేరు, పొట్ల, పొగడ, రుద్రాక్ష, గోరింట, మల్లె, బంతి, చామంతి, శంకు, ఇలా అనేక రకాల పూలతో బతుకమ్మను పేరుస్తారు. ప్రకృతి నుంచి సేకరించిన పూలను మళ్లీ ప్రకృతికే సమర్పించుకోవడం బతుకమ్మను నిమజ్జనం చేయడంలో ఆంతర్యం. ఇవి చెరువులు కుంటలలో ఉన్న నీటిని శుభ్రపరచడానికి ఒక ఔషధంగా పనిచేస్తాయి. తెలంగాణలో సాధారణంగా భాద్రపద బహుళ పంచమి వరకు మెట్ట పంటలన్నీ ఇళ్లకు చేరుకుంటాయి. రోజుకో ధాన్యంతో పిండి వంటలు చేసి దైవానికి అర్పిస్తారు. వీటిని సద్దులు అంటారు. బతుకమ్మకు వీటిని సమర్పిస్తారు. కాబట్టి అది సద్దుల బతుకమ్మ అయింది. ఎంత పేదవారైనా బతుకమ్మ పండుగకు తమ కూతుళ్లను అత్తారింటి నుంచి తమ ఇంటికి తీసుకు వస్తారు. వారికి చీర సారెలు పెట్టి కుటుంబమంతా పండుగ సంబరంలో మునిగిపోతారు. అందుకే తెలంగాణ కొండగుర్తు బతుకమ్మ పండుగ.

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచేది బతుకమ్మ పండుగ. తెలంగాణ ఆడపడుచులు అంతా సంబరంగా జరుపుకునే వేడుక. బంధాలను, అనుబంధాలను గుర్తు చేస్తూ, ప్రకృతిని ఆరాధిస్తూ, తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి చాటి చెప్పే పండుగ బతుకమ్మ పండుగ. ఇదో పూల పండుగ, ప్రకృతిని పూజించే పండుగ. తొమ్మిది రోజుల పాటు ఆడి పాడి గౌరీ దేవిని అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించే తెలంగాణకే ప్రత్యేకమైన పూల సంబరం బతుకమ్మ పండుగ.





## బతుకమ్మను పేర్చే విధానం.. మహిళల ఆట .. నిమజ్జనం

రాగిపళ్ళెంలో తంగేడు ఆకులు అమర్చి వాటిపై తంగేడు పూల కట్టలు పేర్చి, మధ్య మధ్యలో ఇతర పూలను వినియోగిస్తూ కలర్ ఫుల్ గా బతుకమ్మను పేరుస్తారు.ముఖ్యంగా బతుకమ్మను పేర్చడానికి తంగేడు, గునుగు, కట్ల పూలను ఎక్కువగా ఉపయోగిస్తారు. పువ్వులతో చక్కగా బతుకమ్మను త్రికోణాకారంలో పేర్చి దానిపై పసుపు తో గౌరమ్మను తయారుచేసి పెడతారు. ఇలా తయారు చేసిన బతుకమ్మను దైవంగా పూజిస్తారు. సాయంత్రం సమయంలో అందరూ తమ బతుకమ్మలను తీసుకుని, ఒక్క చోట చేరి ఆడి పాడి ఆపై బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేస్తారు. అమ్మవారికి నైవేద్యంగా పెట్టిన ప్రసాదాలను మహిళలు ఒకరికొకరు పంచుకుంటారు. ఇస్తినమ్మ వాయనం పుచ్చుకుంటినమ్మ వాయనం అంటూ పళ్లెంలో తెచ్చిన నీళ్లతో వాయినాలు ఇచ్చి పుచ్చుకుంటారు.ఈ ఊరు ఆ ఊరు అన్న తేడా లేకుండా రాష్ట్ర వ్యాప్తంగా బతుకమ్మ సంబరాలు అంబరాన్ని తాకుతాయి. లక్షలాదిగా మహిళలు పట్టు చీరలు కట్టుకొని, పుత్తడి బొమ్మల్లా ముస్తాబై సద్దుల బతుకమ్మను జరుపుకుంటారు. పేద, ధనిక అనే తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ ఒక్క చోట చేరి ఆడి పాడి సంతోషంగా గడుపుతారు.

## ప్రజల బతుకుల్లో బతుకమ్మ వెలుగులు నింపాలి

### బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శుభాకాంక్షలు

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ అస్తిత్వానికీ, సాంస్కృతిక జీవనానికి ప్రతీక.. బతుకమ్మ పండుగ సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతిని, పూలను దేవతగా కొలిచే బతుకమ్మ పండుగ ప్రపంచ సంస్కృతీ సాంప్రదాయాల్లోనే ప్రత్యేకతను చాటుకుందన్నారు.రాష్ట్ర ప్రజల జీవితాల్లో ప్రకృతి మాత బతుకమ్మ వెలుగులు నింపాలని ప్రార్థించారు.తర తరాలుగా మహిళా సామూహిక శక్తికి ఐక్యతకు దర్పణమైన బతుకమ్మ పండుగ, తెలంగాణ రాష్ట్ర సాధనకోసం సాగిన సాంస్కృతిక ఉద్యమంలో అన్ని వర్గాల ప్రజల అస్తిత్వ ఆకాంక్షలకు వేదికగా నిలిచిందని కేసీఆర్ తెలిపారు.ఎంగిలి పూలతో ప్రారంభమై సద్దుల తో ముగిసే తొమ్మిది రోజుల బతుకమ్మ సందర్భంగా పల్లెలు పట్టణాలు భేదం లేకుండా మహిళలతో పిల్లా పాపలతో ప్రత్యేక సందడి నెలకొంటుందని కేసీఆర్ తెలిపారు.బతుకమ్మ పండుగ విశిష్టతను ప్రాశస్త్యాన్ని గుర్తించిన నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మ'ను రాష్ట్ర పండుగగా ప్రకటించిందని తెలిపారు. మహిళల ప్రత్యేక పండుగగా గుర్తించి బతుకమ్మ సందర్భంగా ప్రత్యేక కానుకలను అందజేసిన విషయాన్ని కేసీఆర్ గుర్తుచేసుకున్నారు.తొమ్మిది రోజులపాటు బతుకమ్మ పండుగను ఆటా పాటలతో ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని, తెలంగాణ ఆడబిడ్డలను కేసీఆర్ కోరారు.

### ఆనందోత్సాహాలతో బతుకమ్మ పండుగ చేసుకోవాలి

#### టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ పండుగ సందర్భంగా తెలంగాణ ఆడబిడ్డలు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఈ విషయమై ఆయన ఒక ప్రకటన చేస్తూ తెలంగాణ ఆడబిడ్డలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతిని పూజిస్తూ రంగు రంగుల పూలతో జరుపుకునే బతుకమ్మ తెలంగాణ లో అత్యంత ముఖ్యమైన పండుగ అని అన్నారు. మహిళలు అత్యంత వైభవంగా నిర్వహించుకునే గొప్ప పండుగ బతుకమ్మ అని ఈ పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలని సీఎం ఆకాంక్షించారు.బుధవారం నుంచి జరుపుకునేఎంగిలిపూల బతుకమ్మ నుంచి సద్దుల పండుగ వరకూ అందరూ ఆనందంగా జరుపుకోవాలని రాష్ట్ర ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని, వారి కష్టాలను తొలగించాలని ప్రార్థించారు.

## తొమ్మిదిరోజుల బతుకమ్మ వేడుకలు .. నైవేద్యాలు

ఎంగిలిపూల బతుకమ్మగా మొదటి రోజు ఉదయం అత్యంత భక్తి శ్రద్ధలతో బతుకమ్మలను పేర్చి పూజిస్తారు. అమ్మవారికి నైవేద్యంగా నువ్వులు, బియ్యం పిండి, నూకలు కలిపి ప్రసాదం తయారు చేస్తారు. 2వ రోజు ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నాడు అటుకుల బతుకమ్మను జరుపుకుంటారు. అటుకులు, పప్పు, బెల్లంతో నైవేద్యం తయారు చేసే అమ్మవారికి నివేదిస్తారు. మూడవరోజు ముద్దపప్పు బతుకమ్మతో మహిళలు సంబరాలు చేసుకుంటారు. ముద్దపప్పు, పాలు, బెల్లంతో నైవేద్యం తయారు చేసి గౌరీ దేవికి సమర్పిస్తారు. నాలుగవ రోజు నానుబియ్యం బతుకమ్మను జరుపుకుంటారు. నానబెట్టిన బియ్యం, బెల్లం ,పాలు కలిపి నైవేద్యం తయారుచేసి అమ్మవారికి నివేదించి వేడుక చేసుకుంటారు. ఇక ఐదవ రోజు అట్ల బతుకమ్మను జరుపుకుంటారు. ఆ రోజు అమ్మవారికి నైవేద్యంగా అట్లను, దోసెలను పెట్టి పూజిస్తారు. ఆరవ రోజు బతుకమ్మను జరుపుకోరు. ఆరోజు అలిగిన బతుకమ్మ పేరుతో సంబరాలకు దూరంగా ఉంటారు. మళ్లీ ఏడవ రోజు వేపకాయల బతుకమ్మతో వేడుక చేసుకుంటారు. వేప పండ్లలా బియ్యంపిండిని చుట్టి, వాటిని బాగా వేయించి, వాటిని నైవేద్యంగా సమర్పిస్తారు. 8 వ రోజు వెన్నముద్దల బతుకమ్మతో సంబరాలు జరుపుకుంటారు. ఎనిమిదవ రోజు వెన్న, నువ్వులు, బెల్లం కలిపి నైవేద్యంగా తయారుచేసి అమ్మవారికి నివేదిస్తారు. తొమ్మిదవ రోజు చివరగా అత్యంత ముఖ్యమైన సద్దుల బతుకమ్మను జరుపుకుంటారు. ఆశ్వయుజ అష్టమి నాడు,అంటే దుర్గాష్టమి నాడు ఐదు రకాల నైవేద్యాలతో సద్దుల బతుకమ్మను గ్రాండ్ గా సెలబ్రేట్ చేసుకుంటారు. సద్దుల బతుకమ్మ రోజు అమ్మవారికి నైవేద్యంగా పెరుగన్నం, చింతపండు పులిహోర, నిమ్మకాయ అన్నం, కొబ్బరి అన్నం, నువ్వుల అన్నం తయారు చేసి అమ్మవారికి నివేదిస్తారు.ఈ తొమ్మిది రోజులు అమ్మవారికి నైవేద్యం పెట్టే వాటిలో రక రకాల తృణధాన్యాలను వినియోగిస్తారు.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com